భారతి

మాసపత్రిక

*

శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు

(1938-1972)

*


ఫిబ్రవరి 1988

సంపుటము : 65 సంచిక : 2

విడిపత్రిక వెల ఐదురూపాయలు

విషయానుక్రమణిక

ఫిబ్రవరి 1988



అనోలియమ్
కోల్డ్ రబ్
జలుబులు మరియు దగ్గుల
మీద ఇది ఎలా చల్లగా,
అయినా అమోఘంగా
పనిచేస్తోందో చూడండి.
Anoleum
Anoleum
6 ఔషధ దినుసుల ప్రక్రియ
అనోలియమ్ చల్లనైనది,
అయినా అమోఘమైనది.
అబాలగోపాలానికి అతి శీఘ్రంగా
ఉపశమనం కలిగిస్తుంది.

ALL THAT STANDS BETWEEN DARKNESS AND HIM IS



YOUR SIGNATURE.

India The land of diverse cultures Rich, varied traditions But, there are 11 million people who can't see the beauty and wonder of this land They suffer from cataract They live in a world that grows darker day by day And 2 million are added to this number every year

We, at LKS, take care of over 60,000 people's eyes every year People of all communities, people from different walks of life During 1987 alone we have operated on 2,400 cataract patients and have been able to make 70 villages cataract - free But still a lot needs to be done And you can help

As little as Rs 100 from you can enable us to perform a cataract operation and clear the darkness from someone's life

Help us, to help them

Lok Kalyan Samiti

A voluntary, non-political, non-profit, health and family welfare organisation

Set your sights on the nearly blind. Give.

To

Mr K S Gupta,
The General Secretary,
Lok Kalyan Samiti,
Sucheta Bhavan,
11-A, Vishnu Digambar Marg,
New Delhi-110 002
India

For Rs 100 per cataract operation, I would like to sponsor

*1 operation (Rs 100)	Payable	*yearly	*bi-monthly
*2 operations (Rs 200)		*half yearly	*monthly
*5 operations (Rs 500)		*quarterly	
*10 operations (Rs 1000)			

I am enclosing herein a crossed cheque/demand draft in favour of "Lok Kalyan Samiti" for Rs ____________________

Please send me details with photograph/s of the person/s I am sponsoring

Name ____________________ Age ____________________

Address ____________________

____

Profession ____________________ Tele ____________________

Date of birth Day ________ Month ________ Year ________ Marital Status ________

If married, date of marriage Day ________ Month ________ Year ________

Income tax exemption under section 80G of the Income Tax Act.

LINTAS. LKS. 23

స్వ విష యం

భారతి శ్రేయోభిలాషులలో ప్రథములు అనతగిన శ్రీ తిరుమల రామచంద్రగారి లేఖ ప్రచురిస్తున్నాము.

"మీరు పంపిన భారతి అందింది. మరల భారతి వచ్చినందుకు ఎంతో సంతోషిస్తున్నాను.

భారతిని ఆమూలాగ్రం చదివాను. పూర్వపు ప్రమాణాలకు ఎంతమాత్రమూ తగ్గిపోలేదని సంతృప్తి పడ్డాను.

శ్రీ చిలుకూరి వీరభద్రరావుగారిపై శ్రీ మల్లంపల్లివారు వ్రాసిన పాత వ్యాసం పునర్ముద్రించడం చాల సముచితంగా ఉంది. ఆంధ్రోద్యమానికి, ఆంధ్ర చరిత్రకు అంకితులైన వీరభద్రరావుగారిని ఇప్పటివారు మరచిపోయారు. ఆయన పుత్రులో మిత్రులో పెద్ద పదవులలో వుంటే శతజయంత్యాదులు జరిగేవి.

ఆధునికతను గురించిన వ్యాసం అనువాదమూ, పాశ్చాత్య సంప్రదాయ ప్రధానమూ అయినా మనకు బాగా ఉపయోగపడేదే. కనుక ప్రచురణ సమంజసంగానే ఉంది.

మేడిపండు కథ అద్భుతం. గోళ్ళమూడి లలితగారు పురాతత్త్వవేత్తిగానే నాకు తెలుసుగాని కథకురాలుగా తెలియదు. తల్లి కుమారునికి చేసిన ఉపదేశమనే చిన్న అంశాన్ని గొప్ప కథగా అల్లిన ఆమెను అభినందిస్తున్నాను. చరిత్రకారులు గమనించని ఇలాటి అంశాలతో శ్రీ జయశంకర్ ప్రసాద్ గొప్ప కథలు వ్రాశారు. ఇలాటివాటిని ప్రోత్సహించగోరినాను.

త్రిభువన చక్రవర్తి ఇమ్మడి రాజాధిరాజు శాసనములు వ్యాసం శాస్త్రీయ పరిశోధన వ్యాసం.

విజయనగర చరిత్రలో అప్రస్తుతాలు వ్యాసం చాల భావస్ఫోరకమైంది. వ్యాసకర్త అన్నట్టు విజయనగర చక్రవర్తుల దృష్టి పైనుంచి వచ్చే దాడిని అరికట్టడమే ప్రధానంగా భావించినట్టిది. కనుక రక్షణైక పరమయినది. తిమ్మరుసువంటి మహామేధావి బహమనీల విజయానికి ఉత్తరాన రాజ్య విస్తరణకు ఇతరులతో మంతనాలు జరుపలేదనలేము. ముక్కు తిమ్మన గయశాసనం దానికి సాక్షి. విజయనగర సామ్రాజ్య పతనానికి కృష్ణదేవరాయల కాలంలోనే బీజాలు పడ్డాయని వ్యాసకర్త అన్న మాటలతో నేను ఏకీభవించలేను. అళియ రామరాజు పరాకు, ముస్లింలను నమ్మడం, స్వామి ద్రోహులయిన సైనికులు కారణాలు. కృష్ణరాయలు ఇక పది సంవత్సరాలు జీవించివుంటే భారతదేశ చరిత్రగతి మారివుండేది. మరొక సంగతి. సురపురం కృష్ణా భీమా నదులమధ్య వున్న, విజయనగర సార్వభౌములకు మహావీరులను సమకూర్చిన రాజ్యం. ఆ పాలకులు రెండుసార్లు ఔరంగజేబును పల్టీలు కొట్టించారు. వారి రాజ్యం కంచివరకు ఒకప్పుడు వ్యాపించింది. వారు తలచుకొని వుంటే ఉత్తరాన చాల భాగం - వశమయ్యేది. కాని విధి బలీయం.

శ్రీ లింగమూర్తిగారి వ్యాసం చరిత్రా విరుద్ధమైన సంగతులతో చక్కగా వుంది.

వాస్తవాలకు అవల ఆధునిక నవల వ్యాసంలో చాల నిశిత విమర్శ ఆశించాను; కాని చివరకు తుస్సుమంది. నవలను వీరేశలింగంగారు సంస్కర్త గనుక, తమ సంస్కరణోద్యమానికి వినియోగించుకున్నంత మాత్రాన ప్రతివారు అలాగే వ్రాయనక్కరలేదు. ఈ వ్యాసకర్త తన పథకం ప్రకారం ఆధునిక నవలా రచయిత్రులను విమర్శించగలిగాడా? ఈయన రేడియోలో కులాల అడ్డుగోడలు కూల్చగలడు గాని, ఇప్పటి నవలలను చీల్చి చెండాడగలిగాడా? యుద్దనపూడి సులోచనారాణి గారి నవలలలో ఎన్ని కేవలం ఉబుసుపోకే అని ధైర్యంగా చెప్పగలడా? మరి దేనికి ప్యాటిట్యూడ్లు?

రావిశాస్త్రిగారి మూడు కథల బంగారం నిజానికి జ్ఞానపీఠం బహుమానార్హం. శ్రీ ముదిగొండ వీరభద్రయ్యగారు చక్కగా విశ్లేషించారు. కాని, ఆయనవంటి వారలా రామణీయకత వంటి వాటిని ప్రయోగించడం మనస్సు చివుక్కుమనిపించింది.

ప్రొఫెసర్ రాబర్ట్ మోర్టాన్ సోలో మంచి వ్యాసం. కాని చాలా వాక్యాలు ఇంగ్లీషు సాంప్రదాయంలో ఉన్నాయి. వాటిని ఎడిట్ చేయడం అవసరమని భావిస్తున్నాను. మీకు ఆ వ్యాసం చాలకాలం క్రిందే అంది వుంటుంది. ఒకచోట ఇప్పుడాయన వయస్సు 62 సంవత్సరాలు అని వుంది. ఆయన పుట్టింది 1924 ఆగస్టు 23. 63 ఏండ్లు దాటాయి. కనుక అలాటివి దిద్దితే బాగుండేది.

ఈ మాసం - మీ నక్షత్రఫలం భారతిలో ఇంతవరకు లేదు. పత్రిక ప్రతి నెల ప్రారంభంలో వచ్చినప్పుడే ఆ ఫలితాలు పాఠకులకు ప్రయోజనకరమవుతాయి. కనుక ఆలోచించండి. దానికి మారు జ్యోతిశ్శాస్త్ర చర్చలు వేయవచ్చు.

అచ్చు తప్పులు భయంకరంగా వున్నాయి. శ్రద్ధ వహించడం అవసరమని మనవి.

మరచాను - కవితల సంగతి:

భారతి ప్రాచీన కవితనుంచి దిగంబర ఏకాంబర శ్వేతాంబర కవితలను నిష్పక్షపాతంగా ప్రచురిస్తూనే వుంది. దీనిలో మూగబాస, జీవుని వేదన, జీవితమింతే బాగున్నాయి. భూగ్రహణం నాకు అర్థం కాలేదు. ఆద్యంతాల నడుమ నవ్వు, అగ్నిమయం కారాదు అవిచ్ఛిన్నం చేయి తిరిగిన కవితలు గనుక చెప్పక్కర్లేదు.

తిరుమల రామచంద్ర"

కీ. శే. చిలుకూరి వీరభద్రరావు

ప్రాచీనాంధ్రు లెవ్వరు? ఆర్యులు కారా!

ప్రాచీనాంధ్రు లెవ్వరు? ఆర్యులా? అనార్యులా? నాగరికులా? అనాగరికులా? ఇప్పటి యాంధ్రులును ప్రాచీనాంధ్రులును వేఱ్వేఱు జాతులవారా? ఒక్క జాతివారు కారా? అను ప్రశ్నములను ప్రఖ్యాత పండితులైన విజాతీయ పరిశోధకులు చర్చించుచు విపరీత సిద్ధాంతములను చేయుచున్నప్పుడును, మతభేదబుద్ధితోఁ బ్రాచీన ధర్మశాస్త్రవేత్తలు కొందఱు చరిత్రజ్ఞానము చాలమినో, ద్వేషము చేతనో సత్యమును మఱుఁగుపరచి భారత ప్రపంచము నంధకారములోఁబడి దారి తెన్నులు గానకుండునట్లుగాఁజేయు వ్రాతలు వ్రాసి యున్నప్పుడును, భరతఖండములో 'ఆంధ్ర' నామము మఱవకుండ ననేకశతాబ్దులుగాఁ బట్టుకొని విడువక మర్యాదను గాపాడుకొనుచు వచ్చిన మనము వానిని సహించి యూరకుండుట యెట్లు? అయ్యవి సత్యములు కావని మనము గ్రహించినప్పుడు వానిని సహేతుకముగా ఖండించి లోకమునకు సత్యమును బ్రకటించుట మనకు విధ్యుక్తధర్మము కాదా? ఇందు గర్వసంరంభ మేమియున్నది? భరతఖండము నిజమగు నాంధ్రతత్త్వచరిత్రమును సరిగా సంపూర్ణముగా గ్రహింపనంతకుఁ గృత్రిమజాతి భేదములు వాటంతటవియే సమసిపోఁగలవు. చూచితిరా యీ చిత్రము? స్మృతికారులకునెల్లఁ బెద్ద యగు మను వేమను చున్నాఁడో చిత్తగింపుఁడు. కారావర స్త్రీయందు నిషాదునకుఁ బుట్టినవాఁడు చమారీ (చర్మకారుఁడు) వాఁడట! బ్రాహ్మణస్త్రీయందు వైశ్యునకు జనించినవాఁడు వైదేహుఁడఁట! వైదేహస్త్రీయందు చమారీవానికిఁ బుట్టినవా రాంధ్రులును మేదులునఁట! వీ రుభయులును గ్రామములలో నివసింపరాదఁట! ఆంధ్రులు చండాలజాతి భేదముగ నిరూపించి వ్రాసెను.*

మనుస్మృతిలో నీవాక్యమును గూర్చిన బుద్ధిమంతున కెట్టిచరిత్ర జ్ఞానముకలదో యింకఁ జెప్పవలయునా? ఇంతకంటెను మేధావియైన మఱియొక శాస్త్రవేత్త యాంధ్రులకును మేదులకును వీధులలోఁ బెంటనెత్తుకొనుటయు, పాకీపనుల చేయుటయు, గుహ్యావయవముల స్పృశించుటయు వృత్తులని చెప్పియున్నవాఁడు (శూద్రకమలాకరము). వీరికంటెను మఱియొక బుద్ధిమంతుఁడు మేదస్త్రీయందు నాంధ్రునకుఁ బుట్టినవాఁడు యవనుఁడైన తురుష్కుఁడనియు వానికి గోవధఁజేసి జీవించుట వృత్తియనియుఁ జెప్పియున్నాఁడు.

> "మేదస్యవనితా భార్యా త్సంగతాంధ్రేణచేద్రహః । స సూత యవనపుత్రం తురుష్క స్సప్రకీర్తితః । ప్రసిద్ధో మ్లేచ్ఛ దేశేయో గోవధేనాస్య జీవనమ్"
>
> (శూద్రకమలాకరము)

ఇయ్యవి ధర్మశాస్త్రవేత్తలయిన మన్వాదులు వచించిన వాక్యములు గావున మనవారు కొందఱు వీనిని విశ్వసించి తా మాంధ్రుల మని చెప్పకొనుటకు సిగ్గుపడు చుందురు. ప్రాచీనాంధ్రులకును మనకును సంబంధములేదని చెప్పుచుందురు. భరతఖండములో నితర ప్రదేశములవారు సహితము మన మాంధ్రులము కామనియె నిన్న మొన్నటివఱకు తలంచు చుండిరి. భరతఖండములోఁ జాతుర్వర్ణ్యము తలయెత్తుటకుఁ బూర్వమునుండియు నున్న లక్షల కొలది జనసంఖ్య గల జాతులను నయితము సంకీర్ణ జాతులనుగఁ జెప్పిన మనువువాక్యము లెట్లు విశ్వాసార్హములగునో విషయ విమర్శ చేసి మనవారు చర్చింపరు. భారతవర్షీయజాతుల పరిణామ చరిత్రము నెఱింగిన యే చరిత్రకారుఁడును మనువు చెప్పిన సంకీర్ణజాతులను ప్రత్యేకజాతులనుగఁ బరిగణించునే గాని మఱియొక విధముగాఁ గళంకయుతములని తలంపజాలఁడు. బ్రాహ్మణస్త్రీలు శూద్రులతో వ్యభిచరింపగా చండాలజాతి పుట్టినదని చెప్పుట బ్రాహ్మణులకే యవమానముగాని చండాలురకు గాదు. లక్షల కొలది జనసంఖ్యగల చండాలజాతి ప్రత్యేక వ్యక్తిత్వముగల స్వతంత్రజాతి. మనుస్మృతి కారుడెట్టి యంధకారములో నుండి యనులోమ విలోమ జాతుల తత్త్వము దెలిపెనో యావివరమును మఱియొక వ్యాసమున దెలిపెదను. ఆంధ్రులనుగూర్చి మిడిమిడి జ్ఞానముతో ధర్మశాస్త్రవేత్తలేమి వ్రాసినను వీరికంటెను బూర్వము పుట్టిన యైతరేయ బ్రాహ్మణములో నాంధ్రులప్రశంస గలదు. అందు భారతవర్షఁపుడయిన విశ్వామిత్రుని సంతతిగాఁ జెప్పబడి

---

* కారావరం నిషాదాత్తు చర్మకారం ప్రసూయతే । వైదేహకా దంధ్రమేదౌ బహిర్గ్రామవ్యవస్థితౌ ॥

నారు * ఇందరియైతిహ్యా మిట్లున్నది. ఇక్ష్వాకు వంశములో పుట్టిన విదేహుని కొడుకగు హరిశ్చంద్రుడను రాజునకు నూర్వురు భార్యలున్నను పుత్రసంతానము లేకపోయినదట! అతఁడొకనాడు తన యింటిలోనున్న పర్వత నారదులను వారితో జెప్పుకొనఁగా వారు 'కొడుకు పుట్టిన నీకు బలియిచ్చెద'నని వరుణుని ప్రార్థింపుమనిరి. అతడట్లు చేసెనట! వరుణ ప్రసాదమున నాతనికొక కుమారుఁడు కలిగెను. వానికి రోహితుఁడని పేరు పెట్టెను. పిమ్మట వరుణుఁడెన్నిసారు లడిగినను హరిశ్చంద్రుఁడు కొడుకును బలి పెట్టక కొడుకు పెద్దవాఁడగువఱకు సాకులు చెప్పుచు వచ్చెనఁట! ఒకనాఁడు రాజు తన కుమారునకీ విషయము దెలుపఁగా నతఁడు తిరస్కరించి విల్లుచేతఁ బట్టుకొని యరణ్యమునకుఁ బోయి సంవత్సర కాలమచట నుండెనఁట! దీని నంతయు విని వరుణుఁడు హరిశ్చంద్రునిఁ బట్టుకొనియెనఁట. అంత హరిశ్చంద్రుని కడుపుబ్బెనఁట! అచట వనములో నాఱుపత్సరముల వఱకు హరిశ్చంద్రునికొడుకు సంచారము చేయుచుండి యొకనాఁడొక ఋషిని గనియెను. అతఁడు సుయవసుని కొడుకు అజీగర్తుఁడనువాఁడు. అతఁడు క్షుద్బాధాపీడితుఁడై యుండెనట! వానికి శునఃపుచ్ఛుఁడు, శునశ్శేపుఁడు, శునలాంగూలుఁడుఅను మూవురుపుత్రు లుండిరఁట. తనకు బదులుగా బలి యిచ్చుటకై వానికుమారులలో నొకని నొసంగినయెడల నూఱుగోవుల నిత్తునని రోహితుఁడు వాని నడిగెనఁట. తండ్రి పెద్దవానివల్ల కాదని కౌగలించుకొనియెనఁట! కడపటివానిని తల్లి కౌగలించుకొనియెనఁట. మధ్యవాఁడయిన శునశ్శేపు నిచ్చుటకు తల్లిదండ్రులంగీకరించిరి. రోహితుఁడు వారలకు గోవుల నిచ్చి శునశ్శేపుని గొనివచ్చి తండ్రికా వృత్తాంతమును జెప్పెనఁట! తండ్రి వానింగొనిపోయి వరుణునకు సమర్పింపగా నతఁడు 'బలికి క్షత్రియుని కంటెను బ్రాహ్మణుఁడే తగినవాఁడని పలికి హరిశ్చంద్రుని రాజసూయము చేయుమని యుత్తరు విచ్చెనఁట ! హరిశ్చంద్రుడు వీని జంపి దేవతలను సోమపానముచే సంతృప్తులను గావింపఁ దలచెను. ఈ మహాయజ్ఞమును నెరవేర్చుటకు విశ్వామిత్రుడు హోతగను, వశిష్ఠుఁడు బ్రహ్మగను, జమదగ్ని అధ్వర్యుఁడుగను, అయాస్యుఁడు ఉద్గాతగను నేర్పడిరఁట! శునశ్శేపుని యజ్ఞయూపమునకుఁ గట్టి కత్తి చేతఁబుచ్చుకొని వానిఁ జంపువాఁడు లేకపోఁగా వందలకొలది గోవులను లంచముగాఁ గైకొని అజీగర్తుఁడను ఋషి తన కుమారుని తానే చంపుటకు సిద్ధపడెనఁట! అప్పుడు శునశ్శేపుడు తన్ను నిశ్చయముగాఁ జంపుదురని యూహించి యేకమంత్రముతో ప్రజాపతి కడకుఁ బోయెనఁట. అతఁ డగ్నికడకును, అగ్ని సవిత్రుని కడకును, సవిత్రుఁడు వరుణుని కడకును, వరుణుడు అగ్నికడకును. అగ్ని విశ్వేదేవుల కడకును, విశ్వేదేవులు ఇంద్రుని కడకును, ఇంద్రుడు అశ్వినుల కడకును, అశ్వినులు ఉషస్సు కడకును పంపఁగా శునశ్శేపుడు మూడు మంత్రములచేఁ బ్రార్థింపఁగా వాని బంధనములు విడిపోవుటయె గాక హరిశ్చంద్రుని కడుపుబ్బు పోవుటయె గాక స్వస్థచిత్తుడయ్యెనట! శునశ్శేపుడు మిగిలిన యజ్ఞభాగమునఁ బాల్గొనియెనఁట! యజ్ఞము ముగిసిన పిమ్మట అజీగర్తుఁడు విశ్వామిత్రుని కడకు వచ్చి తన కుమారు నిమ్మని యడిగెను, విశ్వామిత్రుడు 'వల్లకాదు. దేవతలు నాకొసంగినారు గనుక నతఁడు దేవరాతుఁ డనఁబరఁగెను. అతఁడు విశ్వామిత్రుని పుత్రుఁడు గాని నీ పుత్రుఁడు కాఁడు పొమ్మనియె'ను. కాపిలేయులు, బభ్రవులు వీని సంతతివారని చెప్పెను. అంత అజీగర్తుఁడు తన కుమారునితో నిట్లు పలికెను. 'ఋషియైన అజీగర్తుని పుత్రుఁడ వగుటచేత నంగీరసుఁడవుగ నున్నాఁడవు. ఓ ఋషీ! నీ పూర్వుల మార్గమును దప్పకుము'. దీనికి దేవరాతుడిట్లు ప్రత్యుత్తరము చెప్పెను. 'నన్ను బలి యిచ్చుటకై నీవు కత్తిచేతఁ బట్టుకొనియుండఁగా వారు చూచినారు; ఇట్టిపని చేయువారు శూద్రులలోఁ గూడఁ గానరారు. నా యొక్క విలువ మూడు వందల గోవులుగా గ్రహించినావు. సంస్కరింపరాని దురాగతము నొనరించినావు ' అంతట విశ్వామిత్రుఁడు నిన్ను బలియిచ్చుటకు సిద్ధపడినవానికి పుత్రుఁడవుగా నుండకుము. నాకు పుత్రుఁడవుగా నుండుపు రమ్ము అని పలికెను. 'అంగీరసుండనైన నేను నీకెట్లు పుత్రుఁడుగా నుందు. నీ పుత్రులు నన్ను గైకొనుట కంగీకరింతురా?' యని ప్రశ్నించెను. అప్పుడు విశ్వామిత్రుడు తన నూర్వురు పుత్రుల నడిగెను. మధుచ్ఛందసుఁడు మొదలగువారేఁబది మంది కడపటివారు మాత్రము వానిని విశ్వామిత్రుని పెద్ద కొడుకునుగా నంగీకరించుటకు సమ్మతించిరి. వారి జ్యేష్ఠు లేఁబది మందియు సమ్మతింపరైరి. అందుకు విశ్వామిత్రుడు కోపించి వారిని దేశము సరిహద్దులలో నుండునటులు శపించెను. వారే ఆంధ్రులు, పుండ్రులు, శబరులు, పుళిందులు, మూతిబాలు మొద

---

* "తస్యహ విశ్వామిత్ర స్యైకశతం పుత్రా ఆసుః పంచాశత్ ఏవజ్యాయాంసో మధుచ్ఛందసః పంచాశత్ కనీయాంసః తదయే జ్యాయాంసోనతే కుశలమ్ మేనిరే. తాన్ అను వ్యాజహారాన్తాన్వః ప్రజాభక్షీ స్తేతిత ఏతేంధ్రాః పుండ్రాః శబరాః పుళిందా మూతిబా ఇత్యుదంత్యా బహవో భవంతి వైశ్వామిత్రాదస్యూనామ్ భూయిష్ఠాః,

లగు నామములతో నొప్పుచున్నారు. దస్యులలో ననేకులు విశ్వామిత్రునుండియె యుద్భవించినారు."

ఇది యొక విచిత్రమైన యితిహాసము ఇట్లు శబరపుళిందాదులతోఁ జేర్చుట వలన నాంధ్రులనార్యులనియు, ననాగరికులనియు పాశ్చాత్యులు పెక్కండ్రు తలంచుచున్నారు. అనార్యులనిగాని అనాగరికులనిగాని పై బ్రాహ్మణవాక్యములలో నేమియుఁ గానరాదు. అయ్యవి పాశ్చాత్యుల యూహలు. ఆంధ్రులు దస్యులలోఁ బరిగణింపఁబడిన మాట వాస్తవము దస్యు లనాగరికులని వేదములు ఘోషించుచున్నవని పాశ్చాత్యపండితులు వ్రాసెడి వాక్యములు సప్రమాణములుగఁ గైకొనరాదు. పూజావిధానమున సంభవించిన భేదములచేతనే ఆర్యానార్య శబ్దములు పుట్టినవి గాని జాతిభేదముచేఁగాని, అనాగరిక భేదముఁచేగాని పుట్టినవిగావు. ఆర్యు లెట్టి నాగరికులుగ నుండిరో దస్యులుగూడ నట్టి నాగరికులుగానే యుండిరి. ఇంద్రాగ్నులను దస్యులు పూజింపరు. అవ్రతులు, అపవ్రతులు, అన్యవ్రతులు, అనగ్నిత్రులు, అయజ్యులు, అయజ్వానులు, అబ్రహ్మలు, బ్రహ్మద్విషులు, అనింద్రులు, అని దస్యులు ఋగ్వేదములో పలుచోట్ల వర్ణింపబడిరి. ఇంద్రాగ్నులను బూజించువారుగను, యజ్ఞకర్మలను జేయువారుగను ఆర్యులు వర్ణింపఁబడిరి. దస్యులు కర్మనాశకులని నిరుక్తమునఁ బేర్కొనఁబడిరి. కర్మయుక్తులార్యులనియు, కర్మహీనులు దస్యులనియు స్పష్టముగ బోధపడఁగలదు. అనగా వారికిని వీరికిని పూజావిధానములు భిన్నములని తెలుపునేగాని, యార్యజాతుల వారికంటె దస్యులు భిన్నజాతులవారని తెలుపు శబ్ద ప్రయోగములు గానరావు. దస్యుల విషయములో ఋగ్వేదమునం దొకచోట (ఋగ్వే.మం. ౫-౨౯-౧౦) అనాసశబ్దమును బ్రయోగించుటచేత దస్యులు చప్పిడిముక్కులు గలవారిని యర్థములు గావించి పాశ్చాత్యపండితు లార్యులు వేఱనియు, దస్యులు వేఱనియు వింత సిద్ధాంతములను దేల్చి ప్రపంచమునంతను గగ్గోలు పెట్టుచున్నారు. ఆ శబ్దమునకు నోరులేనివా రనఁగా మంచి సంభాషణలు లేనివారని సాయనాచార్యులవారు భాష్యములో వ్రాసియుండగా మోక్షమూలరు పండితుడు ముక్కులేనివారని యర్థము చేసికొన్నారు. వీనిపైని వింతసిద్ధాంతములు బయలుదేరినవి. ఋగ్వేదమును జక్కఁగా మనము పరిశీలించితిమేని దస్యులార్యులకన్నను నాగరికులని బోధపడక మానదు. దస్యులు నగరములలో నివసించుచుండిరి. (ఋ. మం. ౧-౫౩-౮) (ఋ. మం. ౧-౧౦౩-౩). వారికి గోవులు, అశ్వములు, రథములు గలవు. (ఋ. మం ౮-౪౦-౭). (ఋ. మం. ౨-౧౫-౪). వారు వానిని నూఱు ద్వారములుగల నగరములలో నుంచిరి. (ఋ. మం. ౧౦-౯౯-౩). దస్యులు భాగ్యవంతులుగ నుండిరి. (ఋ. మం. ౧-౩౩-౪). వారికి బయళ్ళమీఁదను కొండల మీఁదను సొత్తు గలదు. (ఋ. మం ౧౧-౬౯-౭) వారికిని బంగారమును, నగలును గలవు (ఋ మం. ౧-౩౩-౮). వారి కనేక దుర్గములు గలవు (ఋ. మం. ౧-౩౩-౧౩ - మం. ౮-౧౭-౧౭). ఆర్యులవలెనే దస్యులును యుద్ధములలో రథము నుపయోగించుచుండిరి. (ఋ మం. ౮-౨౪-౨౭, మం ౩-౩౦-౫ ఋ. మం. ౨-౧౫-౧౪). వీనివలన దస్యు లనాగరికులు కారనియు, ఆర్యులవలెనే నాగరికులనియు, పూజావిధానమున నార్యులకంటె భిన్నులనియును, జాత్యంతరులు కారనియు బోధపడఁగలదు. ఈ విషయమును గూర్చి సంపూర్ణముగాఁ జర్చించుటకు నిచట తావు చాలదు. ఋగ్వేదములో ౧,౫౩,౯౭౨ పదములు గలవని చెప్పుదురు. వానిలో 'ఆర్య'శబ్దము ౨౩ సార్లును, 'దస్యు' శబ్దము ౭౦ సార్లును, దాసశబ్దము ౫౦ సార్లును మాత్రమే ప్రయోగింపఁబడియుండెననియు, ఇయ్యవి జాతిపదముగఁ బ్రయోగింపఁబడియుండలేదని వేదవిమర్శకులు వక్కాణించుచున్నారు. కనుక నైతరేయ బ్రాహ్మణములో 'ఆంధ్రుల'ను దస్యులలోని వారిగఁ జెప్పుటచేత వారి ననాగరికులుగఁ బరిగణింపరాదని స్పష్టముగాఁ గలదు. అనాగరికులైన పుండ్ర, శబర, పుళిందాదులతోఁ జేర్చుట వలన నాంధ్రు లనాగరికులని చెప్పవత్తురు. ప్రతిజాతిలోను నాగరికులు ననాగరికులు కూడ నుండిరి. వీరిలో నాగరికులులేరని యే ప్రమాణములతోఁ జెప్పఁగలరు ? పుండ్ర, శబర, పుళిందాదులలోఁ గూడ నాగరికులుగలరని యనేక ప్రమాణములను జూపవచ్చును. ఆ విషయమును ప్రత్యేకముగఁ జర్చింపవలయునే కాని నేఁడీ చిన్న వ్యాసమునఁ దెలుప సాహసింపరాదని మఱియొక మాఱునకు దానిని నిలుపుచున్నాను, ఐతరేయ బ్రాహ్మణకాలమును నిర్ణయించుటలోఁ జరిత్ర పరిశోధకులు భిన్నాభిప్రాయులై యున్నారు. అందు పేర్కొనఁబడిన జ్యోతిశ్శాస్త్రసంబంధము లయిన వానిని బురస్కరించుకొని ప్రొఫెస్సరు కోల్ బ్రూకనువా రిప్పటికి ౩౩౦౦ సంవత్సరముల క్రిందట రచింపఁబడి యుండవచ్చు నని తెలుపుచున్నారు. ప్రొఫెస్సరు మ్యాక్సుముల్లరు పండితుఁడు ౨౫౦౦-౨౮౦౦ సం॥ల నడుమ రచింపఁబడి యుండవచ్చునని తలంచుచున్నాఁడు. ప్రొఫెస్సరు విల్సను పండితుఁడు క్రీస్తునకు పూర్వము ౧౦-౧౧ శతాబ్దులనఁగా నిప్పటికి ౩౦౦౦ సం॥ల క్రిందట నైతరేయ బ్రాహ్మణము రచింపఁబడియుండవచ్చునని తెలుపుచున్నాఁడు. మఱియును సుప్రసిద్ధుఁడైన రామకృష్ణ గోపాల భాండార్కరు గారు విల్సను

పేర్కొనిన కాలముకంటెను బూర్వమునకుఁ బోవలయు నని వక్కాణించి యున్నారు. ఐతరేయ బ్రాహ్మణమును భాషాంతరీకరించిన డాక్టరు 'హోగ్' అనువారు ౪౦౦౦ సం॥లకుఁ బూర్వమె యైతరేయ బ్రాహ్మణము పుట్టియుండు నని చెప్పియున్నారు. వీరి సిద్ధాంతము లెట్టి వయినను బహుప్రాచీన మైన గ్రంథ మనుటకు సంశయింపం బనిలేదు. అయినను నిట్టి పురాతన బ్రాహ్మణములలో సహితము నూత్న విషయములు చొప్పింపఁబడి యుండక మానలేదు. ఆ విషయ మటుండ నిండు. ఇంతటి ప్రాచీన మైన బ్రాహ్మణములో 'ఆంధ్రు'ల నామములు వినంబడుచున్నవి. దస్యులు నాగరికులని ఋగ్వేదమువలన రుజువు చేసితిమి గావున నాంధ్రులు దస్యులలోని వారని చెప్పుటచేత నాంధ్రులు గూడ నాగరికులేయని తేటపడుచున్నది. ఇప్పటికి మూఁడువేల సంవత్సరములకుఁ బూర్వమే నాగరికు లయిన యాంధ్రజాతుల వారున్నట్లు మనకీ బ్రాహ్మణము వలనఁ దేటపడుచున్నది. మఱియు నింకొకవిశేషము గలదు. భారతులలోనివాఁడని వక్కాణింపఁబడిన విశ్వామిత్రుని సంతతివారని వీరు తెలుపఁబడుటచేత వీరలు భారతీయశాఖలలోనివారని సారాంశము తేలుచున్నది. భారతర్షభుఁ డైన విశ్వామిత్రుఁడు సామాన్యుఁడు గాఁడు. ఆర్యకర్మలలోనికి దింపి భారతజాతిని సముద్ధరించినవాఁడు విశ్వామిత్రుఁడు. సుప్రసిద్ధమైన గాయత్రీ మంత్రముచే మెప్పెడి ఋగ్వేదములోని మూఁడవ మండలమునకు నధికారియైన ఋషి విశ్వామిత్రుఁడే. ఇతఁడు మొదట నార్యులకు రాజుగ నుండిన సుదాసునకుఁ బురోహితుఁడుగ నుండి తృప్తికరముగ గార్యములు నిర్వహించుచున్నను, వసిష్ఠునితో స్పర్థ యేర్పడి త్రిత్సులను నార్యశాఖవారిని విడిచి భారతులనుజేరి సుదాసునితోడను, వసిష్ఠునితోడను త్రిత్సులతోడను బోరాడెను. తిత్సులలోనివాఁడు వసిష్ఠుఁడు. భారతులలోనివాఁడు విశ్వామిత్రుఁడు. వీరికి జరిగిన యుద్ధములు ఋగ్వేదములోను బ్రాహ్మణములలోను, పురాణేతిహాసములలోను వర్ణింపఁబడినవి. విశ్వామిత్రుఁడు గొప్ప సంస్కర్తగఁ గన్పట్టును. ఇతనికి మొదట నపజయము సంభవించెను గాని తరువాత విజయము లభించెనని గ్రంథములు చాటుచున్నవి. చదువరులార! ఇంకొక ముఖ్యవిషయమును జ్ఞప్తియందుంచుకొనుడు. ఆంధ్రులవలెనే విశ్వామిత్రసంతతిగాఁ జెప్పబడి యజ్ఞసంస్కారముచే పూతుఁ డైన దేవరాతుని జ్యేష్ఠునిగ నంగీకరించిన మధుచ్ఛందులను, ఋషభులను, రేణులను, అష్టకులను మఱవకుఁడు! అనఁగా నాంధ్రాదిజాతులవారి సోదరజాతులని చెప్పఁదగిన యీజాతులు విశ్వామిత్రుని సంస్కారముల సంగీకరించి పరశురామాది బ్రాహ్మణులకు జన్మస్థానము లయినవి. వీనింగుఱించి యొక పెద్దగాథ కలదు. ఆ గాథ వలన చండాలత్త్వము బాగుగా బోధపడఁ గలదు. దానిం బ్రవ్వుట కిది యదను గాదు. శః బ్రాహ్మణములో విశ్వామిత్రుని భారతర్షభయని సంబోధించుట చూడ విశ్వామిత్రుఁడు ఋషభశాఖలోని వాఁడు గావలయును. విశ్వామిత్రునికి మేనక యను అప్సరసయందు శకుంతల జనించి దుష్యంతుని భార్యయై భరతునిఁ గని నతఁడు రాజ్యభారమును వహించి పరిపాలించుటచేత నీయూర్యావర్తదేశమునకు భరతఖండ మని పేరు గలిగినది వీని సంతతివార మని చెప్పుకొను భారులు లేక రాజభారులను తెగవా రిప్పటికి నుత్తరదేశమునందు గలరు. భారతులు చాలకాలము పరిపాలనము చేసి ప్రాగ్దేశము నాక్రమించి యుండిరి. కనుక పాణిని గూడ "బహువచ ఇ౹౹ ప్రాచ్య భారతేషు" అని ప్రాచ్యభారతులఁ పేర్కొనియున్నారు. ప్రాచీనకాలములోనే వీరలు రెండు తెగలుగా విడిపోయినట్లు గన్పట్టగలదు. వారే కురుపాంచాలురు. ఋగ్వేదములో కురుపాంచాలురని కలిపిగాని ప్రత్యేకముగా కురుజనులనిగాని పాంచాలురనిగాని వాడియుండుట గానరాదు. కాని ఋగ్వేదమునందొక చోట భారతులలోని రెండు పక్షములను సుదాసుఁడు జయించిన విషయమును శ్లాఘించుచు వసిష్ఠుఁడు రెండు వైకర్ణజాతులలోను ఇరువదియొక్క కుటుంబముల వారిని సుదాసుఁడు చెల్లాచెదరు గావించెనని చెప్పఁబడిన రెండు తెగలును కురు కృపులు గాని కురుపాంచాలురు గాని యై యుందు రేమో విచారింపవలయును.* ఋగ్వేదములోని రెండు ఋక్కులలో 'కృపు' లను వారు అసిక్నీ సింధు నదులకు నడుమ పై భాగమున నివసించుచుండిరని తెలుపఁబడి యుండెను.(కృవయ ఇతిహవై పురా పాంచాలనా చక్షతే.) పాంచాలురకు కృవులను నామము పరిహాసముగ వాడఁబడినట్లు గన్పట్టుచున్నది. పుస్తకము గిస్తకము, గుఱ్ఱము గిఱ్ఱము, శాస్త్రము గీస్త్రము అన్నట్లు కురుశబ్దము కృవిశబ్దముతోఁ జేర్పబడినట్లు దోఁచఁగలదు. దానిని పాంచాలురకు వర్తింపఁజేయుట చూడఁ బాంచాలు రొకప్పుడు పరిహాసపాత్రులుగఁ జూడఁబడినట్లు గన్పట్టఁ గలదు. కురుపాంచాలాదులు కొంతకాలము కలసి మెలసి యుండి గంగా తీరమునఁ గాలము గడిపియుండిరి గాని కొంతకాలమునకుఁ బ్రబల మైన మనః స్పర్థలు పెరిగి తుదకు మహాయుద్ధములు జరిగియు నేఁటి కాలమువరకు నాస్పర్థలు నిలిచియుండి యింకను భరతఖండ

* "ఏకంచయో వింశతింద శ్రవస్యా వైకర్ణయోర్జనాన్‌రాజా న్యస్తః" ఋ. మం. ౮. ౧౮. ౧౧.

మును పీడించుచుండుట మనయొక్క దురదృష్టము గాని మఱి యొండు గాదు.

ఈ కురుపాంచాలురు ఒక్కకూటమివారేయని తెలుపుటకు పురాణాదులలో వర్ణింపబడిన వీరి వంశములే సాక్ష్యమీయఁగలవు. మొదట భరత సంతతివారు రాజ్యముచేయుచుండిరి. వారిలో సంవరుణఁడను రాజుతో భరతసంతతి తుదముట్టినట్లు గన్పట్టగలదు. భరతునివంశములోఁ బుట్టిన అజామీఢుని వంశములో ముద్గలుఁడు శృంజయుఁడు, బృహదిశుఁడు, ప్రవీరుఁడు కాంపిల్యుఁడునను నైదుగురు పుత్రులును పాంచాలు రయిరని పురాణములు చాటుచున్నవి గాని వివరము దెలుపుటలోఁ బరస్పర విరుద్ధములుగా నున్నవి. సంవరుణుని కాలమునే దుర్ముఖుఁడను పాంచాలరాజు వానిని యుద్ధములో నోడించి తఱుమఁగా నతఁడు సింధుతీరమునకుఁ బాఱిపోయి కొంతకాల మక్కడనున్నట్టు ఐతరేయ బ్రాహ్మణము వలనఁ గన్పట్టఁగలదు. తరువాత సంవరుణుఁడు వసిష్ఠుని పురోహితునిగాఁ జేసికొని మరల పాంచాలురను జయించి తన రాజ్యమును సంపాదించి సూర్యపుత్రిక యగు తపతిని వివాహము చేసికొని ప్రజారంజకముగఁ బరిపాలనము చేసెను. వీనితరువాతనే వీని పుత్రుడు 'కురు' అనువాఁడు రాజ్యభారమును వహించి పరిపాలనము చేయుట చేతనే యా దేశమునకు 'కురుజాంగల' దేశమని ప్రఖ్యాతి గలుగుటయు, 'కురుక్షేత్రము' వీనితపస్సుచేత పావనమగుటయు సంభవించినది. పాంచాలురను గూర్చిన చరిత్రము మహాభారతములో చెప్పిన దానికిని హరివంశము విష్ణు పురాణాదులలోఁ జెప్పిన దానికిని పెక్కుభేదములతోఁ గాన్పించుచున్నది. పాంచాలురవలననే పంజాబునకు పాంచాలమని పేరు వచ్చినది. దేశమును సంరక్షించుటకుఁ దనయైదుగురు పుత్రులుచాలుదురు గనుక పాంచాలురని పేరువచ్చినట్లు హర్యాశ్వుఁడు పలికినట్లు హరివంశమునందుఁ జెప్పబడినది.* పంచనదుల మధ్య నైదు విషయములుగలది గనుక పంచనదమైనదని భాగవత పురాణము (పాంచాలాఃపంచవిషయా యన్మధ్యేనవ కంపురం- భా. పు. ఆ. ౯-౨౨ ౩.జరాసంధుని కాలమున పాంచాలురు దక్షిణమునకుఁ దఱుమఁబడిరని భారతము తెలుపుచున్నది. ఏకారణమైన నేటి యుత్తరపాంచాలురని దక్షిణపాంచాలు రని రెండు తెగలవారయిరి. పాణినికాలమునఁ బ్రాక్పాంచాలురు, పశ్చిమపాంచాలు రను తెగలున్నట్లుగఁ బాణిని పేర్కొనియున్నాఁడు. ఈ పాంచాలురను విదేశీయచరిత్ర కారులయిన టాలమీ, అర్రియాన్, ప్లినీ మొదలగువారు పేర్కొని యున్నారు. మొత్తము మీఁద పాంచాలుర భూములను కురుసంతతి వారాక్రమించుకొనిరి. ఇవన్నియుఁ బురాణాదులలోఁ జెప్పబడిన సూక్ష్మవిషయములు. వీనిని విమర్శించి వ్యాఖ్యానముచేయ మొదలుపెట్టిన గావలసినంత చరిత్రము బయలు దేఱును. పంచపాండవులును పాంచాలురకు సంబంధించినవారని మహాభారతమునుబట్టి మనమెఱుంగుదుము. కురువంశములో ధృతరాష్ట్ర పాండురాజులు జనింపక పూర్వము నడచిన కురు పాంచాలుర యుద్ధములు ప్రథమభారతమునకు సంబంధించిన వని సులభముగా గ్రహింపవచ్చును. కురువంశమున ధృతరాష్ట్ర పాండురాజుల జన్మముతో 'ఆంధ్రులచరిత్ర' ప్రారంభమగుచున్నది. ఆంధ్రులు కురు పాంచాల శాఖలకు సంబంధించినవారే గాని యన్యులు కారు. అంధరాజపుత్రులయిన కౌరవులున్నూ, పాండవులును ఆంధ్రులు. మా చదువరుల కిది యొక వింతగా గన్పట్ట వచ్చును. ఇది వింతకాదు. సత్యమని త్రికరణశుద్ధిగా విశ్వసించుచున్నాఁడను. ప్రబల ప్రమాణములు గలవు. అయినను నేఁడొక సూక్ష్మవిషయమును మాత్రము వక్కాణించి విడిచెదను. ఆంధ్రసోదరులారా! వినండి. ఈ వినండి యనుదానిలోఁ గనంబడెడి 'అండి' అనుపద మేమిటి? ఇదేభాషలోనిది? ఆంధ్రదేశములో నా బాలవృద్ధులు స్త్రీ పురుషాదులు సర్వులు వాక్యాంతముల గౌరవసూచకపదముగా ప్రయోగించుచు వ్యవహరించుచున్నారు. 'అవునండీ, కాదండీ, నేను వెళ్ళలేనండీ, నేను వెళ్లతానండీ' ఈ విధముగా సంభాషణములలో 'అండి' అను గౌరవ వాచకపదమును జేర్చి సంభాషించుట సర్వజనవిదితముగదా! ఈయది ప్రాచీనాంధ్ర భాషాపద మైన 'ఆండి' యొక్క రూపాంతరము. ఆండి యనఁగా ప్రభువని యర్థము. ఆండవాన్ అనునది మఱియొకరూపాంతరము. ఆండవాన్‌యొక్క బహువచనము 'ఆండవార్' అనునది. వీనికి 'అండాన్, అండార్' అనునవి రూపాంతరములు. ప్రాచీనాంధ్రభాషలో నుండి పుట్టినవి గనుక తమిళభాషలో నీ పదములు గ్రంథస్థములై నిఘంటువులలోఁ జేర్పఁబడి వ్యవహారము నందున్నవి. ఇప్పుడు మనము 'ప్రభువునకు' రాజశబ్దము వాడుకొనుచున్నట్లు ప్రాచీనకాలమున 'అంధ' జాతులవారు 'ఆండి' శబ్దమును వాడుచుండిరి. ప్రాచీన కాలము నుండి పర్వతములలో నివసించుచున్న కురువ జాతులవారు సయితము తమతెగల

* "ముద్గలా చ్ఛృంజయాశ్చైవ రాజా బృహదిశు స్మృతః । యవినతశ్చ విక్రాంతః శృమిలాశ్వశ్చ పంచమః
పంచైతే రక్షణాయాలం దేశానాం ఇతి విశ్రుతాః । పంచానాఁ విద్ధి పాంచాలాన్ స్ఫుఁరైర్జనపదైర్వృతాన్."
(హరివంశము.., అ. ౩౨, ౩౩, ౩౬)


కౌరశనమును వహించిన తెగలను 'ఆండకురవ' లని వ్యవహరించుచుండగా మనము వినుచున్నాము. ప్రాచీనకాలమున నార్యావర్త దేశమున నార్యుల పూజాకర్మ విధానముల నంగీకరింపక వారితోఁ బోరాడి సరిహద్దుల దేశములకుఁ దొలఁగిపోయి పెఱమతముల నవలంబించిన తమ తెగలవారిని పై యార్యకర్మ విధానములకు లోఁబడిన కురు పాంచాలాదులు 'అంధు'లని వ్యవహరింపుచుండిరి. వీరినే యిటీవలి పురాణకారులు ద్రావిడులని వ్యవహరించిరి. ఇంతియేకాని మహాభారతములో వర్ణించినట్లు వసిష్ఠుని హోమధేనువుయొక్క శుక్రణ్మూత్రములలో ద్రమిళులు పుట్టినారని తలంచుట సంబద్ధముగాదు. దానికి గూఢమైన చరిత్రార్థముగలదు. అంధ జాతులవారికి నెల్ల తలమానికమై నిలిచి యార్యకర్మ లవలంబించిన భారతులకు (కురుపాంచాలురకు) నెదురొడ్డి బహు కాలము పోరాడి ప్రముఖులై ముందు నిలువబడుటచేత నాంధ్రులను గూడ నంధులుగనే వ్యవహరించిరిగాని యీ పోరాటములలో నంధజాతులలో ధృతరాష్ట్రులయిన వారాంధ్రులు అనగా రాజ్యమును బొందినవారు. వీరి చరిత్రము రెండవ భారతమునకు సంబంధించినది. ధృతరాష్ట్రుఁడను సంస్కృత శబ్దమునకు 'ఆండకురవ' అనునాంధ్ర భాషాశబ్దము సమానార్థమును బోధింపఁగలదు. ఆండార్ శబ్దము "ఆంధ్రా" శబ్దముగా సంస్కృతీకరింపబడినది. పల్లవాన్+ఆండి పల్లవాండియై పల్లాండియై పాండియైనది. ఆండయ అన్న; పాండయ తమ్ముడు. వీరి భ్రాతృత్వమును గూర్చి మఱియొకమాఱు ముచ్చటించెదను.

ఆండయ పాండయ సంతతులే యాంధ్రులనంబడుచున్నారు. ఎవ్వరినిగూర్చి మీరు నిరంతరము మహాభారతములోఁ జదువుచుందురో అట్టి కౌరవ పాండవులే యాంధ్రులని తెలిసికొనుడు. దేని కైనను సంశయింపవచ్చును. దీనికి సంశయింప బనిలేదు. కాఁబట్టి సోదరులారా! ఆంధ్రులను మీరు మన్వాది శాస్త్రవేత్తలు తలంచినట్లు చండాలురుగఁ దలంతురా? మీరు పాంచాలురను, కౌరవ పాండవులను, గౌడ ద్రావిడులను గూడ చండాలురుగనే పరిగణింపవలసి వచ్చును. మీరు కురు పాంచాలాదులను, కౌరవ పాండవులను, గౌడద్రావిడులను ఆర్యులనుగఁ దలంతురా యాంధ్రులు నార్యులే యని మన్వాదులను విశ్వసింపక వారి వాదముల త్రోసిపుచ్చవలసి యుండును. నామట్టునకు నార్యునకు చండాలునకు గుణకర్మములు దక్క భేదము జాతిలోఁ గన్పట్టదు. తా మార్యులమని విఱ్ఱవీఁగుచున్న యింగ్లీషువారు, జర్మనులు, ఫ్రెంచివారు మొదలగువారు మనకంటె జాతిలో భిన్నులుగారు. ఆ చిత్ర చరిత్రము మఱియొకమాఱు వినిపింతును. ఆర్యులను వారికంటె ద్రావిడులను వారి నాగరికత ప్రాచీనమైనది. ఆర్యుల యొక్కయు, ద్రావిడుల యొక్కయు, అనార్యుల యొక్కయు నాగరికతా సమ్మేళనమే యిప్పటి హిందూనాగరికత. ప్రాచీన వైదిక బ్రాహ్మణుని నాగరికతకంటె నిప్పటి హిందూ బ్రాహ్మణుని నాగరికత గొప్పది యనుటకు సంశయము లేదు. భరత ఖండములో బ్రాహ్మణు డెంతవఱకు గోవధలను జేయుచు గోమాంసమును మెక్కుచుండునో అంతవరకు అస్పృశ్యతా దోషము చండాలురకుఁ బట్టలేదు. ఎప్పుడు బ్రాహ్మణుఁడు గోవులను చంపుటమాని గోమాంసమును బరిత్యజించి గోవులను బూజించుటకుఁ బ్రారంభించెనో అప్పటినుండియు జండాల జాతులంటరానివైనవి. మన మాంధ్రుల మనుట కెంతమాత్రమును సందియము లేదు. ఆర్యులు మనకంటె భిన్నులు కారు.

(జనవరి, 1924 భారతి నుండి పునర్ముద్రితం)

* ఒక మహాగ్రంథములోఁ జెప్పవలసిన విషయములను సంగ్రహపఱచి బహు సూక్ష్మముగా నీ చిన్న వ్యాసములో సూచింపవలసి వచ్చినది. సంస్కృత మహాభారతములోని ప్రతిపదమును బట్టుకొని విషయవిమర్శ చేసినచో నెంతయో చరిత్రము బయలుదేరక మానదు అదియే నేనిప్పుడు చేయుచున్నాను. మన చరిత్రమంతయు మహాభారతమునం దిమిడియున్నది. ఇది రెండువేల పుటలకు మించిన గ్రంథమగుచున్నది. ఈ గ్రంథమును నేను బ్రకటింపఁగలిగిన యెడల నా దేశమునకును నా ప్రజలకును నేను దీర్చవలసిన ఋణము దీర్చుకొన్నవాఁడ నగుదును.

"ఏమండీ. ఆ భరించలేని నొప్పి ఏమైంది?"





మేలుపరచబడిన అమృతాంజన్ వాడడంతో,

కోమలమైన అమృతాంజన్‌ను ఛాలా సులభంగా రాసుకోవచ్చు.

మృదువైన అమృతాంజన్‌తో చాలా సులభంగా 'మర్దనా' వేయవచ్చు.

తలనొప్పులను, వొళ్ళు నొప్పులను, కీళ్ళ నొప్పులను, కండరాల నొప్పులను మరియు బెణుకులను మేలుపరచబడిన అమృతాంజన్ మునపటికంటే అతి త్వరితంగా వుపశమింపజేయగలదు !

మేలుపరచబడిన

అమృతాంజన్

Amrutanjan Limited

మీ మోముపై చిరునగవులను శీఘ్రంగా- తిరిగి వికసింపజేయగలదు

వశ్యముఖి

ఘనఘోంతరాళము లగ్ని పూర్ణములగు-
వాని నడుమ నిచ్చైనయైన వాక్కునాది,
అస్మదాస్య వి నిర్గతమైన వాగ్వి
లాసమందు జగముతాను లయమునొందు ! [1]

అదితి నావాక్కు - గగనాంగణాంతర విల
సితమది - సకల వేదాంత ఋత పరిమళ
వీచికలు దానియందున వెల్గులీన
కాంతి పొందమ్ము పలుకును జగతికెపుడు. [2]

పవిత్ర తేజమ్ము నావాక్కు - సర్వమాన
వ హృదయాంతర దీప్తము వహ్నిచక్ర
సదృశమది - దీని కాహుతి సకల జీవ
భావములగును, వెల్గునదియెభాను రుచుల. [3]

ఇది యనింధనాగ్ని - మనసు లెంతమండు
చుండునో యంత తేజమ్ము నుండు-దాని
కవధిలేదు - సరస్వతియందె సడులు
దానియందు నదించును గానఫణితి. [4]

రేణురేణ్వంతరాంతర ప్రాణవలన
వైఖరుల నడయాడెడు పసిడిమువ్వ
లసడి నినదించు యడుగుల లలన నాదు
వాక్కు వశ్యముఖీనవ వర్ణరేఖ ! [5]

ఏకోసమే

ఆమె స్వప్న ప్రపంచమునందె నేను
బ్రదికి యుంటి నింతదనుక - నదియుపోయె!
ఏమి చెప్పుదు నికపైన నింతి కసలు
కనుల రెప్పల తుదనైన కునుకురాదు ! [1]

వాణి నెడబాసె కుమిలెడు వాగ్విభుండు
ఏమి వ్రాసెనో నొసట నాకెరుకలేదు
కాని జీవిత మంతయు గడ్డి కరచె
వాని విరహగీతికలనె వ్రాసెనేమొ ? [2]

ఈ వసంతుడు పుట్టి పదేండ్లె యనుచు
పలుక పిచ్చివాడని నన్ను వదలివేసి
నారు! నిజము! తొలుత నామె నగవుపూలు
పూచిన దపుడె! నను వీడి పోవుట పుడె ! [3]

ప్రణయహుతవహాముఖమున బడుటయేల
ననుచు మిత్రులు ప్రశ్నించినారు నన్ను-
వారి కెరుక లేదీవిధి వారి కొరకు-
కవిత వినిపించు కొరకెనే కాలుచుంటి ! [4]

కల వెలుగదు

చలిత లలిత కిసలయ విసరములను మ
లయు మలయ మృదుల పవన లహరులను క
దలు సుమనిచయ మధువు లధరమున నొలు
క పలుకు చెలియ విడివడ కలదె బ్రతుకు? [1]
కలల యలల తుదల నుర్వు వలెయెదకర
గిన కతల వెతలు బ్రదుకు చెనకె! నతివ
చిరునగవు మెరుపులు విరిసి, కనులు మొయి
లు గములయి చినుకు చినుకులుగ కురిసె! [2]
కనుల తుదల నగమొరగి కదలి కరగు
కలల మెదలు చెలియ యలకల కదలిక
బ్రతుకు ముడివడి విడివడక తెగనొకటు-
పిదప కనులనొక కలయు వెలుగదకటు! [3]

వల్లభాచార్య

డా. ఆర్. శ్రీహరి.

సంస్కృతీకరింపబడ్డ తెలుగుకావ్యాలు

తెలుగునుండి సంస్కృతీకరింపబడి మనకిప్పుడు లభ్య మౌతున్న గ్రంథాల్లో గురురాజకవి (క్రీ.శ.15 శతాబ్ది) రచించిన సంస్కృత పండితారాధ్య చరిత్ర కాలక్రమంలో ప్రథమమని చెప్పవచ్చు. పాల్కురికి సోమనాథుడు తెలుగులో రచించిన పండితారాధ్య చరిత్రకు ఇది సంస్కృతాను వాదం. గురురాజకవి పండితారాధ్య చరిత్రను సంపూర్ణంగా సంస్కృతీకరిస్తే ఆధునికుడైన శ్రీ శివపురపు రాజలింగసూరి పండితారాధ్య చరిత్రలోని దీక్షాప్రకరణాన్ని మాత్రమే 'చారిత్ర దీక్షా ప్రకరణమ్' అనే పేరుతో సంస్కృతీకరించి ప్రకటించినారు.

పాల్కురికి సోమనాథుడు ఉదాహరణ ప్రక్రియలో బసవోదాహరణమనే గ్రంథాన్ని తెలుగులోనేకాక సంస్కృతంలోనూ వ్రాసినట్లుగ తెలుగు సాహిత్యచరిత్రల్లో పేర్కొనబడి ఉంది. ఈ సంస్కృత బసవోదాహరణం సోమన తెలుగులో సంతరించిన బసవోదాహరణానికి తానే కావించిన సంస్కృతానువాదం కావచ్చు.

సంస్కృతీకరింపబడ్డ తెలుగుగ్రంథాల్లో వీటి తరువాత పేర్కొనదగ్గ కావ్యం కాళహస్తి కవి రచించిన సంస్కృత వసు చరిత్ర. ఇది రామరాజభూషణుడు తెలుగులో రచించిన 'వసు చరిత్ర' ప్రబంధానికి సంస్కృతాను వాదం. తెలుగు సాహిత్యంలో రామరాజభూషణుని వసుచరిత్ర కొక విశిష్టమైన స్థానం ఉంది. శ్లేష చమత్కారాలకూ, వ్యంగ్య వైభవానికీ, శబ్దాలంకార వైచిత్రులకూ తెలుగు వసుచరిత్ర పెన్నిధి. దీనికి సంస్కృతంలోనే కాక తమిళం, కన్నడాల్లోనూ అనువాదాలు వచ్చినవి. కొంత భాగానికి ఆంగ్లీకరణం కూడా జరిగింది.

చాలాకాలంగా అముద్రితంగా ఉన్న కాళహస్తి కవి సంస్కృత వసుచరిత్ర కావ్యాన్ని ఆచార్య బి.రామరాజుగారు పరిష్కరించి విపులమైన ఆంధ్రాంగ్ల పీఠికలు సంతరించి 1965 లో ముద్రింపించినారు. కాళహస్తికవి పదహారో శతాబ్దికి చెందినవాడు. కంచి కామాక్షీదాసుడు. ఈతడు తన సంస్కృత వసు చరిత్రలో కేవలం భావానువాదం మాత్రమే చేయక మూలంలోని ప్రతి పద్యాన్నీ సంస్కృత శ్లోకంగా అనువదించినాడు. రామరాజభూషణుడు చూపిన సొగసులన్నింటినీ కాళహస్తి కవి తన అనువాదంలో చూపలేకపోయినా అందులోని శ్లేషచమత్కారాలను, శబ్దాలంకారాలను సాధ్యమైనంతవరకు ప్రదర్శించి సఫలుడైనాడనే చెప్పాలి.

మూలపద్యంలోని శ్లేష సంస్కృతపదాల్లో నిబద్ధమై ఉన్నప్పుడు అట్టి శ్లేషను సంస్కృతాను వాదంలో నిబంధించడం అంత కష్టసాధ్యమేమీకాదు. కాని శ్లేష అచ్చ తెలుగు పదంలో ఉన్నప్పుడు దాన్ని సంస్కృతంలోకి తేవడం ప్రతిభావంతుడైన కవికి మాత్రమే సాధ్యమయ్యే విషయం. కాళహస్తికవి తెలుగు పదాల్లోని శ్లేషనుకూడా సంస్కృతంలో ఎంతో నైపుణ్యంతో నిర్వహించినాడనే చెప్పవచ్చు. ఒక్క ఉదాహరణం పరిశీలించండి.

'వల్గొమ్మలఁ జెందువారలు తగుల్విరియాటలు నేరకుందురే' (3-138)

అన్న పద్య పాదంలో 'వల్గొమ్మలు జెందువారలు' అనే పదానికి అనేక స్త్రీలను చేరేవారని విటపరంగాను, అనేక వృక్ష శాఖలను చేరేవని తుమ్మెదల పరంగానూ రెండర్థాలు ఉన్నాయి. 'కొమ్మ' అనేపదంలో శ్లేష. ఈ శ్లేషను కాళహస్తికవి సంస్కృతంలో ఎలా నిబంధించినాడో చూడండి.

'పైదగ్ధ్యమేతదుచితం విటపాళిభాజామ్' (3-177)

మూలంలో మాదిరిగా రెండర్థాలు వచ్చేట్లుగా 'విటపాళి' అన్న పదం ప్రయోగించి ఎంతోనేర్పుతో శ్లేషను అనువాదంలోకి తీసుకురావడం ప్రశంసింపదగ్గ విషయం. విట+పాళి, భాజామ్ అని పద విభాగం చేస్తే విట పరంగానూ; విటప+అళి, భాజామ్ అని పదవిభాగంచేస్తే తుమ్మెదల పరంగానూ అర్థాలు చెప్పవచ్చు.

మూలంలోని శ్లేషార్థాలనేకాక శబ్దాలంకార వైచిత్రినికూడా తన సంస్కృతానువాదంలో కాళహస్తికవి ఎంతో మనోహరంగా సంతరించినాడు. ఒక్క ఉదాహరణం.

'తరువులపొంతఁ బొంచి వసుధావరమిత్రుఁడుగాంచె నచ్చటం దరుణిఁ దమో వినీలకచఁ దామర సోదర సోదరప్రభం

దరళ విలోచనం దతనితంబఁ దటిన్ని భగాత్ర వల్లరిం
దరుణ శశాంకఫాలనొక తన్వఁద రంగవళిం దలోదరిన్'

(2-25)

రామరాజభూషణుడీ పద్యంలో అనేక తకారాది పదాలను వాడి పద్యానికి శబ్దగతమైన ఒక వైచిత్రిని కూర్చినాడు. కాళహస్తి కవి కూడా యీ శబ్దసౌందర్యాన్ని అనువాదంలో ఎంత భద్రంగా పొందుపరచినాడో చూడండి.

"తారానాథముఖీం తమోఘనకచాం తాళస్తనీం పద్మభాం
తామ్రోష్ఠీం తరళేక్షణాం తతగురుశ్రోణీం తటిద్భాసురామ్
తన్వీం మధ్యతనుం తరంగవలికాంత ర్వ్యాప్త రేఖాలికాం
తత్త్రైకాం తరుణీం దదర్శ స తదా తాదృక్తరుచ్ఛాదితః"

(2-30)

మూలంలోని శబ్దాలంకార వైచిత్రి అనువాదంలో సాధ్యంకానిచోట్ల కాళహస్తికవి తెలుగు యతిప్రాస నియతిని పాటిస్తూనో, మరొక రీతిగానో నాదసౌందర్యాన్ని పోషించడానికి ప్రయత్నించినాడనడానికి ఈక్రింది పద్యం అనువాదం ఒక నిదర్శనం.

మెఱుగొప్పు నెఱిగొప్పు నెఱగప్పు తఱిగప్పు
జలదమాలిక చొప్పు తెలుపలేదొ (3-69)

రామరాజ భూషణుని పై పద్యంలోని శబ్ద చిత్రతను కాళహస్తి కవి తెలుగు యతిని యతిని పాటిస్తూ భంగ్యంతరంగా పోషించినాడు.

"ధమ్మిల్లోజ్జ్వల నీలిమైన తనుతే ధారాధరాళిప్రభాం
నేత్రశ్రీ ర్నితరాం కరోతి నియతాం నీలోత్పలాలీవిభామ్.
కన్యాయాః స్మితకాంతిరేవ కురుతే కామం సుధాబ్ధిద్యుతిం
గాత్రశ్రీర్గణనాధికాం కలయతే గాంగేయవల్లీరుచిమ్'' (3-89)

ఈ రీతిగా రామరాజ భూషణుడు ప్రదర్శించిన శ్లేష వైచిత్రినీ, శబ్దాలంకార సౌందర్యాన్నీ కాళహస్తికవి తన అనువాదంలో ఎంతో సముచితంగా పోషించినాడనే చెప్పవచ్చు.

మధురవాణి

పైన పేర్కొన్న కవులు తప్ప ప్రాచీనుల్లో తెలుగు కావ్యాలను సంస్కృతీకరించిన కవులు కానరారు. ఆధునిక సంస్కృత కవులు కొందరీ ప్రక్రియను ఆదరించి పోషించినారు. అట్టివారిలో కుంటిమద్ది శేషశర్మ, గిడుగు సీతాపతి, సన్నిధానం సూర్యనారాయణశాస్త్రి, గుండేరావు హర్కారే, లంకా కృష్ణమూర్తి గారలు అగ్రగణ్యులు.

సంస్కృతీకరింపబడ్డ తెలుగు కావ్యాల్లో వసుచరిత్ర తరువాత పేర్కొనదగ్గ కావ్యం మనుచరిత్ర. ఆంధ్ర కవితా పితామహుడైన అల్లసానిపెద్దన తెలుగులో ప్రబంధ రీతిలో సంతరించిన కావ్యం మనుచరిత్ర. దీనిని కుంటిమద్ది శేషశర్మగారు లలితమైన శైలిలో 'మనుసంభవః' అనే పేరుతో సంస్కృతీకరించినారు. మత్తేభాలు, ఉత్పలమాలలు, చంపకమాలలు సంస్కృత చ్ఛందోజన్యాలైన వృత్తాలే ఐనా వాటికి సంస్కృతంలో వినియోగం తక్కువ. శిశుపాలవధ కావ్యంలో ఎక్కడో ఒక చంపకమాల కనిపిస్తుంది. తెలుగు కవులు విశేషంగా వాడిన యీ వృత్తాలను శేషశర్మగారు యథేచ్ఛంగా తమ సంస్కృతానువాదంలో వాడుకున్నారు. సీసం, ఆటవెలది, తేటగీతి మొదలైన దేశిచ్ఛందస్సులను కూడా శర్మగారిందులో ప్రవేశపెట్టి కావ్యానికి నవీనత సంతరించడం మరో విశేషం. "నిడుదపెన్నెఱి గుంపు జడగట్ట సగరుముమ్మనుమండు తపము గైకొనిన చోటు"— అన్న హిమవత్పర్వత వర్ణనంగల సీసపద్యాన్ని శర్మగారు సీసంలోనే ఎలా సంస్కృతీకరించినారో గమనించండి.

"జటతి దీర్ఘ శిరోజ పాశేఽత్ర సగరస్య
నప్తా తపశ్చర్క రాంచకార
దర్శయంతీ జరత్క మరకర్పరమత్ర
నాకాపగా జగత్యవతతార
అద్రీంద్రకన్యా విధూయత్రపా మద్య
పతిసేవనాయాసమనుబభూవ
ఫాలాక్షనయనాగ్ని కీలావృతో హంత
భస్మీబభూవ సూనాశుగోఽత్ర
మదనతాపేన వివ్యధే పావకోఽత్ర
తాపసకళత్ర సౌందర్య దర్శనేన
శరవణ మసూత దేవసేనాన్యమత్ర
సన్నిభి దదర్శ భూసురః కౌతుకేన" (1-58)

శర్మగారు శ్రీకృష్ణదేవరాయల ప్రౌఢ ప్రబంధమైన ఆముక్తమాల్యదను కూడా సంస్కృతీకరిస్తున్నట్లుగా వినికిడి. త్వరలోనే వీరి సంస్కృతానువాదం సంస్కృత సరస్వతీగళాన్ని అలంకరించు గాక!

పింగళి సూరన రచించిన కళాపూర్ణోదయం తెలుగు సాహిత్యంలో అద్వితీయమైన రచన. కథా కల్పనాశక్తి, నాటకీయత, తెలుగు జాతీయాలు, సామెతలు- వీటికి పెన్నిధి. ఆధునిక యుగంలో ఉభయ భాషల్లోనూ కవి పండితులుగా పేరుపొందిన సన్నిధానం సూర్యనారాయణశాస్త్రిగారు ఈ కావ్యాన్ని 12 సర్గల కావ్యంగా సంస్కృతీకరించినారు. సూరనార్యుని కవితాశిల్పం అనువాదంలో సమగ్రంగా సంతరింపబడిందనటంలో సందేహం లేదు. శాస్త్రిగారి శైలి వైదర్భీ రీతిలో సాగి ఎంతో హృద్యంగా ఉంటుంది. ఇద్దరు రంభల సంవాదాన్ని వర్ణిస్తూ సూరన చెప్పిన ఈ కింది పద్యంలోని తెలుగు గృహిణుల పోరుతీరును శాస్త్రిగారెంత హృద్యంగా, సహజంగా సంస్కృతీకరించినారో గమనించండి.

తెలుగు :

అంత మదింపకువే యని పల్కిన
సంత మదింపకువే యనుచున్
గంతు లడంచెదలెమ్మని పల్కిన
గంతులడంచెద లెమ్మనుచున్
....
....
ఒట్టుసుమీయన్న నొట్టుసుమీ యంచు
నేమేమిః యనిన నేమేమి! యనుచుఁ
గానీగదేః యన్నఁ గానీగదే! యంచు
నింకేల! యనిన నింకేల యనుచు
నోసి పోవే యన్న నోసి! పోవే యంచు
నౌ నంటివనిన నౌ నంటివనుచు
మఱవకు మిదియన్న మఱవకు మిదియంచు
నీవెంత యనిన నీవెంత యనుచు"

(క.పూ.3-206,207)

సంస్కృతం :

త్వం పిధేహి ముఖమిత్యుదీరితే
త్వం పిధేహి ముఖమిత్యుదీరితమ్
మాద్రుప స్త్వమితి భాషితేపున
ర్మాద్రుప స్త్వమితి భాషితంపునః

నత్వాం మన్యే తృణాయేతి ధిక్కృతే చైకయా క్రుధా
నత్వాం మన్యే తృణాయేతి ధిక్కృతం చాన్యయారుషా
హం దేఽపేహీతి రసితే హం దేఽపేహీతి రాసితమ్
ఉక్తేమా విస్మరేత్యుక్తం భూయోమా విస్మరేతి చ
కియతీ త్వమితి ప్రోక్తే కియతీ త్వమితీరితమ్
పశ్యామీత్య బ్రవీదేకా పశ్యామీత్యాహ చాపరా (పుట 75)

సూరన ప్రయోగించిన తెలుగు జాతీయాలను, సామెతలను శాస్త్రిగారు యథాతథంగా సంస్కృతీకరించి ప్రయోగించడం గమనింపదగ్గ విషయం. కొన్ని జాతీయాలకూ, సామెతలకూ వారు చేసిన సంస్కృతానువాదాలను పరిశీలించండి.

i) నీరుకొలది తామరసుమ్మీ (2-95)
జలావధి జలేరుహమ్ (పుట. 29)

ii) చెవిటికి బట్టినట్టి శంకును బోలెన్ (2-96)
గీతం వా బధిరశ్రుతౌ (పుట.29)

iii) కంటికి రెప్పవలె
నేత్రం పక్ష్మేవ (పుట.104)

iv) పేదకోపమెందు పెదవుల చేటు (6-30)
నిర్వీర్యస్య క్రోధ ఓష్ఠదంశనాయైవ కల్పతే
(పుట.158)

v) బట్టతలలు మోకాళ్లు ముళ్లు పెట్టగలదు (6.77)
గ్రథ్నాతి జానుఫలకం శిరసా ఖల్వాటకస్య సంయోజ్య
(పుట.167)

vi) ఆడఁబోయిన తీర్థమెదురయ్యె
యత్తీర్థం మనసి యియాసితం తదేవాయతం మే పురతః
(పుట. 181)

vii) ఇల్లలికి నఁబండువగునె (3-201)
గృహాలేపేనైవ పర్వసంపన్నమ్? (పుట. 75)

viii) కన్నుండంగను పాపందిపియనేర్పుగల మునిముచ్చు
(3-199)
బింబంచ నయనమధ్యాదపహర్తుమియం మలిమ్లుచో
కుశలా (పుట. 74)

ix) నాలుక చివరి మాటలు
జిహ్వాగ్రవాచః

x) సాధక బాధకాలు
సాధకబాధకాని (పుట. 189)

పై ప్రయోగాలు శాస్త్రిగారి నూత్న ప్రయోగప్రవణతకు చక్కని నిదర్శనం.

సూరనార్యుని ప్రతిభావిలసితమైన మరో కావ్యం ప్రభావతీ ప్రద్యుమ్నం. గుండేరావు హర్కారేగారు దీన్ని చంపూ రూపంగా సంస్కృతీకరించినారు. వీరు బహుభాషాకోవిదులు. వాచస్పతి బిరుదాంకితులు. హర్కారేగారు తమ 90వ ఏట కండ్లు సరిగా కానరాని స్థితిలో శిష్యులెవరో మూలాన్ని చదువుతూఉంటే వింటూ ఈ అనువాద రచనచేసినారంటే వారి పట్టుదల ఎట్టిదో మనం అర్థంచేసుకోవచ్చు. ఈ కావ్యం అముద్రితంగానే ఉంది. హర్కారే గారి శైలీమాధుర్యాన్ని తెలుసుకోవటానికి ఒక్క శ్లోకం ఉదాహరిస్తాను.

"ప్రభావత్యా వాణీ మధురరసనాయాం స్థితవతీ
స్వరే మాధుర్యం స్యాదధికమితి భక్త్యా ద్విజపికః
శుకో వా సంపూజ్య స్వఫలము పహారార్థమదదాత్
ధ్రువం తస్యా ఓష్ఠం నవకిసలయం బింబమధవా"

మహాభక్తుడూ, సహజ పాండిత్య బిరుదాంకితుడూ ఐన బమ్మెరపోతన రచించిన ఆంధ్ర మహాభాగవతానికి ఉన్నంత ప్రచారం కానీ, విశ్వజనీనత కానీ తెలుగులో మరే గ్రంథానికీ లేదని విద్వాంసుల అభిప్రాయం. దీనికి పోతన మధురమంజులమైన శైలీ, భక్తిరసమయమైన వస్తువూ కారణం కావచ్చు. ఇట్టి మహాగ్రంథంలోని కొన్ని రసవద్ఘట్టాలు అనువదింపబడి 'ఆంధ్రభాగవతానువాదః' అనే పేరుతో ప్రకటింపబడ్డాయి. అనువాదకులు సన్నిధానం సూర్యనారాయణ శాస్త్రిగారు. ఆంధ్ర మహాభాగవతమే సంస్కృతభాగవతానికి అనువాదం కదా! ఇక మళ్ళీ దాన్ని సంస్కృతీకరించడంలో ఔచిత్యమేమిటనే సందేహం రావచ్చు. కాని పోతన సహజంగా భక్తుడు కావడం వల్ల వ్యాస భాగవతాన్ని యధాతథంగా కాక భక్తితత్త్వాన్ని వివరించేప్పుడు ఆవేశపరుడై తన ఆంధ్రానువాదాన్ని మూలం కన్న ఎంతో విస్తృతం చేసినాడు. మూలంలోలేని సొగసులనెన్నింటినో అనువాదంలో సంతరించినాడు. అందువల్ల పోతన భాగవతం సంస్కృతీకరింపబడటం సార్థకమనే చెప్పవచ్చు.గజేంద్రమోక్షం, వామనావతారం, ప్రహ్లాదకథ, గోపీకృష్ణవిలాసం, కంసవధ, ఉద్ధవసందేశం-భ్రమరగీతాలు-రసవత్తరమైన ఈ ఆరుఘట్టాలను రసవంతంగా అనువదించినారు. శాస్త్రిగారి అనువాదం మూలవిధేయమై సహృదయరంజకంగా ఉంటుంది. మకరిచే పట్టుబడ్డ గజేంద్రుని దీనాలాపాన్ని పోతన "లావొక్కింతయులేదు ధైర్యము విలోలంబయ్యె" (8-98) అన్నపద్యంలో ఎంతో కరుణరస స్ఫోరకంగా వర్ణించినాడు. దీనికి శాస్త్రిగారి అనువాదాన్ని పరికించండి.

"క్షీణంమేఽంగబలం ధృతిర్విచలితా స్థానాచ్చ్యవంతేఽసవః
సమ్మూర్ఛోఽస్మి భృశం కృశోఽస్మి నితరాం స్విన్నోఽస్మి
ఖిన్నోఽస్మిచ
న త్వద్వేద్మ్యపరం శరణ్యముప మాం క్షాంత్వాపరాధాన్
దయా
దాయాహీశ్వర పాహి మాం వరద భో సంరక్ష సర్వేశ్వర
(పుట. 90)

పోతన వృత్త్యను ప్రాసాది శబ్దాలంకారాల మూలంగా సంతరించిన రామణీయకం అపూర్వమైన రామణీయకాన్ని శాస్త్రిగారు అనువాదంలో చక్కగా పోషించినారు. గజేంద్రమోక్షంలోని ఒక్క ఉదాహరణం పరిశీలించండి.

పోతన భాగవతం

తాటంకాచలనంబుతో భుజనటద్ధమ్మిల్ల బంధంబుతో
శాటీముక్త కుచంబుతో న దృఢ చంచత్కాంతితో శీర్ణలా
లాటాలేపముతో మనోహర కరాలగ్నోత్తరీయంబుతోఁ
గోటీందుప్రభతో నురోజభరసంకోచ ద్విలగ్నంబుతోన్
(10-102)

శాస్త్రిగారి అనువాదం

ఇత్యాందోళిత కర్ణికా కుచతటీ స్రస్తోత్తరా సంగికా
స్కంధాలంబిత వేణికా విగళిత ప్రాంచన్మణీ కాంచికా
స్వేదస్విన్న లలాటికా రుచిర బాలా నర్తినీలాలకా
భర్త్రా కృష్ణ కుచాంశుకా స్ఖలితగత్యైత్యంబుధేః కన్యకా
(పుట-56)

శాస్త్రిగారు ఆంధ్రభాగవతంలోని కొన్ని ఘట్టాలను పద్యరూపంలో అనువదిస్తే గరికపాటి లక్ష్మీకాంతయ్యగారు వచన రూపంలో సంస్కృతీకరించి ఆంధ్రేతరులైన సంస్కృతజ్ఞులకు పోతన భాగవత రామణీయకాన్ని చవిచూపించినారు.

తిక్కనగారి పద్యరచనా శిల్పం నిర్వచనోత్తర రామాయణంలోనే పరిణతి నందుకొన్నది. అందులోలేని అందాలు భారతంలో లేవు. తిక్కన భారతాన్ని రచించక పోయినా నిర్వచనోత్తర రామాయణంవల్లే ఆంధ్ర సాహిత్యంలో శాశ్వత యశస్సును

పొంది ఉండే వాడని విమర్శకుల అభిప్రాయం. ఇంతటి ప్రశస్తికి పాత్రమైన నిర్వచనోత్తర రామాయణం ఈ శతాబ్దిలో సంస్కృత, కన్నడాంధ్ర కవితా రాధకులు శ్రీ లంకా కృష్ణమూర్తి గారుచే సంస్కృతీకరింపబడటం ప్రశంసనీయమైన విషయం. ఈ అనువాదం ముద్రణ కావలసి ఉంది. కృష్ణమూర్తిగారి అనువాద మైఖరి తిక్కన నిర్వచనోత్తర రామాయణ రాష్ట్రాంతర ఖ్యాతికి తోడ్పడగలదని భావించవచ్చును. వీరి అనువాదానికి ఒక్క ఉదాహరణ

నిర్వచనోత్తర రామాయణం

"గుణమున, లస్తకంబునను, గోటియుగంబునఁ, గేలఁ, దారభీ
షణముగ నుప్పతిల్లి రభసంబుగ రేఁగినమాడ్కిఁ దీవ్రమా
ర్గణ నికరంబు లొక్కట నరాతి బలంబులఁ గప్ప శార్ఙ్గని
క్వణనము రోదసీ కుహర కర్పరముం బగిలింప నుగ్రతన్
(3-18)

కృష్ణమూర్తిగారి అనువాదం

శింజిన్యామపి లస్తకే చ యుగళే కోట్యోః కరే చ స్వయం
సంభూయ ప్రసభం భయంకరవిధా పుజ్జృంభ మాణైరివ
అత్యాశ్చర్య కరైః శరైస్తు యుగపత్సంభావయన్ శాత్రవాన్
రేజే జ్యానినదేన పద్మనయనో రోదోంతరం భేదయన్।

ప్రాచీనాంధ్రనికాంధ్ర కవిత్వాలు రెండింటి మాధుర్యాన్ని తమ 'కవితోదయ చంద్రిక' ద్వారా సంస్కృత భాషాభిజ్ఞులకు అందించిన విద్వాంసులు డా॥ గిడుగు సీతాపతిగారు. వీరు మనుచరిత్ర, ఆముక్తమాల్యద, వసుచరిత్ర పారిజాతాపహరణం మొదలైన ప్రాచీన కావ్యాలనుండీ, గురజాడ అప్పారావు, రాయప్రోలు సుబ్బారావు మొదలైన ఆధునికాంధ్ర కవుల రచనలనుండీ రసవత్తరమైన ఘట్టాలను ఎంతో హృద్యమైన శైలిలో సంస్కృతీకరించి ఈ సంపుటిలో పొందు పరచినారు. అంతేకాక క్షేత్రయ్య పదాలకు, సుమతి, వేమన, నారాయణ శతకాల్లోని కొన్ని పద్యాలకు కూడా ఇందులో సంస్కృతానువాదాలు ఉన్నాయి. సంస్కృత కవితా రచనలో సీతాపతిగారు చూపిన వైవిధ్యం ఈ సంపుటిలో కొట్టవచ్చినట్లుగా కనిపించే గుణం. సీతాపతిగారు ఆరంభంలో "నాహం సంస్కృతో పండితో న చ కవిఃకింత్వేషయత్నః కృతః" అని తనవినయాన్ని ప్రకటించుకున్నా సరసకవితా రచనలో వారిది అందెవేసిన చేయి అనడం ఎంత సహజోక్తో వారి ఈ కింది శ్లోకాల వల్ల తెలుసుకోవచ్చు.

"కాత్వం భీతమృగేక్షణేఽత్ర విహరస్యే కాకినీ నిర్భయం
కాంతారే మదగర్వితోఽహమిహమే భ్రష్టోఽస్మి మార్గాదహో
నాలం గంతుమితః పరం మమపురం మార్గం న జానామ్యయే
మార్గం దర్శయ సద్గుణే కరుణయా శ్రేయాంసి భూయాంసి
తే (కవితోదయ చంద్రికా-4 పుట)

ఈ శ్లోకం శ్రీ ఆవంచ వీరాంజనేయులుగారు శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయానికి సమర్పించిన "తిక్కననిర్వచనోత్తర రామాయణము ఒక పరిశీలనము" అన్న అముద్రిత సిద్ధాంత వ్యాస గ్రంథం నుండి గ్రహింపబడింది. పుట 2-58.

'ఎవ్వతెవీవు భీతహరిణేక్షణ' అన్న మను చరిత్రలోని పద్యానికి ఈ శ్లోకం సంస్కృతీకరణం.

పక్షాభ్యంతర గుప్త శీర్షవలితం కేదార కుల్యాంతరే
నిద్రాయోగ సమేత హంస నివహం దృష్ట్వా తదారక్షకే
స్నాత బ్రాహ్మణపిండి తాంబరమితి భ్రాంత్యా తదా ప్యుంగతే
ప్రోడ్డీనా విహగాస్త ఏవ జహసుః కేదార గోపాంగనాః
(కవితోదయ చంద్రికా, పుట-9,10)

ఈ శ్లోకం ఆముక్తమాల్యదలోని 'తలబక్షచ్చలు గ్రుచ్చి బాతువులు' (1-65) అనే పద్యానికి సహజ సుందరమైన సంస్కృతీకరణం.

స్వదేశభక్తో భవ రాగబద్ధః
సంవర్ధయ త్వం సుకృతం వరేణ్యమ్
అలం ప్రసంగేన నిరర్థకేన
సంకల్పయ త్వం పరమోపకారమ్ (కవితోదయ చంద్రికా.
పుట-19)

ఈ శ్లోకం గురజాడ అప్పారావుగారి
దేశమును ప్రేమించుమన్నా
మంచి అన్నది పెంచుమన్నా
వట్టి మాటలు గట్టిపెట్టోయ్
గట్టి మేల్ తల పెట్టవోయ్"—అన్న ప్రసిద్ధమైన గేయానికి మూల విధేయమైన సంస్కృతానువాదం. ప్రాచీన కవితతోపాటు ఆధునిక కవితలను కూడా సంస్కృతీకరించి సంస్కృతజ్ఞులను అలరింపజేసిన ఘనత సీతాపతిగారికే దక్కింది.

ఈ విధంగా తెలుగు కావ్యాలను సంస్కృతీకరించి వాటి మాధుర్యాన్ని ఆంధ్రేతరులకు తెలియజేసి ఇటు సంస్కృతానికీ, అటు తెలుగుకూ ఎనలేని సేవ గావించిన కవులు సర్వదా, సర్వథా అభినందనీయులు.

బానిస బ్రతుకు

ఇందిరా రమణ

మే మాసపు ఎండలు మండిపోతున్నాయి.

మిట్ట మధ్యాహ్నం !

దాహంతో నోరు పిడచకట్టుకు పోతోంది. అలసటగా వెళ్ళి ఉద్యాన మంటపంలో కూర్చున్నాను. రాతితో చెక్కిన మంటపమేమో! చల్లగా....హాయిగా ఉందా ప్రదేశమంతా !

రెండు కాళ్ళూ బార్లాచాపి రాతిస్థంభానికి చేరగిలబడి కళ్ళు మూసుకున్నాను.

నా కళ్ళనిండా కల్లోలం !

నా మెదడంతా ఆలోచన్ల మయం ! !

నా మనసంతా సమస్యల వలయం ! ! !

ఏం చేయాలి? ఏం చేస్తే తన సమస్య....బాధ్యత....ఈ ఆపద గట్టెక్కుతాయి?

గుండెల్లో అగ్నిగుండం బ్రద్దలవడానికి సిద్ధంగా ఉంది. బైట ఎండలా గుండె మండుతోంది.

షావుకారు లేదనేశాడు. కాదనేశాడు. ససేమిరా ఇవ్వ నన్నాడు. తనమీద ఆశలు పెంచుకోవద్దన్నాడు.

తనంత మొత్తం ఇవ్వలేనన్నాడు. కనీసం, అప్పుగా నన్నా ఇవ్వగల పరిస్థితులలో లేనన్నాడు.

విశ్వాస ఘాతకుడు ? !

ఇన్నాళ్ళూ....ఇన్నేళ్ళూ తన రక్తంతో....తన కష్టంతో ....తన స్వేదంతో సేద్యం చేసుకున్నాడు. తన బోషాణం నింపుకున్నాడు. తమ ఆస్థులు పెంచుకున్నాడు.

ఇప్పుడు—

ఇప్పుడు—

కనీసం పిల్లపెళ్ళికి కావాల్సిన కట్నం అప్పుగా నన్నా ఇవ్వడానికి నిరాకరించాడు....రాక్షసుడు !!?!

పాతికేళ్ళ క్రితం—

తన పాతికేళ్ళ వయసులో నిరుద్యోగంతో రొప్పుతోన్న వేళ!

రాజేశ్వరీ థియేటర్‌లో కలిసాడు మా షావు కారు తండ్రి. -నని పరామర్శించి....తన మంచి చెడ్డలు విచారించి....ఆ మహానుభావుడే తనకి వాళ్ళ నూనెమిల్లులో గుమస్తా ఉద్యోగం ఇప్పించాడు.

అప్పుడు—

జీత భత్యాల్లేకుండా కేవలం తిండి....బట్టమాత్రమే పెట్టే ఒప్పందంమీద నన్ను కుదుర్చుకున్నాడు.

అప్పటికి వాళ్ళ పరిస్థితికూడా అంతంత మాత్రమే!

కాలక్రమేణా వాళ్ళ ఆయిల్‌మిల్లుతో పాటు వాళ్ళ ఆస్థులూ పెరిగాయి. తనకి పెళ్ళికూడా అయింది. ఆడపిల్ల తర్వాత ఇద్దరు మగ వెధవలు! షావుకారుకూ నాఅంత వయసు పిల్లలు ముగ్గురేఉన్నారు. నేను ఉద్యోగంలో చేరేసరికి వాళ్ళు తండ్రికి చేదోడు....వాదోడుగా ముగ్గురూ వ్యాపారంలోనే ఉన్నారు.

తన పిల్లలూ పెరిగారు.

షావుకారుగారు పోయాక వాళ్ళపిల్లలు పెత్తనాల్లోకి వచ్చారు. మనిషో వ్యాపకంతో బిజీ అయ్యారు.

తను మాత్రం జీతానికి....వాళ్ళ ఆస్థుల జమా ఖర్చుల మీద అజమాయిషీ చేస్తూనే ఉన్నాడు.

తను అప్పటికీ-ఇప్పటికీ ఆ అద్దె ఇంటిలోనే మూలుగు తున్నాడు.

తనతోపాటే పెరిగినవాళ్లు కనీసం—తన ఒక్కగానొక్క కూతురి వివాహానికి సహాయం చేయకపోగా....అప్పుగా నన్నా ఆదుకోననడం నిజంగా—తనకెంత బాధాకరం?

పెద్దాయన బ్రతికుంటే ఇలా అంటాడా?! తనని ఇలా అన్యాయం చేస్తాడా ?!

చెయ్యడు....చెయ్యడుకాక చెయ్యడు.

సినిమా హాల్లో—తిండిలేక సొమ్మసిల్లి పోయిన తనని ఆదరించి అండగా నిలిచిన ఆయన కనీసం....ఈ పెళ్ళి సమయంలో ఆర్ధికంగా ఆదుకోడూ ?!

ఇల్లు వెదుక్కుంటూ వచ్చిన పెళ్ళిసంబంధం ఖాయమవడంతో ఏం చేయడానికీ తోచలేదు.

నెలసరి ఇచ్చేజీతం అయిదొందలూ ఇంటి ఖర్చులకు సరి. సరి ?! తనేం మిగల్చగలడు?! పిల్ల పెళ్ళి ఎలాచేయగలడు?! ఆ

భగవంతుడే ఉన్నాడు నెమ్మని ముహూర్తాలు కూడా తీసేయ మన్నాను.

కానీ, ఇప్పుడు....? ఆకాశానికి చేతులందక—భూదేవికి కాళ్ళందక అల్లాడి పోతున్నాడు.

బేండుమేళం శబ్దంతో ఒక్కసారి ఇహానికివచ్చి తేరుకుని లేచి నిలబడ్డాను.

ఓమూల—సాయంత్రానికి కాబోయే పెళ్ళికోసం మిగతా సంబరాలు సాగిస్తున్నారు. ఇంకోమూల ఇద్దరు కొత్త దంపతులకు కాలిగోళ్ళ సంబరం చేస్తున్నారు.

ఆ కళ్యాణమంటపంలో....ఆ రాత్రికి ఎన్ని పెళ్ళిళ్ళు జరుగుతాయో !?!

అక్కడినుండి బయలుదేరి బస్సుస్టాండ్ కొచ్చాను. బస్సుస్టాండ్‌నిండా జనం....జనం....!

ఎక్కడ చూసినా....ఎటు చూసినా జంటలు....జంటలు ! కొత్త దంపతుల జంటలు !

పసుపు బట్టలతో....పూల మాలలతో....ఆడవాళ్ళ పట్టు చీరల తోరణాలతో బస్సుస్టాండ్ అంతా కోలాహలంగా....కలిసిడిగా దేదీప్యమానంగా వెలిగిపోతోంది.

ముందు రోజు రాత్రి పెళ్ళి జరిగిన జంటలు దేవుడి దర్శనానికి కొండకి వెళ్తున్నారు.

మావూరు పుణ్యక్షేత్రం కావటం చేత— ఎక్కడెక్కడి వారో వచ్చి ఇక్కడ వివాహం చేసుకొని వెళ్ళిపోతుంటారు.

తనే—

ఇక్కడే ఉండి.... సింహాద్రిప్పన్న సన్నిధిలోనే .... ఆయన కనుసన్నలలోనే కాలం గడుపుతున్న తను ...తను తన ఒక్కగానొక్క కూతురికి వివాహం చేయలేక అతలా కుతలం అవుతున్నాడు.

స్కూటర్ మీద తుర్రునవచ్చాడు షావుకారుగారి మూడో కొడుకు. వచ్చీరాగానే కబురుచెప్పి టక్కున ఉడాయించాడు.

తను ఇప్పుడు పార్వతీపురం లోడుకు వెళ్ళాలట.

పెళ్ళి ముందర పెట్టుకొని ఎవడు వెళ్తాడు.

నెమ్మదిగా ఆలోచనలతో నడుచుకుంటూ మిల్లుకువెళ్ళాను. ముగ్గురన్నదమ్ములూ త్రిమూర్తుల్లా కూర్చుని ఉన్నారు.

వాళ్ళుముగ్గురూ నావిషయమై చర్చిస్తున్నట్టున్నారు.

చర్చించినా ఏం చేస్తారు?

వెధవలు!... జలగలు! పట్టి పీడించడమే తప్ప 'తమ వద్ద పనిచేస్తున్న పనివాళ్ళ మంచి చెడ్డలు ఆలోచిద్దాం' అన్న యోచనలేని ధనాశావరులు.

లారీ ఆయిల్‌మిల్లు ముందు సిద్ధంగా ఉంది. పార్వతీపురం లోడుకు వెళ్తే రేపు సాయంత్రానికి గాని తిరిగిరావడం కుదరదు.

కానీ, తన అవస్థ....అవసరం ఏంకావాలి?!

ఈ రోజంతా ఎవరి కాళ్ళోపట్టుకొని కనీసం, కట్నం ఇవ్వాల్సిన అయిదువేల రూపాయలు ఎవరి దగ్గరన్నా అప్పుగా సంపాదించగలిగితే....పరవాలేదు. మరి? తనిలా వూళ్లేలడానికి వెళ్తే ఎలా?!

అదే ఆ ముగ్గురిముందూ పెట్టాను. నా కూతురి వివాహం కన్నా మీబోడి వెట్టిచాకిరీ బ్రతుకు నాకక్కరలేదని చెప్పాలనిపించింది.

ఇన్నాళ్ళూ నాలుగొందలరూపాయల జీతానికి నారక్తమంతా....నా కష్టమంతా హరించేసి మీరు భవంతులు నిర్మించుకున్నారు.

ఈ రోజు—

నా ఒక్కగానొక్క కూతురి పెళ్ళికి కట్నం కోసం.... అయిదువేల రూపాయలు అప్పుగా ఇచ్చి జీతం మీద వసూలు చేసుకోమని బ్రతిమలాడి అడిగినా లేదని....ఇవ్వలేమని నిరాకరించారు.

ఇదెంత న్యాయం?!

ఇన్నాళ్ళ నా శ్రమకి.. .సర్వీసుకి ఇదేనా మీరిచ్చినప్రశంస. ఛీ! వీళ్ళతో గొడవనాకెందుకు?! తనెక్కడికి.... ఏ షావుకారు దగ్గరకు వెళ్ళినా తనని కళ్ళకద్దుకొని ఆదరిస్తారు.

అయినా, ఈజాతంతా ఒకటే !?!

ఎవరైనా...ఏ షావుకారైనా...ఏ వ్యాపారైనా. .ఇలాగే... ఈ మదంతోనే ప్రవర్తిస్తాడు.

పార్వతీపురం లోడుకు నేవెళ్ళనని తెగేసి చెప్పి మిల్లు లోపలకు వెళ్ళాను. కళాసీలు తమ పనిలో నిమగ్నమై మరమనుషుల్లా శ్రమిస్తున్నారు. యంత్రాల వేడికి....ధాటికి తట్టుకు నిలబడి వాళ్ళ చెమటని....రక్తాన్ని వేరుశనగ పలుకులతో పాటే కలిపి నూనె దిగుమతి చేస్తున్నారు.

మిల్లు డ్రైవర్ వీరాస్వామి యాంత్రికంగా తన పని తను చేసుకుపోతున్నాడు.

రాత్రీ- పగలూ విశ్రాంతి లేకుండా శ్రమించే యంత్రాల్లా వర్కర్లంతా ఎవరి హడావిడిలో వాళ్ళున్నారు.

లారీతోపాటు షావుకారుగారి రెండో కొడుకు వెళ్ళాడు. పెద్దవాడు ఏదో పనిమీద స్కూటర్‌తో వెళ్ళిపోయాడు.

ఎకౌంట్స్ బుక్ చేత్తో పట్టుకొని కళ్ళంలో కూర్చున్నాను. క్రింద వేరుశనగ వలుకులు ఆరబెట్టారు. చేత్తో గుప్పెడు వలుకులు తీసుకొని నములుతూ కూర్చున్నాను.

అన్యమనస్కంగానే అకౌంట్స్ బుక్ తెరిచి వ్రాస్తూ కూర్చున్నాను.

ఇంతలో కెవ్వున కేక....చావు కేక వినిపించేసరికి ఒక్కసారి అదిరిపడ్డాను.

నేనే కాదు. మిల్లు....మిల్లంతా అదిరిపడింది. ఎక్కడివారక్కడ పనులు వదిలేసి కేక వినిపించిన దిక్కుకేసి పరుగు పెడుతున్నారు.

షావుకారుగారి మూడో అబ్బాయి గాబరాగా నా దగ్గరకు వచ్చాడు. గజగజ వణికిపోతున్నాడు. చిరుచెమటలతో తడిసి ముద్దయిపోయాడు. అతను భయం....భయంగా విషయం చెప్పేసరికి అవాక్కయిపోయాను.

నా గుండె ఓ క్షణం ఆగి తిరిగి కొట్టుకోవడం ప్రారంభించింది. అకౌంట్స్ బుక్ అలాగే క్రిందపడేసి పరుగందుకున్నాను. లోపల...మిల్లులో జనమంతా మూగి ఉన్నారు.

నేను వెళ్ళేసరికి అందరూ ప్రక్కకు తప్పుకున్నారు.

చేయి తెగి వీరాస్వామి క్రింద పడి ఉన్నాడు. బాధతో గిలగిలా తన్నుకుంటున్నాడు. రక్తం వరదలా కారుతోంది.

ఆ వెంటనే అతన్ని ప్రక్కనే ఉన్న గవర్నమెంటు హాస్పటల్‌కు తీసుకువెళితే వైజాగ్ పెద్ద హాస్పటల్‌కు తీసుకువెళ్ళమన్నారు.

హాస్పటల్‌లో జాయిన్‌చేసి ఆ రాత్రంతా నేను వీరాస్వామి దగ్గరే ఉన్నాను. ఆ రాత్రి షావుకారుగారి ముగ్గురు కొడుకులూ వచ్చారు.

నన్నో మూలకు తీసుకువెళ్ళి ఎలాగైనా ఈ విషయంలో పెద్ద గొడవ కాకుండా కాపాడమని నా కాళ్ళా వేళ్ళా పడ్డారు.

వాళ్ళు ముగ్గురూ అలా భయంతో నన్ను బ్రతిమలాడేసరికి నా మనసు నీరుగారిపోయింది.

వీరాస్వామికి నా మాటంటే మంచి గురి. వీరాస్వామికే కాదు. వర్కర్సు అందరికీ నేనంటే అభిమానం.

వీరాస్వామికి నష్టపరిహారంగా పాతికవేలూ ఇస్తామని వాళ్ళ ముగ్గురన్నదమ్ములూ ఏకకంఠంతో చెప్పారు. గొడవ కాకుండా ఆపగలిగి....ఈ సమస్య పరిష్కరించగలిగితే నాకు అయిదు వేల రూపాయలు పారితోషికం కూడా ఇస్తామన్నారు.

వాళ్ళామాట అనేసరికి నాలో కోపం కట్టలు త్రెంచుకుంది. రాస్కెల్స్. డబ్బు ఎరవేసి ఎలాంటి వ్యక్తినైనా తమ బానిసగా చేసుకోవాలనుకునే మూర్ఖులు వీళ్ళు.

కానీ, కోపతాపాలతో సాగే వ్యవహారాలు కావివి. తగవుల్తో వ్యవహారాలు సెటిల్ చేసుకోవాలంటే వీరాస్వామి దెబ్బతింటాడు.

నాకు ఇస్తామన్న అయిదువేలతో కలిసి ముప్పైవేలు వీరాస్వామికి అందజేస్తే గొడవ లేకుండా వ్యవహారం ఓ కొలిక్కి తెస్తానని వాళ్ళకు మాట ఇచ్చాను. వాళ్ళూ అందుకు ఆనందంగా అంగీకరించారు.

వీరాస్వామికి పిల్లల్లేరు. భార్య హాస్పటల్‌కు వచ్చింది. ఆమెకి విషయమంతా వివరించాను. వీరాస్వామికింకా తెలివి రాలేదు. ఆ మర్నాడు తెలివొస్తుందని డాక్టర్లు చెప్పారు.

మిల్లు వర్కర్సు సమ్మె చేయడానికి సిద్ధపడుతున్నారని తెలిసింది. ఆ ఉదయం మిల్లు దగ్గరకు ఆదరా బాదరా వెళ్ళాను. అప్పటికే వర్కర్సు యూనియన్ స్ట్రయిక్ నోటీసు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారు.

నే వెళ్ళి వాళ్ళతో చర్చించాను. విషయమంతా వివరించి చెప్పాను. గొడవలతో సాగే వ్యవహారాలు కావివని చెప్పి, మంచిగా ఒప్పించి వీరాస్వామి కుటుంబానికి ఉపకారం చేయడం మన ధ్యేయంగాని పగతో కాదని సమ్మె విరమింపజేసాను.

సమ్మె చేయడంవలన ప్రయోజనం లేదుకదా! సమ్మెవలన నష్టపోయేది బీద వర్కర్సు. సమ్మె కాలమంతా ఆకలితో కుటుంబమంతా కటకటలాడాల్సి వస్తుంది.

కేసు కోర్టుకెళితే అంత వేగంగా తేలే విషయం కాదు.

నా మాటమీద గౌరవంతో వర్కర్సు ఎవరి పనుల్లోకి వాళ్ళు వెళ్ళిపోయారు. నేనూ షావుకారుగారి పెద్దకొడుకు కలిసి ఆ సాయంకాలం హాస్పటల్‌కు వెళ్ళాం. వీరాస్వామికి తెలివి వచ్చింది. నెమ్మది...నెమ్మదిగా మాట్లాడగలుగుతున్నాడు.

నేను వెళ్ళగానే కన్నీళ్ళతోనే స్వాగతం చెప్పి రెండు చేతులూ పట్టుకొని కృతజ్ఞతలు చెప్పాడు వీరాస్వామి.

వీరాస్వామికి చెప్పాల్సిందంతా చెప్పి షావుకారు కొడుకు తనతో తెచ్చిన డబ్బు వీరాస్వామికి ఇచ్చాడు. డబ్బు ముట్టినట్టు సంతకంతోపాటూ ఈ ప్రమాదం తన అజాగ్రత్తవలన జరిగిందని కాగితం వ్రాసి సంతకం తీసుకున్నాడు.

పెట్టుబడిదారీ వర్గమంటే ఇదే! వాళ్ళ జాగ్రత్త వాళ్ళది. వాళ్ళకి కావాల్సింది కార్మికుల బాగోగులు కాదు. మిల్లు లాభనష్టాలే వాళ్ళకి ముఖ్యం.

తన పని అయిపోగానే వెళ్ళిపోయాడు షావుకారుగారి పెద్దబ్బాయి.

ఆ వారం తర్వాత వీరాస్వామిని డిస్చార్జ్ చేసారు.

వీరాస్వామి బాగానే ఉన్నాడు. కానీ, చెయ్యి లేదన్న లోపం తప్పా వీరాస్వామి దృఢంగానే తిరుగాడుతున్నాడు.

ఆ రోజు——

పెళ్ళి వాళ్ళ దగ్గర్నుండి మళ్ళా ఓ ఉత్తరం వచ్చింది. ఆ ఉత్తరం చదివి షాకయ్యాను. ఇంకో రెండు రోజుల్లోగా కట్నం డబ్బు ఇవ్వకపోతే వేరే సంబంధం చూస్కుంటామని ఉత్తరం వ్రాసారు.

ఏం చేయను?!

ఆ రోజంతా అప్పుకోసం తిరిగి...తిరిగి ఇల్లు చేరుకున్నాను. మా ఆవిడ నాకోసం ఎదురుచూస్తూ కూర్చుంది.

ఏం చేసారంటూ ఎదురొచ్చింది? ఏం చేస్తాను? నాలాంటి టికానా లేని ఉద్యోగాన్ని నమ్మి డబ్బు ఎవరు అప్పుగా ఇస్తారు?

రాత్రి భోజనాలుచేసి ఇద్దరం అన్యమనస్కంగానే మంచాలు వాల్చుకూర్చున్నాం. పిల్లలందరూ క్రింద పడుకొని గురకలు పెడుతున్నారు.

అంతలో వీరాస్వామి వచ్చాడు.

ఎందుకొచ్చాడో మొదట అర్థంకాలేదు. కానీ, వీరాస్వామి ఎందుకొచ్చాడో తెలిసాక....అతని అభిమానానికి నా కళ్ళు చెమ్మగిల్లాయి.

నా కూతురి పెళ్ళికి ఇంటికొచ్చి సహాయం చేస్తానంటున్న వీరాస్వామి మనిషో...మనిషి రూపంలో ఉన్న దేవుడో అర్థం కాలేదు నాకు.

అయిదువేల రూపాయలు మంచంమీద పెట్టి మీకు కలిగినప్పుడు ఇమ్మని చెప్పి నా సమాధానం కోసం ఎదురుచూడకుండా వెళ్ళిపోయాడు వీరాస్వామి.

నాకు నోట మాట రాలేదు.

మా శ్రీమతి ఆశ్చర్యంలోనుండి ఇంకా తేరుకోలేదు.

తనతో...తన బ్రతుకుతో ఇన్నాళ్ళూ ఆడుకున్న షావుకారుకి లేని దయ...జాలి వీరాస్వామికి నామీద ఎందుకు కలిగిందో నాకర్థం కాకపోలేదు.

అతనితోపాటే పాతికేళ్ళు వెట్టిచాకిరీ చేసి నిజాయితీగా...నిప్పులా బ్రతికిన తను....తనలాంటి నిర్భాగ్యుడే అన్న కనీస మానవతాదర్శంతో...దృక్పథంతో వచ్చి సహాయం చేసాడు వీరాస్వామి.

ఆ మర్నాడు వూరెళ్ళడానికి సిద్ధమవుతుండగా మా పెద్ద నాన్నగారబ్బాయి వచ్చి చావుకబురు చల్లగా చెప్పాడు.

ఆ క్షణం నేను షాకవలేదు. అవాక్కవలేదు. ప్రశాంతంగా కుర్చీలో కూర్చొని దీర్ఘంగా ఆలోచించాను.

మా తమ్ముడు చెప్పిన విషయం నిజంగా తనకి చావు కబురే?

ఏ తండ్రీ.. ఎలాంటి తండ్రైనా తన కూతురికి తెలిసి.. తెలిసి తనలాంటి ఆర్థిక ఇబ్బందులు...అస్తవ్యస్థ పరిస్థితులు ఎదురవకూడదని ఆలోచిస్తాడు.

ఏరి కోరి తనలాంటి నిర్భాగ్యుడికి ఇచ్చి పెళ్ళి చేయలేడు తనకి కాబోయే అల్లుడు కూడా తనలాగే ఏదో మిల్లులో...ఎవరో షావుకారు దగ్గర వెట్టిచాకిరీ చేస్తున్నాడని తమ్ముడు చెప్పిన విషయం విన్నాక....తనలాంటి ఉద్యోగమే....తనలాంటి బానిస బ్రతుకు బ్రతికే మనిషి....తనకి అల్లుడు కావడానికి వీల్లేదని నిర్ణయించుకున్నాను.

పెళ్ళివాళ్ళకి ఉత్తరం వ్రాసి పడేసాను. మీ సంబంధం మాకిష్టం లేదని జవాబు వ్రాసి పడేసాను. ఉత్తరం పోస్టుడబ్బాలో పడేసి వీరాస్వామి ఇంటికేసి బయల్దేరాను.

డబ్బు జేబులో భద్రంగా ఉందో...లేదో తడిమిచూసుకొంటూ అడుగులేస్తున్నాను.

* * *

6

ఆధునికత - అనంత విచారణలో ❀

(గత సంచిక తరువాయి)

అర్థ వివరణలు

1

హెగెల్, ఫ్రెడరిక్ (1770 - 1831) జర్మనీ దేశీయుడు తత్వశాస్త్రంలో గతి తార్కికాన్ని ప్రవేశపెట్టినాడు. స్థితి → ప్రతి స్థితి → సంస్థితి → స్థితి → ఇట్లే. అనే త్రిమార్గగతిని ప్రతిపాదించినాడు. ఈ మార్గగతి భగవంతుని సృష్టికి అన్వయించబడగా, మార్క్సు, మానవ చరిత్రకు ఆర్థిక పరిణామానికి అన్వయించినాడు.

2

కోలింగ్‌వుడ్. ఆర్. జి. (1889 - 1948) ఇంగ్లండు దేశీయుడు, చరిత్రకారుడు, తత్వవేత్త, చిత్రకారుడు, కళావిదుడు సంగీతజ్ఞుడు. ఇతని ప్రకారం మనిషికి ఐదనుభూతులున్నాయి. అవి : శాస్త్రం, మతం, చరిత్ర, కళ, తత్వం. చరిత్రను తాత్విక దృష్టితో చూడవలెనట. గత చరిత్ర మన మనస్సులలో పునర్జీవించవలెనంటాడు. ఈయన వ్రాసిన "కళాసూత్రములు" అనే గ్రంథం సుప్రసిద్ధం.

3

మూలంలో "అన్లెస్ ది ఔల్ అఫ్ మినెర్వాహాజ్ ఫ్లోన్" అనవుంది. ఔల్ అంటే గుడ్లగూబ. ఇది వివేకానికి ప్రతీక అయినా, నిజానికి మంద మతి. మినెర్వా ప్రాచీన రోమనుల విద్యాదేవత (స్త్రీ), అందుకే "మినెర్వా ఇచ్చిన కొంచెపుమతీ ఉడాయించి వుంటే తప్ప" అని అనువదించినది.

4

"మోడర్నిటీ" అనే పదానికి "ఆధునికత" అని తర్జుమ చేసినాను. నవ, నవీన, నవ్య, అధునాతన, అద్యతన, అర్వాచీన పర్యాయపదాలు. కాలంబట్టి అయితే సామకాలిక, అగ్రగామి అనే పదాలున్నాయి. ముఖ్యంగా సాహిత్యంలో వీటిని స్పష్టంగా విడదీయవలసి యుంటుంది. విశ్వనాధ నవల "మాబాబు" ఆధునికం. "రామాయణ కల్పవృక్షం" సామకాలికం వస్తువులో పురాతనం. "పల్నాటి వీర చరిత్ర" లోని స్వాతంత్ర్యంపైని ఉపన్యాసం మనకు ఆధునికంగా గోచరిస్తుంది. అది 15వ శతాబ్దంలో సామకాలికం, భవిష్యద్దృష్ట్యా అగ్రగామి. అటులనే వేమన వెలిబుచ్చిన కొన్ని భావాలు ఆధునికుల రుచికి సరిపోతున్నాయి. పింగళి సూరన "కళాపూర్ణోదయం" లోని శిల్పం నేటి విమర్శకులకు నచ్చింది. కొన్ని సార్వకాలికాలుగా ఉంటాయి. "పంచతంత్రం" మిల్టను "స్వర్గచ్యుతి" లో కడపటి భాగం (ఆదాము-ఈవులు తరలి వెళ్ళిపోవుట) ఎల్లప్పుడూ కాలదోషం పట్టకుండా ఉంటాయి.

5

గతకాలాన్ని మెచ్చుకోవడం, వర్తమానాన్ని తప్పక తెగడడం, భవిష్యత్తును గురించి మంచిగానో, చెడ్డగానో వూహించడం మానవనైజం. బైబిలు పూర్వభాగంలో యూదు మహర్షుల "పుస్తకాల"లో ఈ రివాజు కనపడుతుంది. జెరెమయ్యా పుస్తకంలో చెడ్డగాను, ఐసయ్యా పుస్తకంలో భవిష్యత్తు ఆశాజనకంగానూ మంచిగానూ వర్ణించబడింది.

6

గ్రీకుకవి హోమరు (క్రీ. పూ. 900సం॥) వ్రాసిన యులిసిస్ అనే పేరుని ఇతిహాసం. దీనిపేరు "ఒడిస్సే." ఇందులో "కమలభక్షకుల" దేశానికి యులిసిస్ పోతాడు. కమలభక్షకులు కాలాన్నే మరచి హాయిగా వుంటారు. మన ప్రాచీన సాహిత్యంలో గత కాలపై భవం చాలా వర్ణించబడింది. చతుర్యుగ దర్మాలు, కాలజ్ఞానం, భవిష్యకల్కి పురాణాలు ఇందుకు సాక్ష్యాలు. మహాభారతంలో వేదవ్యాసుడు తల్లి సత్యవతికిట్లు చెప్పుతాడు. "గతకాలము మేలు వచ్చుకాలము కంటెన్." దీనిని మనం "గతకాలము కంటె మేలు కాలము వచ్చున్" అని మార్చి భవిష్యత్తుకు మనం పట్టంకట్టవచ్చును. "మంచి గతమున కొంచెమోయ్" అన్నాడాధునికుడు (గురజాడ).

7

సంచార జాతులు స్థిరనివాస వ్యతిరేకులు. ఆంధ్రలో సంచార జాతులను స్థిరనివాసుల చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. యూరపులో మధ్యమ యుగంనుండి "జిప్సీ" లను సంచారజాతి వుండింది. జిప్సీలు ప్రాచీనకాలంలో భారతదేశం నుండి వలస పోయినవారు.

చక్రం, అగ్ని, మానవనాగరికతకు మూలం. ఋగ్వేదం "అగ్ని" అంటూ మొదలుపెడుతుంది. అగ్ని శక్తికి మూలం. చక్రం శీఘ్ర చలనానికి అవశ్యం. విశ్వ చలన చాలన చక్రవర్తి అయిన విష్ణువు చక్రం ఆయుధంగా చేయడం ఈ ప్రతీక కోసమే. అగ్ని తెలియకున్నప్పుడు మానవులు నికృష్ట జీవనం గడపేవారట. వీరిపాట్లు చూడలేక గ్రీకు దేవుడైన జియస్ కొడుకు ప్రోమీథియస్ (ప్రామేధ=ముందు ఆలోచన) తండ్రి అధీనంలో వుండే అగ్నిని దొంగిలించి మానవాళికి ఇచ్చివేసి మహోపకారం చేసినాడు. ఈ అగ్ని చౌర్య నేరానికి తన కొడుకు ప్రోమీథియస్‌ను జియస్ ఒక రాతి గుండుకు శాశ్వతంగా కట్టివేస్తాడు. ఈ ఉదంతాన్ని ప్రాచీన గ్రీకు నాటకకర్త ఇస్కైలజ్ (క్రీ. పూ. 500 సం॥) "బంధితప్రోమీథియస్" అనే త్రాసదంలో రచించినాడు. పందొమ్మిదవ శతాబ్దపు షెల్లీకవి "విముక్త ప్రోమీథియస్" అనే ఇంగ్లీషు పద్యతోషదంలో ప్రోమీథియసును బంధ విముక్తుణ్ని చేసినాడు. అగ్ని వంటవానికి ఎట్లు పనికి వస్తుందని కనిపెట్టబడిందో చార్లెస్ లాంబ్ అనే వ్యాసకారుడు (19వ శతాబ్దం) సున్నిత హాస్యంలో ఒక వ్యాసంలో వ్రాసినాడు.

8

ప్రాచీనకాలంలో జనులు వలసపోవడమో, పాలకునిచే బహిష్కృతులు కావడమో ఉండేది. దీనిని వ్యాసకర్త ప్రతీకగా వాడుతున్నాడు. కొన్ని ఉదాహరణలిస్తాను.

1) ఆర్యులు ఉత్తరధృవ ప్రాంతాలనుండి ఇరానుకు, ఇండియాకు వచ్చినారనుట-ఇది వలస.

2) తిగ్లత్ పిలేసరు (క్రీ.పూ. 745 సం॥) అనే బాబిలోనియా రాజు ఇస్రాయేలు వాసులను బలవంతంగా వేరేప్రాంతానికి తరలిస్తాడు వీరే యూదులలో "పోగొట్టుకొనిపోయిన దశ వర్గాలు". ఇది బహిష్కారం.

3) మోసెస్ అనే బైబిలు ప్రవక్త నాయకత్వాన ఈజిప్టు నుండి యూదులు వలసపోతారు (క్రీ.పూ. 1200 సం॥) ఆరు లక్షల మంది తరలివెళ్ళిరని బైబిలు (చూ. ఎక్సోడస్) చెబుతుంది ఇది వలస.

4) అరాబిక్ ముస్లింలనుండి తప్పించుకొనుటకు ఏడవ శతాబ్దంలో పర్షియాదేశంనుండి జోరాస్టరు మతాను యాయులు మనదేశంలో గుజరాతు సముద్రతీరాన దిగిరి. వీరే నేటి పార్శీలు ఇది వలస.

5) కేథలిక్కుల ఆగడాలు భరించలేక ప్రొటెస్టెంటులు, ఇంగ్లండు నుండి క్రీ.శ. 1620లో "మేఫ్లవర్" అనే ఓడలో అమెరికాకుపోతారు. ఇది కొంత వరకు పొమ్మనలేక పొగ పెట్టడం (బహిష్కారం), కొంతవరకు వలస.

6) శ్రీరాముడు, పాండవులు వనవాసం పోయినది బహిష్కారం.

7) శ్రీకృష్ణుడు, అతని అనుచరులైన యాదవులు, జరాసంధుని పీడ తప్పించుకొనేందుకు, తరలివెళ్ళి సముద్రంలో పట్టణం (ద్వారక) నిర్మించుకొంటారు. ఇది వలస.

9

హీసియోడ్ (క్రీ. పూ. 800 సం॥) అనే గ్రీకు కవి "పనులు-దినములు"("ఎర్గా కాయ్ హీమెరాయ్") అనేగ్రంథంలో మానవజాతి చరిత్రను అయిదు యుగాలుగా విభజించినాడు అవి: బంగారు, వెండి, కంచు, వీర, ఇనుప యుగాలు. అరణ్య పర్వంలో హనుమంతుడు భీమునకు చెప్పిన చతుర్యుగ ధర్మాలిట్టివే. దీని చర్చకు చూ.నా "సమసమాజం-మానవాత్మ" అనే వ్యాసం ("భారతి" జూను-ఆగస్టు 1983).

10

క్రొత్తప్రాతల పీకులాట-కొన్ని ఉదాహరణాలు :

1) కాళిదాసు "మాళవికాగ్నిమిత్ర" నాటకంలో ఈ శ్లోకముంది.

పురాణ మిత్యేవ నసాధుసర్వం
నచాపికావ్యం నవమిత్యవద్యం

ప్రాతదయినంత మాత్రాన మంచిది కానక్కరలేదు. క్రొత్తది చెడ్డది కాదు.

2) తిక్కన "ప్రాతవడ్డమాటల" నుపయోగించనంటాడు.

3) నాచన సోమన తాను "నవీనగుణసనాథను"డనంటాడు

4) "క్రొత్త ప్రాతల మేలుకలయిక" అన్నాడు గురజాడ

5) గంగేశోపాధ్యాయుడు "నవ్యన్యాయం" ప్రతిపాదించినాడు.

6) నవ్యగణితం ఇప్పుడు తయారుచేసినారు. కానీ ఇందులోనూ 2+2=4 !

7) ఆనందవర్ధనుడు "సర్వేఇవ నవా భాంతి మధుమాస ఇవద్రుమ" అని క్రొత్త మీది మోజు చూపినాడు.

8) జోనాథన్ స్విఫ్ట్ క్రీ.శ. 1704లో "పుస్తకయుద్ధం" అనే ప్రహసనాన్ని ప్రకటించెను. ప్రాచీన గ్రంథాలకు, నవీన (అప్పటికి) గ్రంధాలకు ఘోరయుద్ధం జరిగినట్లుకథ. ప్రాచీన గ్రాంథిక యోధులు హోమరు, పిండరు, యూక్లిడు, ప్లేటో, అరిస్టాటిలు. ఆధునిక గ్రాంధిక యోధులు మిల్టను, డ్రయిడను, డెకార్టే, హాబ్సు, బేకను ఈ యుద్ధమొక లైబ్రేరీలో కొనసాగుతుంది. అదెట్లున్నా, ఈ యుద్ధం పాఠకుల మనస్సులలో రేగుతూనే ఉంది, ఉంటుంది.

11

పండోరా గ్రీకుదేవత (స్త్రీ). ఈమెకన్ని విద్యలూ వచ్చు. ఆపేరర్థమే అది. ఈమెదగ్గర దేవదత్తమయిన ఒక పెట్టె ఉండేది. అందులో ఏమున్నాయో తెలియదు. దానిని తెరవ వద్దని దైవ శాసనం. ఒకనాడా పెట్టెలో నుండి "పెట్టెతెరువుమీ, మమ్మల్ని బయటికి రానివ్వుమీ" అనే దీనాలాపాలు వినబడుతాయి. ఇదేమో చూస్తామని పండోరా పెట్టెను తెరుస్తుంది. అందులోనుండి వెంటనే మానవ వినాశకర శక్తులు బిలబిలా బయటికి వస్తాయి. పండోరా వెంటనే పెట్టెతలుపు బిడాయిస్తుంది. మరలా అందుండి ఆహ్లాదకర అభ్యర్థన వినబడుతుంది. ఇదేమో చూస్తామనిపండోరా మరలా పెట్టెను తెరుస్తుంది. అందు మానవాళికి అంతిమశరణ్యమై ధైర్యమిచ్చే "ఆశ" మిగిలి వుంటుంది. పండోరా ప్రథమ కుతూహలంలో పెట్టె తెరవకుండా వుంటే మనుష్యులకే కష్టాలుండేవి కావనేది నీతి. ఉత్సుకత, కుతూహలం అన్ని దురవస్థలకు మూలం.

12

బైబిలులోని సృష్టిక్రమం (జెనెసిస్), మిల్టను "స్వర్గచ్యుతి" ప్రకారం దేవుడు ఆదాం అనే పురుషునీ, ఈవు అనే స్త్రీని సృష్టించి, ఈడెన్ అనే వనంలో హాయిగా ఉండండని పంపిస్తాడు. కానీ ఆ వనంలోని నిషిద్ధ వృక్షఫలాన్ని మాత్రం తినవద్దని శాసిస్తాడు. వీరికరిషడ్వర్గాలులేవు. ద్వంద్వాలులేవు. ఇదిట్లుండ, దేవునిచే బహిష్కరించబడ్డ తిరుగుబాటు నాయకుడు సేటను దేవునిపై నేరుగా ప్రతీకారం చేయజాలక, ఆదాము ఈవులను దైవశాసనోల్లంఘనులుగా చేయుటకు, ఈడను వనానికి వచ్చి నిషిద్ధ ఫల ఎంచక్కగ వుంటుందో తినుమని ఈవును. ప్రలోభపెడతాడు. అదేమో చూతమనే ఉత్సుకతతో ఈవు, ఆ పలాన్ని తానుతిని ఆదాంచేతా తినిపిస్తుంది. ఇక వారికి కామాది దుర్గుణాలు సంక్రమిస్తాయి. దేవునాజ్ఞ మీరిన ఈపాపులు భూలోకం మీద పడతారు. వీరి సంతానమైన మానవులు పాపసంభవులు. "పాపోహం పాపసంభవ". సేటను ప్రోద్బలంచే ఆదాము ఈవులు నిషిద్ధ వృక్షఫలాన్ని తిని దైవశాసనోల్లంఘన సాహసానికి ఒడిగట్టటకు కారణం ఉత్సుకతే అని వ్యాసకర్త అంటున్నాడు.

13

క్రైస్తవ మత సంస్కరణోద్యమం-చూ. 27

14

మూలంలో "సిపిలిస్" అని ఉంది

15

బార్బేరియనులు—సాధారణార్థం అనాగరికులు, మొరటువారు క్రూరులు అని. గ్రీకులు కానివారు, రోమన్ సామ్రాజ్యం వెలుపల వుండినవారు, క్రైస్తవమతావలంబనులు కానివారు అని పాశ్చాత్యులు అర్థం చెప్పినారు. హిందువులు హైందవేతరులను "మ్లేచ్ఛులు" అన్నట్లు, ముస్లిములు ముస్లిములు కానివారిని "కాఫిరు"లు అన్నట్లు-రానురాను బార్బేరియను అంటే ఎవరైనా కానీ తమకంటే తక్కువ నాజూకుతనం కలిగినవారికి పెట్టే "ముద్దుపేరు". మనగిరీశం వెంకటేశంతో "మీవాళ్లు బార్బరస్ పీపుల్‌కదా, నన్ను తిన్నగా ట్రీట్ చేస్తారో లేదో"? ("కన్యాశుల్కం").

16

అయాంబ్లికోస్-క్రీ శ. 330 సం॥ నాటి గ్రీకు తాత్వికుడు

17

మూలవ్యాసంలో "ఫేషన్" అనివుంది. ఫేషన్‌కు సరిపోయే మాట తెలుగులో నాకు కనపడలేదు. నేను "కాలీనాభిమానితరీతి" అన్నాను.

18

మధ్యయుగంలో యూరపులోని గొప్ప విశ్వవిద్యాలయాలు ఆక్స్‌ఫర్డు ("ఎద్దులకుంట", మాక్స్‌మూలరు "గోతీర్థం" అన్నాడు) పారిస్, సాలమాంకా, పడ్వా, క్రాకోవ్.పూర్వం మన దేశంలో, నలందా కంచి, తక్షశిల, విక్రమశిల, వలభి, ఓదంతపురిలలో గొప్ప విద్యాపీఠాలుండేవి.

19

అన్ సెల్మ్ (11-12వ శతాబ్దాలు) గొప్ప క్రైస్తవ మతాచార్యుడు. కాంటర్బరీకి ఆర్చిబిషప్పు. దేవుడున్నాడనుటకు ఒక ఉపపత్తిని చూపినాడు. అది ఇట్లాఉంది. దేవుడు ఉత్త

మోత్తమ స్వభావుడని మన భావన. స్వరూపం వుంటేకదా స్వభావం ఉండేది? ఏదో లౌకికాలు, చిన్నవి అయిన అంశాల్లో అయితే స్వరూపం లేకుండానే స్వభావాన్ని వర్ణించవచ్చు. హామ్లెట్ అనే స్వరూపం లేకున్నా, వాని స్వభావాలు మనకు తెలుసు. కాని సర్వ గుణసంపన్నుడైన దేవుడు స్వరూపాన్ని మాత్రం ఎట్లు కలగకుండవుంటాడు? పరిపూర్ణ గుణభావమే పరిపూర్ణ గుణరూప నిరూపణం చేస్తుంది. అట్టి దేవుడే లేకుంటే అతడు పరిపూర్ణ స్వభావుడేకాదు. అప్పుడు మనకు పరిపూర్ణ స్వభావతా భావమెందుకు కగ్గినట్లు? కనుక పరిపూర్ణ స్వభావుడైన దేవునికి స్వరూపం ఉండవలెను. కాబట్టి దేవుడున్నాడు. దేవుడున్నాడనుటకైన ఈసాక్ష్యం కేవలం తర్కంపై నాధారపడింది. దివ్యజ్ఞానంపైగాక ఆప్తవాక్యంపైగాక, శబ్దప్రమాణంపైగాక, కార్య-కారణ సంబంధంపైగాక ఆలోచనా శక్తి దీనికి ఆధారం. దీనిని "ఆంటొలాజికల్" సాక్ష్యమంటారు. పాశ్చాత్య వేదాంతులలో ఇది చాలా తర్జన భర్జనలకు గురిఅయింది. ఈ సాక్ష్యాన్ని థామస్ ఆక్వినోస్ తిరస్కరించినాడు. డికార్టే ఆమోదించినాడు. కాంటు ఖండించినాడు. హెగెల్ పునరుద్ధరించినాడు. సైంటు అన్‌సెల్మ్ తనకు తెలియకుండానే భగవంతుని విషయంలో తత్వప్రతిపాదనలో తర్కానికి పట్టంకట్టినాడు. అందుకే వ్యాసకర్త అన్‌సెల్మ్‌ను "ఇష్టలేని అధినాయకు"డన్నాడు. మన వేదాంతంలోకూడ మధ్వమతానుయాయులు, స్వమతస్థాపనకు తర్కాన్ని విరివిగా వాడిరి. ఆదిశంకరునిలోకంటే వీరిలో తార్కికత ఎక్కువ. వీరి గ్రంధాలపేర్లు "న్యాయసుధ", "తర్కతాండవం" అని తర్కసూచకంగా వుంటాయి. వీటి పరమావధిఏమి? హరియే సర్వోత్తముడు అని ఈ ముగింపు అన్సెల్మ్ చెప్పినట్లుగానేఉంది. ఆదిశంకరుడూ తుదకు "నహినహిరక్షతిడుక్ రుజ్‌కరణే భజ గోవిందం" అన్నాడు.

20

అబిలార్డ్‌పీర్ (1079-1142) క్రైస్తవ మతాచార్యుడు పారిస్‌వాసి తన పుస్తకం "అవును-కాదు" లో తర్కమే జ్ఞానానికి మూలం అన్నాడు. దీనినే గౌతముడు "న్యాయదర్శనం"మొదటి సూత్రంలోనే "ప్రమాణ.... తత్వజ్ఞానాన్ని శ్రేయసాధిగమః" అన్నాడు. అబిలార్డ్ శబ్దప్రామాణ్యాన్ని (అంటే బైబిలును) అంగీకరించినాడు. దాని యాధారంగానే తర్కం నుపయోగించి మత సత్యాలను సాధించినాడు. ఇదే ఛాందస క్రైస్తవ పీఠాధిపతులకు కోపకారణమైంది. వీడు దేవుని వాక్కయిన క్రైస్తవ సత్యాలకుమానవ నిర్మిత తర్కాన్ని పుపయోగిస్తున్నాడేఅని అబిలార్డ్‌ను "ఇష్టమున్న అధినాయకు"డని వ్యాసకర్త ఎందుకన్నాడంటే ఇతడు తెలిసే తత్వ నిరూపణలో తర్కానికి ప్రాముఖ్యమిచ్చినందువల్ల.

న్యాయసూత్రాల ప్రకారం ఈశ్వరసిద్ధికి మనవారూ ఉపపత్తులు చూపించినారు. ఉదయనుడు "న్యాయకుసుమాంజలి"లో 7 ఉపనిషత్తులిచ్చినాడు.

"కార్యాయోజన ధృత్యాదే పదాత్ ప్రత్యయతః శ్రుతేః
వాక్యాత్‌సంఖ్యా విశేషాచ్చ సాధ్యో విశ్వవిదవ్యయః

("న్యాయకుసుమాంజలి", పంచమస్తబకం, శ్లోకం 1)

దీని వివరణ ఇక్కడ సాధ్యంకాదు.

లీబ్నిజ్ దేవుడున్నాడనుటకు 4 ఉపనిషత్తులు చెప్పెను.

1. ఆంతోలాజికల్ సాక్ష్యం-ఇది అన్ సెల్మ్ చెప్పింది. పైన చర్చించినాను.

2. కాస్మోలాజికల్ సాక్ష్యం

ప్రతీదానికి కారణం ఉండవలెను. ఈ విశ్వానికీ కారణం వుంటుంది. అది కారణాతీత కారణం. అదే దేవుడు.

3. నిత్యసత్యసాక్ష్యం : నిత్యసత్యాలు శాశ్వత మేధస్సులోనే ఉంటాయి. ఆ శాశ్వత మేధస్సు కలవాడే దేవుడు.

4. విశ్వనియతి సాక్ష్యం : విశ్వంలో ప్రతి ఒకటి నియతి తప్పక నడుస్తుంటుంది. ఈ విశ్వనియతి నిర్మాతే దేవుడు. వేదంలో "ఋతం" ఇట్టిదే. దేవుడున్నాడనుటకు గణిత శాస్త్రీయ సాక్ష్యమొకటుంది. సుప్రసిద్ధ గణితశాస్త్రవేత్త లియోనార్డ్‌యూలరు (18వ శతాబ్దం) రష్యా చక్రవర్తిని రెండవ కేతరీను ఆస్థానంలో ఫ్రెంచిమేధావి (ఎన్‌సైక్లోపీడిస్టు) హేతువాదీ అయిన డెనిస్ డి డి రో (ట్) ను తికమక పెట్టేందుకు తాను గణితశాస్త్రపరంగా దేవుడున్నాడని రుజువు పర్చగలనంటాడు. ఏది ఆ రుజువు అని అడిగితే యూలరు ఫ్రెంచిభాషలో ఈలాగన్నాడట.

$$\text{"అయ్యా"} \quad \frac{(\text{ఎ}+\text{బి})^{\text{ఎన్}}}{\text{ఎన్}} = \text{ఎక్స్}$$

కాబట్టి దేవుడున్నాడు. జవాబిమ్ము. డి డి రోకి ఉక్రోషం రావడం తప్ప ఏం జవాబివ్వగలడు?

21

మాక్స్‌వీబరు (1864-1920) జర్మను విదేశీయుడు ప్రొటెస్టెంటు మతంమీద, మార్మికవేదాంతంమీద, వ్యావసాయక సమస్యలమీదా, హిందూ, చైనా మతాలమీదా వ్రాసినాడు.

22

"మంద" క్రైస్తవ మతంలో ఏసుక్రీస్తును "గొర్రెల కాపరి"గా రూపించడం కద్దు. ఆయన "షెపర్డ్" ఆయన అనుయాయులు "గొర్రెలమంద" లేక "మంద" మన్యవ్యాసంలో "మంద" అంటే ప్రతీ ఆదివారం చర్చికిపోయి బోధకుని ప్రవచనాలు వినేవారని అర్థం. మన మతంలో కూడా శ్రీకృష్ణునికి "గోపాలకు"డనీ, శివునకు "పశుపతి" అనీ పేర్లుండుట సంకేతార్థమే. "గోవులు", "పశుపులు" అంటే భక్తులని అర్థం.

23

డెకార్టె, రెనె (1596–1650) ఫ్రాన్సు దేశీయుడు. గణిత శాస్త్రజ్ఞుడు. పదార్థ శాస్త్రవేత్త, తాత్వికుడు, ఈయనది సుప్రసిద్ధ తత్వసూత్రం.

"కోజిటో ఎర్గో సం" నేను అనుకొంటున్నాను కాన నేనున్నాను" ఆధునిక శాస్త్రం, తత్వం, సాహిత్యం డెకార్టే ప్రభావం మిక్కుటం.

24

నీష్టే, ఫ్రెడరిక్ (1844-1900) జర్మను దేశీయుడు. తాత్వికుడు, కరుణను ప్రతిపాదించే క్రైస్తవ మతమంటే ఇతనికి అసహ్యం. షోపనావర్ శిష్యుడనని చెప్పుకొంటాడు. మళ్ళీ ఆయన ప్రతిపాదించిన తాపస జీవిత విధానంను ఖండించినాడు. "అధిమానవుడు" (సూపర్‌మాన్) ఆవశ్యముందన్నాడు. "దేవుడు చచ్చినాడు" అని ఇతని తీర్మానం. "జరథుష్ట్ర ఇత్యువాచ," "మంచి చెడుల అవతల" అనేవి ఇతని శక్తివంతమయిన సిద్ధాంతగ్రంథాలు. హిట్లరు నాజీ ఉద్యమంపై నితని ప్రభావముందని అంటారు. ఇతడు చెప్పిన సూపర్‌మాన్ తనంను హిట్లరు తనకే అన్వయించుకొని వుండవచ్చు. నీష్టే తుదిరోజులలో పిచ్చివాడయి పోయినాడు.

25

ఈ భావధోరణి చార్వాక దర్శనాన్ని పోలుతుంది.

26

మాకియవెల్లీ (1469-1527). ఇటలీకి చెందిన ఫ్లొరెన్స్ రాష్ట్రంవాడు. రాజనీతిజ్ఞుడు. "రాజు" అనే గ్రంథంలో రాజనీతిని ప్రతిపాదించినాడు. ఇందలి భావాలు కౌటిల్య, శుక్ర, గణక, కామందక రాజ, దండనీతుల వలె వుంటాయి.

27

సంస్కరణోద్యమం. దీనినే "రిఫర్ మేషన్" అంటారు. క్రైస్తవ మతం రోము నగరంలో వుండే "పోపు" అనే మతాధికారిచే పరిపాలితం. పదహారవ శతాబ్దంలో పోపుపై తిరుగుబాటు జరిగింది. పోపు చేస్తున్న దురాగతాలను అరికట్టేందుకే, క్రైస్తవ మతాన్ని సంస్కరించేందుకే ఈ ఉద్యమం. పోపు యాజమాన్యాన లంచగొండితనం, క్షమాపణ విక్రయం, హత్యలు జరుగుతుండేవి. క్రైస్తవసన్యాసుల, సన్యాసినుల లైంగిక విశృంఖలత పెరిగిపోయింది. వీరిని చూచి సామాన్య ప్రజలూ లైంగిక విశృంఖలతకు పాల్పడ జొచ్చిరి. యూరపులో ఆకాలంలో సిఫిలిస్ రోగం ఎక్కువ ఉండేదంటారు. పర్యవసానంగా మత విప్లవం వచ్చింది. దీన్ని "రిఫర్ మేషన్" అనిరి. పోపుది కేథలిక్ శాఖకాగా క్రొత్త శాఖ ప్రొటెస్టెంట్ (తిరుగుబాటు) శాఖ అయింది. యూరపులో అనేక కేంద్రాలలో ప్రొటెస్టెంటు నాయకులు బయలు దేరినారు. జర్మనీలో మార్టిన్ లూథర్, ఫ్రాన్సు, జెనీవాలలో కెల్విన్, స్విట్జరులాండులో జ్వింగ్లీ, స్కాట్‌లాండులో జాన్‌నాక్స్‌లు ఈ ఉద్యమ నాయకులు మార్టిన్ లూథర్ అగ్రగామి. జర్మన్ భాషలో వచన రచన కాద్యుడు. తన వివాదాస్పద రచనలలో పోపును రోతకూతలతో పిల్చినాడు. ఉక్రోషంపట్టలేక "మలం" వంటి పదజాలం వాడినాడు, ఈ ఫక్కిరచనలను "స్కాటాలజీ" అంటారు. "స్కాటాలజీ" "పోర్నోగ్రఫి" (లైంగిక రచనలు) ఒక్కటికావు. మన "దిగంబర" కవుల రచనలలో "స్కాటాలజీ" కన్పడుతుంది. కవి చౌడప్ప రచనలలో అసభ్యత (అబ్సీనిటీ) కన్పడుతుంది. నికార్సయిన "పోర్నో" రచనలు మన సాహిత్యంలో కానరావు. అయినా "కవికర్ణ రసాయనము" నుండి "రాధికా సాంత్వనము" వరకుండే శృంగార ప్రబంధాలలో "పోర్నో" అంశఉంది.

28

"అతలీయ" మూలంలో "యుటోపియన్" అని వుంది. "యుట్రోపియా" ఇది గ్రీకుపదం. 'ఉ=లేదు; టోపోస్ = స్థలం. అంటే ఎక్కడాలేని స్థలం అని అర్థం. ఇంగ్లీషు తాత్వికుడు సర్ థామస్ మోర్ (క్రీ. శ. 16వ శతాబ్దం) "యుటోపియా" అనే గ్రంథం వ్రాసెను. ఇందులో "ఆదర్శరాజ్యం" ఎట్లుంటుందో చక్కగా వర్ణించినాడు. ఆదర్శ రాజ్యముంటులేదు. కాబట్టి దానిని ఎక్కడా లేనిస్థలం అన్నాడు. "యుటోపియా" అనే పదాన్ని నేను "అతలం" అని ఆంధ్రీకరించినాను. ఇది గ్రీకు పదంతో శబ్దంలోనూ అర్థంలోనూ సరిసమానం. దీనికి మన 7 అధోలోకాలలోని అతలంకు సంబంధం లేదని గమనించ వినతి.

29

అగోరా- ప్రాచీన గ్రీకు దేశంలో నగర ప్రజాస్వామ్యాలుండేవి. ప్రతి పట్టణమూ ఒక స్వతంత్ర రాష్ట్రం. ప్రతి పట్టణం వార్డులుగ విభజితం. ప్రతి వార్డుకూ ఒక అగోరా వుంటుంది. అగోరా అంటే ప్రజాపరిషత్తు. ఈపరిషత్తు కలిసేస్థానం కూడా అగోరా అంటారు. అగోరా విపణివీధి కూడ. ఇచట సంత జరుగును. బయలు ప్రదేశంలో రైతులు తమ ఫలసాయాన్ని అమ్ముకొనేవారు. అంగళ్ళు వుండేవి. ఇచట దేవళాలు, వీర పురుషుల విగ్రహాలు (వీరగల్లులు) వుండేవి. ఇది మొత్తానికి అచ్చం మన ప్రాచీన పంచాయితీ చావడిలాగ ఉండేది.

30

అస్తిత్వ వేదాంతం- ఎగ్జిస్టెన్షియల్ ఫిలాసఫీ. దీనికి ఆద్యుడు డెన్మార్క్ దేశీయుడు సోరెన్‌కిర్కిగార్డ్ (1813-1855) ఈ వేదాంతం వివేచనకు విరుద్ధం. క్రైస్తవమతం భగవంతునితో ప్రత్యేక సంబంధం కలిగి యుండవలెను. సత్యమాత్మాశ్రయం. ఇతనిది భక్తితత్వం. గజేంద్రుని సంకట పరిస్థితి కిర్కిగార్డ్ తత్వంలో కనపడుతుంది. దీనినే "అస్తిత్వహతాశ" (ఎగ్జిస్టెన్షియల్ డెస్పేర్) అంటారు. ఇతని అనుయాయి మార్టిన్ బూబరు (1878-1965) ఆస్ట్రియా దేశీయుడు. ఇతడు "నేను-నీవు" అనే గ్రంథంలో జీవాత్మకు, పరమాత్మకు గల సంవాద సంబంధాన్ని వర్ణిస్తాడు. వీరిది సేశ్వరాస్తిత్వం. ఫ్రెంచివారైన జాపాల్ సార్త్రె, అల్బర్ట్ కామూలది నిరీశ్వరాస్తిత్వం అస్తిత్వ సూత్రాలు 1. వివేచనను వదలి వేయవలెను. 2. వ్యక్తిత్వం ముఖ్యం. 3. మానవుడు ఏకాకి 4. మనిషి తన నిస్సహాయతను గ్రహిస్తే స్వతంత్రుడవుతాడు. 5. మనిషికి మంచి చేయడానికీ, చెడు చేయడానికీ స్వతంత్రత ఉంది. 6. తన పని ఫలితాలకు తానే బాధ్యుడు. అస్తిత్వవాదం ఒక నిర్దిష్ట తత్వంకాదు. ఇప్పటిదీ కాదు. అర్జునునిదీ (భీష్మపర్వం) ఫౌస్టుదీ, హామ్లెటుదీ, రాసాల్నికోవ్ దీ అస్తిత్వహతాశే. కొంచెం బుర్రవుండి, ఉన్న పరిస్థితులను అసంతృప్తికరాలుగా భావించి, సగం పిచ్చెక్కిన ఏమనిషైనా అస్తిత్వ తాత్వికుడవుతాడు.

31

వైకో, గయంబట్టిస్టా (1668-1744) ఇటలీ దేశీయుడు. సంస్కృతీ చరిత్రకారుడు. సంస్కృతీ చరిత్ర పునరావృతమవుతుందని ఇతని మతం. ఆస్వాల్డ్ స్పెంగ్లరు, ఆర్నాల్డ్ టోయన్బీలు (20వ శతాబ్దంవారు) ఈ భావధోరణిలో చరిత్రలు వ్రాసినారు. స్పెంగ్లరు "ద డిక్లయిన్ ఆఫ్ ద వెస్ట్" ("పశ్చిమ పతనం") టోయన్బీ "ఎస్టడీ ఆఫ్ హిస్టరీ" ("చరిత్రాధ్యయనం") వ్రాసిరి. వైకో ప్రకారం చరిత్ర అనేది ఒక జీవప్రక్రియ కానీ కాలానుగుణ్య యాంత్రిక సంఘటనల పరంపర కాదు. ఇతడు ఆంత్రోపాలజీకి మూలపురుషుడు.

32

రూసో, జా జాక్స్ (1712-78) ఫ్రాన్సు దేశీయుడు. విద్యా విధానవేత్త. సమకాలీన సమాజాన్ని నిరసించినాడు. మనిషి నీతి మంతుడు. సంఘం నీతిహీనం అంటాడు. కృత్రిమ జీవనం వలన మనిషిపతనం చెందినాడు. ప్రకృతికి మరలండి అని పిలుపు ఇచ్చినాడు. అమెరికా తాత్వికుడు డేవిడ్ థోరూ దీనిప్రకారం ప్రకృతికి మరలి వాల్డెన్ సరస్సు దగ్గర నివసించెను. రూసో "సోషియల్‌కాంట్రాక్ట్" అనే సిద్ధాంతం వ్రాసెను. అందులోని మొదటి వాక్యం "మానవుడు స్వేచ్ఛలో పుట్టుతాడు. కానీ ఎచ్చట చూచినా గొలుసులతో కట్టబడి వున్నాడు." రూసో "సోషియల్ కాంట్రాక్టు" లోచూపిన సంకెళ్ళను మార్క్స్ ఎంగెల్సులు తమ "కమ్యూనిస్టు మానిఫెస్టో" (1848)లో "ప్రపంచంలోని పని మనుషులారా ఏకంకండి, సంకెళ్ళు తప్ప పోగొట్టుకొనేది ఏదీ లేదు మీకు" అన్న కడపటి వాక్యంలో త్రెంచినారు.

33

టోకివిల్, అలెక్సిస్ (1805-1859) ఫ్రాన్సు దేశీయుడు చరిత్రకారుడు. ప్రభుత్వ పెత్తనకాని విధానాలను నిరసించి భావస్వాతంత్ర్యాన్ని బలపరచినాడు.

34

"మాసెన్ గెసెల్‌షాఫ్"- ఇది జర్మనుపదం. 'జన సందోహం' అని యర్థం. వ్యాసకర్త జర్మను పదాన్నే వాడినాడు. నేను ఆ పదాన్నే వుంచినాను. ఇదొక కాలీనాభిమానిత పద్ధతి- జర్మను, ఫ్రెంచి పదాలను అచ్చటచ్చటా వేయడం.

35

ఎడ్మండ్ హస్సెర్ల్(1859-1938) చెకోస్లోవాకియాలో పుట్టుక. "ఫినామినాలజీ" (దృశ్యమానత) అనే తత్వం ప్రతిపాదించినాడు. దీనికీ అస్తిత్వవాదానికీ సంబంధం వుంది. మానవుని చేతనావస్థను విశ్లేషించుటకు ఫినామినాలజీ ఒక సాధనం.

36

హైడెగ్గర్, మార్టిన్ (1889-1975) జర్మనీదేశీయుడు. అస్తిత్వవాది. "ఉనికి-కాలం" (1927)లో "ఉండుట" ("బీయింగ్") అంటే ఏమో పరిశీలించినాడు. ఎడ్మండ్‌హస్సెర్ల్

శిష్యుడు. మనిషి ఒంటరితనం, జీవిత పరిమితులు, ఆవేదన మున్నగు వానిమీద వ్రాసినాడు.

37

జస్పర్స్, కర్ల్, థియోడోర్ (1883-1969). జర్మనీ దేశీయుడు, అస్తిత్వవాది. జర్మనీలోని ఇద్దర స్తిత్వ వాదులలో ఒకడు.

38

అర్టెగా ఈగసెట్, జోస్ (1883-1955). స్పెయిను దేశీయుడు. తాత్వికుడు. మానవజీవితంలో అస్తిత్వ హతాశ గూర్చి ఆలోచించినాడు. ఇతని గ్రంథం 'మూకల తిరుగుబాటు' (ద రివోల్ట్ ఆఫ్ ద మాసెస్) చాలా ప్రసిద్ధం.

39

నాజీ కేంద్రశిబిరం- దీనినే నాజీ కాన్సెంట్రేషన్ క్యాంపు అంటారు. మన వ్యాసకర్త అల్పోక్తి నిపుణుడు (మాస్టర్ ఆఫ్ అండర్‌స్టేట్‌మెంట్) అనిపిస్తుంది. ఇచట టూకీగా, పొడి మాటలలో పొడుపుకథగా ఏమి చెప్పుతున్నాడు? ప్రపంచ చరిత్ర లోనే సంభవించిన అత్యంత దారుణ సంఘటను చెప్పుతున్నాడు. జర్మనీలో హిట్లరుకాలంలో రెండవ ప్రపంచ యుద్ధమప్పుడు (1939-45) జర్మనీలో పలుచోట్ల ఈశిబిరాలు నెలకొల్పిరి. ఆస్క్‌విట్జ్, బెల్సెన్‌లు అట్టికేంద్రాలు. ఈశిబిరాలకు యూదులను పట్టుకురావడం, విద్యుత్ కొలిములలో భస్మంచేయడం, ఆ చితా భస్మంను వెదజల్లివేయడం నాజీల ప్రణాళిక. దాదాపు 50లక్షల యూదులిట్లా భస్మీపటలమైనారు. చితా భస్మంలో క్యాల్షియం, భాస్వరం, పొటాష్ ఉంటాయి. కావున ఇది చెట్లకు చక్కని రసాయనిక ఎరువుగా పనిచేస్తుంది. అందుకే కోసుగడ్డలు తలలు వేయకుండా ముందుగనే ఆకులు, కొమ్మలు కాచినాయి. క్యాంపుల లోని కార్యక్రమానికి జర్మనీకంతా రుడాల్ఫ్ ఐక్‌మన్ అజమాయిషీదారుడు. ఇతనికనేక శాస్త్రజ్ఞులు, డాక్టరులు సహాయకులుగా ఉండేవారు. యూదులను వూరకనే విద్యుత్ కొలిమిలో కాల్చుచుండలేదు. వారి కృత్రిమ దంతాలకు తాపించిన బంగారాన్ని సంగ్రహించి, కరిగించి దానిని యుద్ధఖర్చులకు పంపేవారు. యూదులను మొదట ఇంజెక్షనులతో చంపి, వారి దేహాలనుండి క్రొవ్వుపదార్థాన్ని రాబట్టి, దానినుండి చక్కని కాస్మెటిక్ సబ్బులు(ఒడలుకు రుద్దుకునేవి)చేసేవారు. యూదులు పచ్చ పొడి పించుకున్న ప్రత్యేక దేహభాగాల చర్మంవొలిచి, పదనుచేసి దిమాకుసంచులు, పర్సులు, సులోచనాల సంచులు చేసేవారు. ఇటువంటి ఫాన్సీ సామానులు న్యూరెంబర్గ్ యుద్ధన్యాయస్థానం సముఖాన ఎగ్జిబిటులుగా, సాక్ష్యాలుగా ఉంచబడినాయి. నాజీలకు ఇంత కినుక తెప్పించిన యీ యూదులెవ్వరు? యూదులు శ్వేత జాతివారు కారు. వీరు సెమెటిక్ జాతివారు. వీరి మొదటి నివాసం మధ్యఆసియాలోని జూడియా, తర్వాత పాలస్తీనా, ఇప్పుడు ఇస్రాయేలు అనే ప్రాంతం. అతి ప్రాచీనకాలంలో, 10 వర్గాల యూదులు వలసపోయి (చూ.అర్థవివరణ 8) ప్రపంచమంతా వ్యాపించినారట. వీరి కాత్మాభిమానం, స్వజాత్యహంకారమూ హెచ్చు. మధ్యయుగంనుండి యూదుల ప్రాబల్యం యూరపులో కన్పిస్తుంది. వ్యాపారం, విద్య, పరిశ్రమలు వీరి సొత్తు. ధన సేకరణ విషయంలో వీరి మీద చాలా చెడ్డకథలున్నాయి. యూరోపియన్ సాహిత్యంలో యూదులను నరరూపరాక్షసులుగా చిత్రించి వుంది. షేక్సుపియరు నాటకం ('వెన్నీసు వర్తకుడు') లోని యూదునిపాత్ర షైలాక్, డికెన్సు నవల 'ఆలివర్‌ట్విస్ట్' లోని ఫాగిన్‌పాత్ర అట్టివి. యూదులలో షైలాకులు, ఫాగినులే కాక ఏసుక్రీస్తు, స్పయినోజా, కర్ల్‌మార్క్స్, ఫ్రాయిడ్, మెనుహిన్, హెరాల్డ్‌లాస్కీ, ఐన్‌స్టీనులు కూడ కలరు. జర్మనీలో హిట్లరు కాలంలో ఉన్న క్రుప్‌కంపెనీ, జర్మనీలో పుట్టి ఇంగ్లండులో స్థిరపడిన రాత్‌చైల్డ్ కుటుంబమూ కలియుగ కుబేరులే. హిట్లరు యూదు కంపెనీ అయిన క్రుప్‌ను దివాలాతీయించెను. నేటికీ అమెరికాలోని పెట్టుబడంతా యూదుల అధీనంలోనేవుంది. జర్మనీ దుస్థితికి 'అనార్యు'లైన యూదులే కారకులని హిట్లరు గట్టినమ్మకం. హిట్లరు తమది ఆర్యసంతతి అని 'స్వస్తిక' చిహ్నం ధరించినాడు. యూదుల సమస్యకొక 'అంతిమ పరిష్కారం' కనుగొన్నాడు. అదే విద్యుత్ కొలిమి! రెండవ ప్రపంచ యుద్ధానంతరం, యూదులు చిరకాలం వాంఛిస్తున్న స్వతంత్రరాష్ట్రమీయవలెనని, మిత్రపక్షంవారు (అమెరికా, ఇంగ్లండు, రష్యా, ఫ్రాన్సు) 'బాల్ఫర్ అవార్డు' ప్రకారం 1948లో. ఐక్యరాజ్య సమితి తీర్మానంద్వారా పాలస్తీనాలో యూదులకు స్వంత స్థిర నివాసం ఏర్పరచిరి. ప్రపంచంలో ఉండే యూదులు చాలామంది పాలస్తీనాలో స్థిరపడిరి. అది నేడు 'ఇస్రాయేలు'. వలస వచ్చిన యూదులు, పాలస్తీనాలో శతాబ్దాల తరబడి నివసిస్తున్న అరబ్బులను తరిమివేసిరి. పదిలక్షల అరబ్బులు వలసపోయో, బహిష్కృతులయ్యో జోర్డాన్‌నది గట్లల్లో నివసిస్తున్నారు. ఇస్రాయేలు యూదులకుకాక, అమెరికా రాష్ట్రం, అరబ్బు గుండెలలో నాటినట్టి బాకు అంటారు. ఇస్రాయేలు దేశపు చిత్రపటం బాకు ఆకారంలో ఉండడం గమనింపదగును.

40

వర్గమానాలు : అభివృద్ధిని అంకెలరూపంలో జమకట్టితే అభివృద్ధి రెండు రకాలుగా వుంటుంది. ఉదాహరణకు "2" అనే సంఖ్యతీసుకుందాము.

సరళాభివృద్ధి ఇట్లుంటుంది :

2, 4, 8, 16, 32....ఇట్లు

వర్గమానాభివృద్ధి ఇట్లుంటుంది :

2, 4, 16, 256, 64036....ఇట్లు

శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారి కథ 'వడ్ల గింజలు' లో వతాక సన్నివేశంలో, ఈ వర్గమాన గణితంమీద ఆధారపడిన చక్కని సంఘటన వుంది.

41

రేఖలు- ఆధునిక శాస్త్రాలలో రెండు సంబంధిత అంశాలను గ్రాఫ్పులు గీస్తారు. వచ్చిన గీతలకు రేఖలు ("కర్వులు") అంటారు. రేఖలు పైకిపోయి క్రిందికి వంగవచ్చును. వక్రంగా పైకో, క్రిందికో పోవచ్చును. ఈ రేఖలపేర్లు పెరాబొల్లా, హైపర్ బొలా, అసింప్టోట్ అని వుంటాయి. అటువంటి రేఖలలో "స్టెప్ అప్" రేఖ ఒకటి. సూనె ఖరీదు మొదటి 10 దినాలు కిలోకి 10 రూ ఉన్నదనుకొనుడు. పదకొండవదినం హటాత్తుగా కిలోకి 50 రూ॥కి పెరిగినదనుకొనుడు. అప్పుడు రేఖ నిటారుగా పైకి పోతుంది. తర్వాత 10 దినాలు రూ. 50/-యే అనుకొనుడు. ఈ మార్పులను సూచించేటట్లు గీచిన గ్రాఫురేఖ ఇంగ్లీషు అక్షరం S వలె ఉంటుంది. ఈ రేఖనే వ్యాసకర్త పెట్టిస్తాడు. మార్పు కొంత కాలం ఒకేస్థాయిలో వుండడం, తర్వాత హటాత్తుగా హెచ్చిపోవడం, ఆతర్వాత అదే తలంలో వుండడానికి వర్ణన ఇది.

42

అయతొల్లాఖొమీనీ - ఇరాన్ దేశీయుడు. షియా తెగకు చెందినవాడు. ఇస్లాం ఫండమెంటలిస్టు. ఇరాను రాజు షా రజా పెహల్విని పదవీచ్యుతుని చేసి, దేశంనుండి వెడలగొట్టాడు. రాజు ఈజిప్టులో మరణిస్తాడు. ఖొమేనీ ఇరానులో ఇస్లాం మత ప్రాతిపదికపై పరిపాలన స్థాపించినాడు. ఇదీ 1979 ప్రాంతంలో సంభవించిన అయతొల్లా విప్లవం. ఈ అర్థవివరణ వ్రాసేనాటికి (సెప్టెంబరు 1986) అయతొల్లా ఖురానులో చెప్పినట్లు సాంఘిక మతాచారాలను అమలుచేస్తున్నానని చెప్పుకొంటున్నాడు. అయతొల్లా విధానం అధునికతా వ్యతిరేకమని వ్యాసకర్త అనడమేకాక, అందరూ ఒప్పుకొంటున్నారు.

43

ఈ వాక్యం 1980 ప్రాంతంలో, సోవియట్ సైన్యాలు అఫ్ఘనిస్థాన్‌లో ప్రవేశించిన విషయాన్ని చెప్పుచున్నది. అప్పటి రాజు దోస్త్ మహమ్మదుకూ, వామపక్ష నాయకుడు బబ్రక్ కెర్మాలుకు వైరం వల్ల, బబ్రక్ కెర్మాలు తనకు పత్తాసుగా సోవియట్ రష్యాను సైనికంగా జోక్యం కలిగించుకొనుమని ఆహ్వానిస్తాడు. అదే చాలునంటు రష్యాసైన్యాలు వచ్చి ఇతనిని అధ్యక్షునిగా చేస్తాయి. ఇచట దాడిచేసి, అమానుషకతకు పాల్పడిన రష్యా, ఆధునికతకు పేరుగన్నది అనేది అందరికీ తెలుసు. సోవియట్ రష్యా ఆధునికతయు, అయతొల్లా ఆధునికతా వ్యతిరేకతయు రెండును అనాగరిక అమానుష చర్యలకు పాల్పడినవని వ్యాసకర్త అంటున్నాడు.

44

నిషిద్ధాచారం - వ్యాసకర్త "టాబూ" అనే పదం వాడినాడు. అది చేయరాదు. ఇది చేయరాదు అనే నిబంధనలే "టాబూ"లు. దీనిని నేను నిషిద్ధాచారం అని వ్రాసినాను. ఆదిమ జాతులలోనూ, సంప్రదాయ సంఘాలలోనూ ఎక్కువగా నిషిద్ధాచారాలుంటాయి. ఇవి ఎప్పుడు "న" కారాత్మలు. "నాచరేత్", "మాచరేత్" అంటూ మన ధర్మశాస్త్రాలలో నిషిద్ధాచారాలున్నాయి. "నిషిద్ధాచారాన్ని" ఎట్లాచరించేదబ్బా అనే సందేహం రావచ్చును. చెప్పుతాను. ఆచారాలు రెండు రకాలు. 1. నియతాచారాలు (ఇవి "స"కారాత్మకాలు) 2. నిషిద్ధాచారాలు (ఇవి "న"కారాత్మకాలు). నియతాచారాన్ని చేయడం ద్వారా ఆచరించినట్లు, నిషిద్ధాచారాన్ని చేయకుండడం ద్వారా ఆచరించినట్లు పరిగణింపబడుతుంది. ఉదాహరణలిస్తాను.

"ఆమలకం నిత్యం భక్షయేత్" (ప్రతిరోజూ ఉసిరికను తినుము) అనేది నియతాచారం అనుకొందాం. అప్పుడు మనం రోజూ ఉసిరిక కాయను తింటే ఈ నియతాచారాన్ని పాటించిన వారమవుతున్నాం. "నపలాండు భక్షయేత్" (నీరుల్లిని తినరాదు) అనేది నిషిద్ధాచారం. మనం నీరుల్లిని తినకుండావుంటే ఈ నిషిద్ధాచారాన్ని పాటించిన వారమవుతాం. గొప్పగొప్ప ధర్మాలన్నీ నిషేధత్వాన్ని చెప్పబడినట్టివే. చూడండి : సనాతన,బౌద్ధ, జైన ధర్మాలకు మూలపురాళ్ళనదగిన అహింస, అస్తేయ, అపరిగ్రహాలు. ఇవి "న"కారాత్మక దర్మాలే. అందులోను ప్వగుణిత "న"కారాలు. ఎట్లంటారా? "హింస" చేయరానిది. కాబట్టి అర్థ రీత్యా "న"కారాత్మకము. దీనికి "అ"అనే "న"కారాత్మక ప్రత్యయాన్ని చేర్చినాము. "అ" వ్యాకరణరీత్యా "న"కారాత్మకం. అప్పుడు మనకు నిష్పన్నమయ్యే "అహింస" అనే పదం సంఘందృష్ట్యా ఆచరణలో గొప్ప ఆచారం, ధర్మం. కాబట్టి "స"కారాత్మకంగానే పరిగణింతం. దీనినే "ద ఫిలాసఫీ ఆఫ్ డబుల్ నెగెటివ్" అంటారు. కాల, దేశ, పాత్రానుసారం నిషిద్ధాచారాలు మారుతుంటాయి. అది వేరే కథ.

(అయిపోయింది)

మంత్రాక్షతలు

శ్రీ శంకరగంటి రంగాచార్యులు

1

మల్లెపువ్వు వికసించె;
ఇల్లు వలపుల నించె;
ముద్దుచు ప్రేయసి లేక
ఎడద మిగుల తపించె!

2

పోయిన నాకం వచ్చింది;
ప్రమోద కమలం విచ్చింది;
సురతతి దీవెన రువ్వింది;
కుపిత కులాంగ నవ్వింది!

3

కన్నీటి సరసిలో
కమలమ్ము వికసించె;
కోపించి, ఏడ్చి, వెం
టనే ప్రేయసి హసించె!

4

సొగసె వేడి, కవియె వెన్న,
కరగి, కరగి, స్రవియించును!
కవియె అగ్గి, సొగసె నూనె,
ధగధగమని జ్వలియించును!

5

కలను లాగి తెచ్చి ధరకు
దాని నిజము చేయు వరకు,
మ్రోగుచుండు ఎడదవీణ.
దాని కెపుడు విడుపు కాన!

6

ఆశ్చర్యముల మధ్య
ప్రశ్న చిన్నె;
అన్నిటిని చుట్టినది
ఒక్క సున్నె!


[పై కవితలు డా॥ కె. వి. పుట్టప్పగారి మినీ కవితలకు అనువాదాలు]

ప్రశ్నల వలయం

శ్రీ నిఖిలేశ్వర్

గాలి రెక్కలమీద కట్టుకున్న నా ఇల్లు
కూలిపోవాలంటే
ఇటుకేది? సున్న మేది?
రోజువారి ఆహారమే
నిత్యాన్వేషణగా మారితే
సౌందర్యమెక్కడ?
ఆరాధనా లోకమేది?
మొగ్గలన్నీ ఆహ్వానించే క్షణాల్లో
ముళ్ళ కర్కశత్వం మేల్కొడం దేనికి?
ఒక అభివ్యక్తిలోంచి మరో అభివ్యక్తిలోకి
ఆనందంలోంచి విషాదంలోకి
అలుముకున్న చీకటిచుట్టూ వెలుగు
వెలుగుచుట్టూ గాఢాంధకారం.

గాలిలో నిర్మించుకున్న ఇల్లు
వాయుపురాలకే అంకితం,
ఈ భూమ్మీదే కష్టమైనా నిష్ఠూరమైనా
చిన్న చిన్న రాజీబేరాలతో
ఆత్మసంతృప్తి చెల్లించే వెల
రోజుకింతా తరిగే ఆయుస్సు!
చుట్టూ మొలిచే సాగజెముళ్ళమీద
ఆ రెపరెపలాడే పూలరంగేమిటి?
ఆగని ప్రశ్న-శాశ్వతం కాని సమాధానం
తల బాదుకుంటుంది మార్మికతలో
గూడు కట్టుకుంటుంది వైరూప్యతలో,
గాలిరెక్కలపైనుంచి దిగినపుడే
అనుభవాల ఆనవాళ్ళు, ఈ నేలపై....!


మొటిమలు ?
బైద్యనాథ్ సురక్తాస్ట్రాంగ్
మొటిమలు, చర్మవ్యాధులకు కారణమైన అపరిశుద్ధ రక్తమునకు కారణము
అంత్రములు ఉదరము సరిగా పనిచేయకపోవటమే
సురక్తా జీర్ణక్రియ సరిగా జరుగుటకు సహాయపడి
చర్మమును మృదువుగాను, సుందరముగాను
చేయును.
సురక్తాస్ట్రాంగ్ మలిన రక్తమునుండి
చర్మరోగములనుండి మిమ్ములను కాపాడును.
Baidyanath
SURAKTA
STRONG.
బైద్యనాథ్ సురక్తాస్ట్రాంగ్
మొటిమలు మొదలగువాటి నివారణకు సురక్షితమైన
విశ్వసనీయమైన ఆయుర్వేద ఔషధము

SKT 67 T SVR

హిందీమూలం : ఆచార్య రామచంద్రశుక్ల
ఆంధ్రానువాదం : జి. రామచంద్రయ్య

"మానస్" ధర్మభూమి

ధర్మం యొక్క రసాత్మకానుభూతియే భక్తి. సమస్త విశ్వస్థితిలో నున్న భగవంతుని సత్ స్వరూపం యొక్క వ్యక్త ప్రవృత్తికి సంబంధించిన అపరిమితమైన ఆభాసయే ధర్మం. పరివారం మొదలు సమాజం లాంటి లఘుక్షేత్రాలనుండి సమస్త భూమండలం, సమస్త విశ్వం దాకా ఈ ప్రవృత్తిని దర్శించవచ్చు. ఈ సత్యస్వరూప ప్రవృత్తి యొక్క సాక్షాత్కారపరిధి ఎంత విశాలమైతే అంతఎక్కువగా మనకు భగవత్స్వరూపం వైపు అగ్రసరమౌతున్నట్లు భావం కలుగుతుంది. కేవలం కుల వైశిష్ట్యముందే ఈ ప్రవృత్తియొక్క అనుభవాన్ని పొందినట్లయితే ఆ భావం ఆ కుల నాయకుని దాకా లేదా కులదేవతదాకా వృద్ధి చెందుతుందని, జాతి, దేశ, విదేశ పరంపరగా విదనుభవాన్ని పొందితే ఆ భావం కూడ జాతి, దేశనాయకుల దాకా లేదా ఉపాసనా దైవందాకా వ్యాపిస్తుంది. భక్తునిభావం అంతటితో సంతృప్తి చెందదు. అతడు సమస్త విశ్వంలో సత్తుయొక్క ఈ ప్రవృత్తి సాక్షాత్కారాన్ని పొందటానికి సాధన చేస్తాడు. అతనిలో నున్న 'చిత్తు' బయటనున్న 'సత్తు'ను దర్శించినపుడు ఆనందం కలుగుతుంది. ఈ సాధన ద్వారా అతడు భగవంతుని యొక్క సామీప్యలాభాన్ని పొందుతూవుంటాడు. అందువలన తులసీదాసుకు రాముడు 'అంతర్ జామిహుసే బడ్ వాహిర్ జామీ'గా (అంతర్యామి కంటె బహిర్యామిగా) కనిపిస్తాడు.

గార్హస్థ్య ధర్మం, కులధర్మం, సామాజిక ధర్మం, లోక ధర్మం, విశ్వధర్మం లేదా సంపూర్ణధర్మం వరకు కనిపించే అనేక ధార్మిక ఉచ్చ నీచ క్షేత్రాలద్వారా సత్స్వరూపం యొక్క వ్యక్త ప్రవృత్తి గోచరమౌతుంది. ఓ పరిమిత వర్గశ్రేయోధర్మం కంటె విస్తృత జనసమూహ శ్రేయోధర్మం అత్యుత్తమమైంది. ధర్మ లక్ష్యం ఎంత విస్తృతమైనదైతే ఆ ధర్మంఅంత ఉదాత్తమైనదిగా భావించబడుతుంది. గార్హస్థ్యధర్మం, కులధర్మాలకంటె సామాజిక ధర్మం, సామాజిక ధర్మానికంటె లోకధర్మం, లోకధర్మానికంటె విశ్వధర్మం సంపూర్ణంగా అత్యుత్తమమైనదిగా భావించబడుతుంది పూర్ణ ధర్మానికి మిగిలినవన్ని అంగాలు మాత్రమే. అఖిల విశ్వ స్థితిరక్షణకు సంబంధించినది పూర్ణధర్మం. ఆ సంపూర్ణధర్మం సంపూర్ణ పురుషునియందు లేదా పురుషోత్తమునియందే వుంటుంది. దాని తత్వానుభూతి నిజమైన భక్తులకే కలుగుతుంది. ఈ అనుభూతికి అనుగుణంగా తదాచరణ కూడ ఉత్తరోత్తర వికసిస్తుంది. గార్హస్థ్య ధర్మంపై దృష్టిగలవాడు ఓ పరివార రక్షణను, వర్గధర్మం పై దృష్టిగలవాడు ఓ వర్గం లేదా సమాజరక్షణను, లోకధర్మంపై దృష్టిగలవాడు లోకం లేదా సమస్త మానవజాతి రక్షణను తిలకిస్తూ ఆనందానుభవం పొందుతాడు. భగవంతుడు పూర్ణధర్మ స్వరూపుడు. కనుక నిజమైన భక్తులు సంపూర్ణధర్మ స్వరూపాన్ని తమ ముందుంచుకొని యితరుల ముందుకూడ వుంచుతారు. కనుక క్రిమికీటకాదులు మొదలుకొని మానవునిదాకా సర్వభూత సంరక్షణనుచూచి ఆనందాన్ని నిజమైన భక్తులు పొందుతారు. విషయ వ్యాపకత్వాన్ని అనుసరించి వారి ఆనందం కూడ అంతగొప్పదిగా వుంటుంది.

పై చెప్పబడిన ధార్మిక క్షేత్రంలోని ఉచ్చనీచక్షేత్రాలు ధార్మిక స్వరూపానికి సంబంధించినవి మాత్రమే కాని దాన్ని పాటించే స్వరూపాన్ని గురించినవి కావు. పాలనా స్వరూప విషయంవేరు. అత్యున్నత ధార్మిక క్షేత్రాచరణ అతిసాధారణ కోవకు చెందినది. అలాగే నిమ్న ధార్మికక్షేత్రాచరణ అత్యుత్తమస్థాయికి చెందినది. పేదవారి యొక్క కడుపుకొట్టేవారిని పసులగూటి వద్ద వెండి చల్లుతూవుండటం చూస్తూనే వున్నాం. దీనపీడితులకు సహాయం చేసేందుకు ఒక పైసా కూడ ఇవ్వనివాడు ఆపదలో నున్న తన మిత్రునికై ప్రాణాలొడ్డేందుకు సిద్ధపడటం చూస్తూనే వున్నాం.

భగవంతునియొక్క సత్యస్వరూపాభివ్యక్తిని, ప్రవృత్తిని ఆధారంచేసుకొని తులసీదాసు యొక్క భక్తి మార్గం నడిచిందని చాల చోట్ల స్పష్టం చేయబడింది. ఆయన రాముడు ధర్మస్వరూపుడు. రామునిలీలల్లో ధర్మంయొక్క వివిధ రూపాల్ని ఆయన చూశాడు. ధర్మం అనగా భగవంతుని యొక్క సత్స్వరూప వ్యక్తీకరణ. అది నామరూపాత్మకమైన జగత్తునందే వుంటుంది. స్థితి విధాయిని యైన భగవంతుని వ్యక్త కళయందు హృదయం లగ్నం చేయక బాహ్యజగత్తు యొక్క నానా కర్మక్షేత్రాల్లో ధర్మం

యొక్క దివ్యజ్యోతి స్ఫురణను దర్శించక, కళ్ళుమూసుకొని తమ అంతఃకరణములో ఏదో ఓమూల భగవంతుని అన్వేషించు వారి మార్గంకంటె భిన్నమైనది తులసీదాసు యొక్క భక్తిమార్గం. భగవంతుని యొక్క సత్స్వరూపాన్ని గ్రహించి ఆయన మార్గం ధర్మంయొక్క వివిధ క్షేత్రాల్లో నుండి ప్రసరిస్తుంది. లోకంలో ధర్మస్వరూపం తిరోహిత మవటం, లేదా ఆచ్ఛాదితమవటం, భక్తుడు చూచినపుడు భగవంతుడు తన కన్నుల ఎదుటనే అదృశ్యమైనట్లు భావించి వియోగ వ్యాకులతను అనుభవిస్తాడు. అయితే అధర్మమనే అంధకారాన్ని చీల్చుకొని ధర్మజ్యోతి వెలిగినపుడు భగవంతుని మనోహరరూపం ఎదురుగా దర్శించినట్లు పులకించి పోతాడు.

మనవారు ధర్మం వలన అభ్యుదయం, నిశ్శ్రేయసం రెండూ లభిస్తాయని చెప్పారు. కనుక మోక్షమార్గ మెలాంటిదైనా ధర్మమార్గం నుండి సంపూర్ణంగా భిన్నమైందని చెప్పలేము. లోకంలో మనయొక్క పారస్పరిక వ్యవహారాంతర్గతంగా ధార్మిక వికాసం జరుగుతుంది. మన పారస్పరిక వ్యవహారాలకు, మన రాగాత్మక లేదా భావాత్మక హృదయమే ప్రేరకమైంది. కనుక మన జీవితానికి కర్మ (ధర్మం,) జ్ఞాన, భక్తి మార్గాల సమన్వయం లోనే సంపూర్ణత్వమున్నది. సాధనఎలాంటిదైనా సాధకుని యొక్క సంపూర్ణశక్తి సమన్వితం కావాలి. దాన్ని లేశమైన త్యజించరాదు. ఒకడు జ్ఞానం ప్రధానంగా, ధర్మోపాసనలను అంగికంగా చేసుకొని నడవవచ్చు. మరొకడు భక్తిప్రధానంగా జ్ఞాన కర్మలను అంగికంగా చేసుకొని నడవవచ్చు. తులసీదాసు భక్తిప్రధానంగా గ్రహించాడనగా భక్తిమార్గాన్ని అనుసరించేవాడు. ఆయన భక్తి మార్గంలో మార్గత్రయ సంగమం వున్నా ధార్మిక యోగం మాత్రం సంపూర్ణ పరిమాణంలో వుంది. ధార్మిక భావానికి ఆయన భక్తి భావానికి నిత్యసంబంధం వుంది.

'రామచరిత మానస్'లో ధార్మిక క్షేత్రంలో వివిధ ఉచ్చ, నీచ క్షేత్రాలు కనిపిస్తాయి. ఈవైవిధ్యం వలన అందందు కొన్ని సందేహాలు కూడ కలుగవచ్చు. ఉదాహరణకు భరత విభీషణుల పాత్రలను తీసుకోండి.

భరతుని సముజ్వల శీలాన్ని చూస్తే మన హృదయం ఉప్పొంగి పోతుంది. కాని అతడే తన తల్లిని దూషించటంచూస్తే కొంతమందికి సందేహం కల్గుతుంది. లోకధర్మంపై, లోకమర్యాదపై శ్రద్ధ చూపే తులసీదాసు తానే తన సర్వోత్కృష్టమైన పాత్రల ద్వారా వాటిని ఉల్లంఘింప చేశాడా ? ధార్మిక క్షేత్రాల్లోని వివిధ రంగాలను గూర్చి పైవివరణను దృష్టియందుంచుకొని చూచినట్లయితే దానికి సమాధానం వెంటనే దొరుకుతుంది. ధర్మం అధిక విస్తృత జనసమూహం యొక్క కష్టనష్టాలతో సంబంధం కల్గివున్నట్లయితే ఉత్తమశ్రేణికి సంబంధించినదిగా పరిగణించబడుతుంది. ధర్మస్వరూపం యొక్క ఔన్నత్యం దాని యొక్క లక్ష్యవ్యాపకత్వం పై ఆధారపడివుంటుందని భావించబడుతుంది. ధర్మానికి వ్యతిరేకత, తిరస్కారము పూర్తిగా కల్గినపుడు ఉత్తమ పాత్ర హృదయంలో రోషం జనించటం సహజమే. రాముడు పూర్ణధర్మ స్వరూపుడు. అందుకుకారణం అతడు అఖిలవిశ్వస్థితికి మూలభూతుడు కావటమే. రామునితో విరోధం, ధర్మవిరోధం ఒక్కటే. రాముడెవనికి ప్రీతిపాత్రుడు కాడో ధర్మం కూడ అతనికి ప్రీతిపాత్రంకాదు. అందువల్లనే తులసీదాసు ఇలా అంటాడు—

జాకే ప్రియ రామ్ న వైదేహీ।
సోనర్ తజఅ కోటివైరీసమ్, యద్యప పరమ సనేహీ॥


(సీతారాములెవనికి ప్రీతిపాత్రులుకారో వాడు పరమమిత్రుడైనా కోటివైరులతో సమానంగా భావించి త్యజించాలి.)

ఈ రామవిరోధం లేదా ధర్మవిరోధం యొక్క వ్యాపక దుష్పరిణామం కూడ ముందు వస్తుంది. సీతారాములు అడవికి బయలుదేరగానే సమస్తప్రజలు శోకమగ్నులౌతారు. దశరథుడు ప్రాణత్యాగం చేస్తాడు. ధర్మానికిగ్లాని, అపఖ్యాతి కల్గినపుడు అలాంటి దుష్పరిమాణాన్ని చూచి సాధుత్వాన్ని ప్రదర్శించేందుకు కోపాన్నంతా మ్రింగి విరక్తుడై తన తల్లి అని భావించి భరతుడు ఆమెను దూషించకుండా వున్నట్లయితే అతనికి రామునివట్ల గల ప్రేమ, ధర్మంపైగల ప్రేమ విదితం కావు. ధర్మస్వరూపుడైన రామునికి భరతుడు ఎంతో ప్రీతిపాత్రుడుగా, భక్తుడుగా మనకు కనిపిస్తాడు. కనుక కావ్యదృష్ట్యా తనకోపం ద్వారా తాను రాముని పట్ల ప్రేమను వ్యక్తీకరించాడు. ఆ కోపానికి ఓ విశిష్టోద్దేశ్యం వుంది. మహాకావ్యంలో లేదా ఖండకావ్యంలో ధర్మానికి గ్లాని కల్గినపుడు శ్రోత లేదా పాఠకుని హృదయం అన్యాయానికి తగిన శాస్తి జరగాలని తహతహలాడుతుంది. ఆ కథా వస్తువులో అన్యాయాన్ని శిక్షించే వ్యక్తి కనిపిస్తే పాఠక, శ్రోతలకు చాల సంతృప్తి కలుగుతుంది. అందుకు భరతునికంటె తగిన పాత్ర ఎక్కడుంది? సర్వానర్థాన్ని కలుగజేసిన కైకేయికి ఆ భరతుడే ఎదురుతిరిగితే ఆమెకు కల్గిన ఆత్మగ్లాని అనిర్వచనీయము. అలాంటి ఆత్మగ్లాని కల్గించటమే కవిలక్ష్యం. ఇలాంటి ఆత్మగ్లాని కల్గించటం మరే ఉపాయంచే సాధ్యపడదు.

ఎక్కడో మూలధర్మానికి అపమానం కల్గినపుడు దాన్ని వ్యతిరేకించినందుకు పరిమితక్షేత్ర ధర్మాన్ని, మర్యాదను, ఉల్లంఘించటం, అసంగతం కాదని సారాంశం. కావ్యంలో అలాంటి ధార్మిక అవహేళనల వలన కల్గిన బాధను వ్యక్తీకరించేందుకు మర్యాదను అతిక్రమించటం అవసరమౌతుంది.

ఇప్పుడు విభీషణుని తీసుకోండి. గృహస్థధర్మాన్ని, కులధర్మాన్ని, స్థూలసంకుచిత దృష్టితో చూసేవారు విభీషణుని "భాతృద్రోహి''అని "వంశనాశకుడని'' అనవచ్చు. కాని అతన్ని తులసీదాసు భగవద్భక్తునిగా గ్రహించాడు. అతన్ని భక్తకోటిలో చేర్చే సమయంలో తులసీదాసు దృష్టి కులధర్మం, గృహధర్మం యొక్క పరిధినిదాటి వ్యాపక లక్ష్యం గల ధర్మంపైపే వుంది. ధర్మంయొక్క ఉచ్చ, వ్యాపక భావన ననుసరించి విభీషణునికి భక్తరూపాన్ని ప్రసాదించటం జరిగింది. రావణుడు లోక కంటకుడు. అతని అత్యాచారాలవల్ల ముల్లోకాలు వ్యాకులత చెందుతున్నాయి. అతని అనుచరులు అకారణంగా సాధుసజ్జనులను బాధిస్తున్నారు. వీరికి అతీతంగా విభీషణుడు దర్శనమిస్తాడు. అతడు రావణునికి సోదరుడై వుండికూడ లంకలో ఓ మూల సాధుజీవనాన్ని గడుపుతాడు. అతని హృదయంలో సమస్తలోక రక్షకుడైన భగవంతునిపై భక్తి కలదు.

సీతాపహరణం తర్వాత రావణుని అధర్మం పరాకాష్ఠకు చేరుకున్నట్లు కనిపిస్తుంది. హనుమంతుని చూడగానే ధర్మ స్వరూపుడైన రామావతారం యొక్క ఆభాస కల్గుతుంది. అతని ధార్మిక భావం మరింత జాగృతమవుతుంది. తన సోదరుడైన రావణునికి నచ్చజెప్పుతాడు. అతడు ఒప్పుకోనపుడు గృహధర్మాన్ని పాటించాలా? కులధర్మాన్ని పాటించాలా? లేక వాటికంటె మిన్నయైన విస్తృతమైన ధర్మాన్ని పాటించాలా? అని అతనికి ధర్మపాలనను గూర్చిన ప్రశ్న ఉదయిస్తుంది. భక్తుని ధర్మభావం తన గృహం, కులం వీటి పరిధుల్లో బంధింపబడి యుండదు. అతడు సమస్త విశ్వకళ్యాణమనే వ్యాపకధర్మాన్ని లక్ష్యంగా భావించి అందులో ప్రవృత్తుడౌతాడు. కనుక అతడు లోకవిధాయకమైన ధర్మాన్ని అవలంబిస్తాడు. ధర్మస్వరూపుడు, భగవంతుడు అయిన శ్రీరాముని శరణుజొచ్చుతాడు.



ఈ మాసం-మీ నక్షత్ర ఫలం

ఫిబ్రవరి 1988

మేషము :- (అశ్విని, భరణి, కృత్తిక 1పా)

అశ్వినివారికి నెలంతా నానావిధముల శుభఫలములతో గడచును. ధనలాభం బాగుండును. శుభకార్యములలో పాల్గొనుట జరుగును. ఇంతవరకు ఉన్న చిక్కులు పూర్తిగా తొలగిపోయి వ్యవహారములలో విజయం కల్గును. సంతానమునకు కూడ అన్ని విధముల అభివృద్ధి కలుగును. సంసారదాంపత్యసౌఖ్యం చక్కగా ఉండును. కాని రాహువుయొక్క ప్రభావంచే సహవాసదోషము వలన 1,2పాల్లు చిన్న చిన్న వ్యసనములు పట్టుబడును.

భరణి వారికి ఇంతవరకు పట్టి పీడిస్తున్న గ్రహదోషం క్రమక్రమముగా తొలగుట ప్రారంభమైనది. మానసికంగా అశాంతి ఇంకాకొద్ది రోజులు కొనసాగును. చిన్న చిన్న విఘ్నములతో కార్యమునెరవేరును. బడలిక హెచ్చుగా నుండును. కావలసిన వారితోఅభిప్రాయ భేదములు కలుగును. మంచికిపోయి చెడును తెచ్చుకొనుట జరుగును. అయితే గతంకన్నా ఈనెలంతా నయమని చెప్పవచ్చును.

కృత్తిక 1. పా. వారికి ఈనెలంతా శారీరక, మానసిక వ్యధకలుగును 14వ తే-నుండి అన్నివిధాల బాగుండును. అన్నివిధాల కలసివచ్చును. తిరిగి 18వ తే-నుండి నెలాఖరువరకు ఎప్పటికప్పుడు అనుకోని సంఘటనలు జరిగి లాభించును. కాని భార్య అనారోగ్య మూలకంగా ధనవ్యయము జరుగును. స్థిరాస్తి సంపాదనలో కొన్ని చిక్కులను ఎదుర్కొనవలసి వచ్చును. కుటుంబంలో స్వల్పంగా అశాంతి, బంధుమిత్రుల రాకపోకల వలన వ్యయము జరుగును. రాజకీయ నాయకులకు, పత్రిక, కార్మిక, కర్షక వర్గాలకు, విద్యార్థులకు అతిశ్రమమీద లాభించును.

వృషభము :-

(కృత్తిక, 2, 3, 4 పా. రోహిణి, మృగశిర, 1,2పా.)

కృత్తిక 2, 3, 4 పా. వారికి శ్రమహెచ్చు. ఫలితం తక్కువ. మొదటి, రెండు వారములు శారీరకంగా, మానసికంగా కూడ వ్యధ, ఖేదము, శ్రమ, అనవసర కాలహరణము, కుటుంబంలో స్వల్పంగా అశాంతి, ధనవ్యయం ఇన్ని జరిగినా, 14తే నుండి అన్నివిధముల అనుకూలత ఏర్పడి, నెలాఖరునాటికి కుటుంబంలో సుఖశాంతులు, ధనలాభం, కార్యసిద్ధి కలుగును.

రోహిణి వారికి నెలంతా ఆర్థికముగా బాగున్నను, శారీరక, మానసిక వ్యధ, శ్రమ, ఖేదం, త్రిప్పటా తప్పదు. పనికిమాలిన వ్యయం కలుగును. శుభకార్యముల గురించి అధికంగా ధనవ్యయం హెచ్చుగా నుండును. సంతానముయొక్క అభివృద్ధికి చాల వ్యయ ప్రయాసలు పొందవలసి వచ్చును. కాని ఫలితం మాత్రం సామాన్యంగా ఉండును.

మృగశిర 1,2 పా. వారికి కూడ శుభా శుభ మిశ్రఫలం కలుగును. ఉద్యోగులకు, విద్యార్థులకు, వ్యాపారులకు మాత్రం మంచి యోగం కలుగును. అనుకోని లాభం, శుభకార్యములలో పాల్గొనుట, పెద్ద అధికారులతో స్నేహ సహవాసములు కలిగి అన్ని విధముల బాగుగా లాభించును. భార్యకుమాత్రం కొంత వరకు శరీరంలోని నలత, బలహీనత, చిన్న చిన్న యాక్సిడెంట్స్ కలుగును. వెనుకటికంటె లాభము బాగుగా ఉండి, ఉత్సాహమును కలిగించును.

మిథునము :- (మృగశిర 3. 4 పా. ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పా.)

మృగశిర 3, 4 పా. వారికి గృహచ్ఛిద్రములు అప్పటికప్పుడు కలుగును. శరీరంలో వేడిమి హెచ్చుగా నుండును. అలసట, బడలిక, ప్రయాణములవలన అప్పుడప్పుడు నలత చేసినట్లు బాధపడుట జరుగును. ధన వ్యయము కలిగినను తప్పనిసరిగా వివాహాది శుభకార్యములలో పాల్గొనుట, బంధువుల గురించి బాధపడుట, బంధుమిత్రాదులు రాకపోకలవలన ధన వ్యయంతోపాటు శ్రమ హెచ్చుగా నుండుట జరుగును. ధనమునకు లోపము లేక పోయినను ధనమునకు పనికిమాలిన వ్యయము జరిగి శారీరకముగా శ్రమపడవలసి వచ్చును.

ఆర్ద్ర వారికి సోదరుల మూలకముగా శ్రమ కలుగును. అన్ని వ్యవహారములలో విజయం కలుగును. రాజకీయముగా

పలుకుబడి పెరుగును. అన్ని విషయములలోను ఈ నక్షత్రం వారి పేరు మంచి పలుకుబడి కలిగియుండును. సంసార దాంపత్య సౌఖ్యం బాగుగా నుండును. పుష్కలంగా ధనము కలుగును. ఉద్యోగులకు, వర్తకులకు, విద్యార్థులకు, కార్మిక, కర్షక, వర్గము లకు అన్ని విధాల అనుకూలముగా నుండును. సోదరులకు నలత చేసి నిమ్మళించును.

పునర్వసు 1, 2, 3 పా. వారికి కుటుంబంలో చిన్న చిన్న నలతలు చేసి నిమ్మళించును. శ్రమ హెచ్చుగా నుండును. బంధుమిత్రాదుల రాకపోకలవలన శ్రమ హెచ్చుగా నుండును. 15 వ తేదీనుండి కుటుంబంలో సుఖశాంతులు వృద్ధియగును. ప్రతి విషయంలో ఉత్సాహం, సాహసం, ధైర్యం చూపించి, ప్రారంభంలో శ్రమమైనను విజయమును, లాభమును, సంఘంలో మంచి పేరు ప్రఖ్యాతులను సంపాదించుట జరుగును. అన్ని వర్గాలవారికిని బాగుగా లాభించును.

కర్కాటకము :- (పునర్వసు 4పా. పుష్యమి, ఆశ్లేష.)

పునర్వసు 4 పా. వారికి శ్రమతో కూడిన ప్రయాణములు, ధనవ్యయం జరిగినా, అన్ని విషయములలోను వ్యయంతో పాటు లాభము కలుగును. కాని మొదట 10 రోజులకంటె మిగిలిన 20 రోజులు బాగుగా ఉండును. కళత్ర, పుత్ర, బంధు సౌఖ్యం కలుగును. ధనము పనికిమాలిన ఖర్చుల క్రింద, వ్యసనముల క్రింద ఖర్చగును.

పుష్యమి వారికి, ఈ నెల 12 వ తే॥ వరకు ధన లాభము, కార్యవిజయం కలుగును. పెద్దవారితో పరిచయమువలన పేరు ప్రఖ్యాతులు బాగుగా నుండును. సంసార కుటుంబ సౌఖ్యము కలుగును. సంతానమునకు అనుకూలత, విద్యాభివృద్ధి జరుగును. 12 వ తే॥నుండి ఆర్థికముగా తొట్రుపాటు, మానసికంగా వైకల్యం, కుటుంబంలో నలత, సోదరుల మూలకంగా వ్యయము జరుగును.

ఆశ్లేష వారికి శరీరంలో అతి వేడిమి, మానసికంగా వ్యథ, కుటుంబంలో అనుకొనని, ఊహించని హఠాత్ పరిణామములు, ఖేదమును తెచ్చిపెట్టును. సంసార గృహ కుటుంబ సౌఖ్యం బాగుగా నుండును. ధనమునకు కొంత తొట్రుపాటు కలుగును. ఉద్రేకము, తాత్కాలికమైన ఆవేశమువలన మాటపడవలసి వచ్చును. ఉద్యోగులు, వర్తకులు, విద్యార్థులు, కార్మిక, కర్షకులు మొదలయిన అన్ని వర్గాలవారికిని ఇట్లే ఫలితము ఉండును.

సింహం :- (మఘ, పుబ్బ, ఉత్తర. 1 పా.)

మఘ నక్షత్రం వారికి నెలంతా కొన్ని చిక్కులు, వ్యవహారముల పరిష్కారములో జాప్యం కలుగును. ఆర్థికపు తొట్రుపాటు కలిగినా, ఏదో రూపంలో చిన్న చిన్న వస్తువుల సంపాదనము, సేకరణము జరుగును. ప్రయాణముల మూలకంగా ధన లాభము కలుగును. భూ వ్యవహారములలో వ్యవహారములు నెల చివరి వారములో ఒక స్థాయికి వచ్చును. మొత్తంమీద 1, 2 ఒడుదొడుకులు కలిగినా యోగము బాగుగానే యుండును. కాని చిన్న చిన్న నలతలు మాత్రం శరీరంలో కలుగుచు తొలగుచుండును.

పుబ్బ వారికి 17 వ తే.వరకు సంసారంలో క్లేశము, ధన వ్యయము కలుగును. పెద్దలతో, అధికారులతో స్నేహమువలన ధన సంబంధమైన ఇబ్బందులు తొలగిపోవును. తలపెట్టిన పనులు అవసరమునకు తగిన సహాయము, ధనము, చేకూరి నెరవేరిపోవును. నెల రెండవ భాగమంతా అన్ని విధముల అనుకూలముగా నుండును.

ఉత్తర 1 పా. వారికి గడచిన 2, 3 నెలలో ఏర్పడిన ప్రతిష్టంభన తొలగిపోవును. కాని 15 తే. వరకు గృహ వ్యవహారములు, ఆరోగ్యము, సామాన్యముగా నుండును. తొందరపాటువలన అనాలోచితముగా ముందడుగు వేయుటవలన జరుగబోయెడి మంచికి, కార్యసిద్ధికి ఆటంకము కలుగుచుండును.

కన్య :- (ఉత్తర 2, 3, 4, పా. హస్త. చిత్త 1,2, పా.)

ఉత్తర 2, 3, 4 పా. వారికి 15 వ తే.వరకు ఒక విధముగాను; 18 వ తే. తర్వాత నెల చివరివరకు మరియొక విధముగాను చిక్కులు కలుగును. సంతానమునకు, భార్యకు నలత చేసి నిమ్మళించును. అవసరములకు తగిన ధనము చేకూరి పనులు నెరవేరుచున్నను, శుభకార్యముల విషయమై శ్రమ, త్రిప్పట, ధన వ్యయము, కార్యభంగము జరుగుచుండును. ఆశ ముందునకు నడిపించుచున్నను, కాలయాపనము హెచ్చుగా జరుగునుండును.

హస్త వారికి నెల అంతా గురుశనులు, 14 వ తే. నుండి కుజుడు అనుకూలముగా లేరు. ఏ పని తలపెట్టినా సకాలంలో జరుగదు. ఆర్థికంగా కూడ తొట్రుపాటు తప్పదు. కోపము, చిరాకు, శారీరకముగా, మానసికంగా బాధపడుట జరుగును. మిగిలిన గ్రహములవలన అంతగా బాధపడక్కరలేకుండా సమయానుకూలమైన సహాయము లభించి ఏదో విధముగా కాలము గడచును.

చిత్ర 1, 2, పా. వారికి హస్త వారికన్న కొంత నయం. శారీరక, మానసిక వ్యధ, నిరుత్సాహము. ఎదుటివానిమీద కోపము ఉన్నా తలపెట్టిన పనులు చకచక జరిగిపోవుచుండును. అయితే పనులు నిర్విఘ్నముగా జరిగిపోవుటవలన ఈ నక్షత్ర జాతకుడు అల్ప సంతృప్తి కలవాడై, శ్రమను, ఖేదమును మరచిపోవుచుండును.

తుల :- (చిత్ర 3,4 పా. స్వాతి, విశాఖ 1,2,3 పా.)

చిత్ర 3, 4 పా. వారికి కాలము అన్ని విధముల అనుకూలముగా ఉండును. భార్యా పుత్ర సౌఖ్యం కలుగును. ధన లాభం కలుగును. ఉద్యోగులకు, వర్తకులకు, వ్యాపారులకు లాభము కలుగును. ఆరోగ్యం బాగుగా నుండును. మాట పలుకుబడి బాగుగా పెరుగును. అధికాదాయము, తక్కువ వ్యయము కలుగును. సాహసంతో, ధైర్యంతో ఎంత పెద్ద పనులు తలపెట్టినను, కొంచెమాలస్యం జరుగును. కాని అన్నీ అనుకూలముగానే జరుగును.

స్వాతి వారికి గ్రహబలం బాగుగా నున్నది. శ్రమా, బడలికా, త్రిప్పటా జరిగినా, కార్యములన్నియు సానుకూలముగా నెరవేరును. సంసార కుటుంబ సౌఖ్యం, ధనలాభము, సువర్ణ వస్త్రాభరణ ప్రాప్తి కలుగును. పదుగురిలో మాట గౌరవము, ప్రజా సమ్మానము, ఉద్యోగములో అభివృద్ధి కలుగును. శుభ కార్యములలో పాల్గొనుట జరుగును. అన్ని వర్గముల వారికి ఇట్లే సత్ఫలము కలుగును.

విశాఖ 1, 2, 3 పా. వారికి గతంకంటె కొంతమేలుగా ఉన్నను, చిన్న చిన్న చిక్కులు కొన్ని కలిగి తొలగిపోవును. అవసరములకు తగిన ఆర్థిక వనరులు ఏర్పడి తలపెట్టిన పనులు నెరవేరిపోవును. అయితే పితృవర్గమువారికి కొంతపీడ, అనారోగ్యము చేయును. అధికముగా ధనవ్యయము జరుగును. శుభ కార్యములలో పాల్గొనుట, బంధుమిత్రులు, రాకపోకలు. మొదలగువాని వలన కూడ వ్యయము జరుగును.

వృశ్చికము :- విశాఖ 4పా. అనురాధ, జ్యేష్ట

విశాఖ 4పా. వారికి 15తే. వరకు శ్రమ, బడలిక, త్రిప్పట, కార్యవిఘ్నము మొదలగునవి కలిగినను, నెల రెండవ భాగమందు ఆరోగ్యము, కార్యసిద్ధి కలుగును. సంతానముతో కొంచెము విరోధ భావము కలుగును. ధనగృహాది మూలకంగా నానావిధముల లాభించును. కాని సోదరస్థానముతో అభిప్రాయ భేదములు కలుగును. ఉద్యోగములో అభివృద్ధి కలుగును. సంఘంలో మంచిపేరు ప్రతిష్ఠలు కలుగును.

అనురాధ వారికి ఇంతవరకు కలిగిన శారీరక, మానసిక వ్యధలన్నీ ఇంతకుముందే తగ్గుదలలో ఉన్నను, ఈనెలకు బాగా తగ్గిపోయి, అనుకూలమైన శుభకాలము కలసివచ్చును. కాని ఆరోగ్య విషయంలో 13వతే. మొదలు నెలాఖరువరకు బడలిక, అతివేడిమి, శ్రమ; కుటుంబంలోను, బయటివారితోను, అనైకమత్యమును కూడ కలిగించును.

జ్యేష్ట వారికి మొదటి భాగమంతా శ్రమ, త్రిప్పట, బడలిక, క్లేశమును కలిగించినను, 14వ తే. నుండి మంచి ధన లాభమును కలిగించును. కుటుంబములో సుఖ శాంతులను వృద్ధి చేయును. నానావిధముల ధన లాభము కలుగును. శుభకార్యములలో పాల్గొనుట జరుగును. అధికారుల వలన, రాజకీయ నాయకుల వలన పెక్కువిధముల ధన గౌరవ సమ్మానములను పొందుట జరుగును.

ధనుస్సు :- మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ, 1 పా.

మూలవారికి శరీరంలో బడలిక, నలత, 14వ తే. నుండి అతివేడిమి, విశ్రాంతి లేకపోవుట, హెచ్చుగా సోమరితనము, ప్రథమ కోపము, చిరాకు మొదలగునవి కలుగును. ఇంచుమించగా తలపెట్టిన ప్రతిపనియు ఏదోవిధంగా వాయిదా పడుచుండును. ధనవ్యయము ఆదాయమును మించిపోవును. మధ్య వయస్సు వారికి యోగదాయకముగాను, ముదివయస్సు వారికి నానావిధ కుటుంబ చిక్కులతోను గడచును.

పూర్వాషాఢ వారికి గతంలోని చిక్కులు, ఆర్థికపు తొట్రుపాటు క్రమక్రమంగా తగ్గును. కుటుంబ శుభకార్యముల ఖర్చుకై 6-17 తే. ల మధ్య ధనవ్యయం కలుగును. అయినను ఏదో రూపంలో లోపము రాకుండా ధనము వచ్చుచునే యుండును. కుటుంబంలో మంచి ఐకమత్యము, శుభములు, సువర్ణాభరణ ప్రాప్తి మొదలగునవి చేకూరును. కాని మనస్సుమాత్రం ఏవో పనికి మాలిన ఆలోచనలతో గడచును.

ఉత్తరాషాఢ 1.పా. వారికి 18–29 తే. మధ్య కొంత నలత, ధనవ్యయం చేయును. ఇంకా 1, 2 ఒడుదొడుకులు మిగిలి యున్నచో అవి ఈ నెలతో పూర్తిగా తొలగిపోవును. ప్రతి పనియు విజయ మార్గమునకు తీసుకుని వెళ్ళును. బంధుమిత్రాదుల సౌఖ్యం కలుగును. ముఖ్యముగా పెద్దలు, రాజకీయ నాయకులు మొదలైన వారి పరిచయంతో అన్ని విధములయిన పనులు అవలీలగా సాధించుకొన కలుగుదురు.

మకరం :- ఉత్తరాషాఢ 2,3,4 పా. శ్రవణము, ధనిష్ట 1,2 పా.

ఉత్తరాషాఢ 2.3.4. పా. వారికి శరీరశ్రమ హెచ్చు. ఫలితం తక్కువ. ఆదాయం విపరీతంగా వచ్చును. కాని చేతిలో నిలబడదు. మనస్సు ఎల్లప్పుడును ఈ నెలంతా వ్యర్థాలోచనలతో నిండియుండును. అందులో తొందరపడి ఖర్చుచేయుట, మాటలను కూడ హద్దుమీరి పలుకుట, మొదలగు వాని వలన తర్వాత విచారించుట, చేజేతులా కొన్ని చిక్కులను తెచ్చిపెట్టుకొనుట జరుగును. స్థానభ్రంశము మాత్రం లేకుండా తప్పించుకొనుట జరుగును.

శ్రవణం వారికి నెలంతా చిక్కులతోను 13వ తే. నుండి మరింత చిక్కులతోను గడచును. గురు శని కుజులకు శాంతి చేయించుట మంచిది. ప్రయాణములు, త్రిప్పట, ధనవ్యయము, బంధువిరోధము, దూరదేశపు ప్రయాణములు, శ్రమా, బడలికా, సోదరులతో మాటపట్టింపులు మొదలయిన చిక్కులు కలుగును. ఏదో విధముగా కాలము పనికిమాలిన ఆలోచనలతో గడచును. ఈశ్వరాభిషేకము, సూర్యనమస్కారాలు చేయించుట మంచిది.

ధనిష్ట 1,2 పా. వారికి నెలంతా మంచి ధనలాభంతో, ఉత్సాహంతో, అన్ని రంగములలోను విజయంతో గడచును. ధనము మాత్రము ఖర్చగును. కాని ఏపని తలపెట్టినను అది దైవబలంచేత నిర్విఘ్నముగా కొనసాగును. రాజకీయములలో మంచి పలుకుబడి పెరుగును. విద్యార్థులకు, ఉద్యోగులకు మంచి ప్రోత్సాహకరమైన కాలము. ప్లీడర్లు, డాక్టర్లు మొదలగు స్వతంత్ర వృత్తిగల ఉద్యోగులందరికిని బాగుగా లాభించును.

కుంభం :- ధనిష్ట 3.4 పా. శతభిషం. పూర్వాభాద్రా 1,2,3 పా

ధనిష్ట 3,4 పా. వారికి నెలంతా ఉత్సాహ, ధైర్య, స్థైర్యములతో, నానా విధముల ధనలాభముతో, గృహ వాహనాది లాభముతో గడచును. ఉద్యోగులకు ప్రమోషను, విద్యార్థులకు మంచి ప్రోత్సాహము, వర్తకులకు, కార్మికులకు, కర్షకులకు వారి వారి అర్హతలకు తగిన ఉద్యోగ, ధన లాభము, అభివృద్ధి, చక్కని ఆరోగ్యము కలిగి మాటకు విలువ హెచ్చును.

శత భిషం వారికి భార్యకు నలత, అనారోగ్యము చేయును భార్యతో తరచు వాగ్వాదములు జరుగును. అవి కుటుంబంలోనే తప్ప, బయట అందరితోను మంచిగానే ప్రవర్తింప జేయును. ఉద్యోగులకు, వర్తకులకు వారి వారి అర్హతలనుబట్టి ప్రమోషను, లాభము, అభివృద్ధి కల్గును. పెద్దగా కాకపోయినను శుభ ఫలితములకు లోపము కలుగదు. చెప్పుకోదగినంతగా చిక్కులు కూడ కలుగవు. కాని కుటుంబంలో అశాంతి హెచ్చును.

పూర్వాభాద్ర 1, 2, 3 పా. వారికి శుభాశుభ మిశ్రమ ఫలం కలుగును. అదేపనిగా ఆలోచనలు చేయుచుండుట వలన మానసికముగా కొంతవ్యథ తప్పదు. యోగముబాగుగా నేయున్నను ఫలితము చేతికి వచ్చినప్పటికి మూడవ వంతు తగ్గిపోవును. నెల ప్రారంభంలో ఏదో 1, 2 తప్ప పెద్దగా చెడు ఫలితము లేవియు ఉండవు. పెద్దవారితో పరిచయంవలన, ఇతరులకు కూడసహాయము చేయుట జరుగును.

మీనము : పూర్వాభాద్ర 4 పా. ఉత్తరా భాద్ర, రేవతి.

పూర్వాభాద్ర 4పా. వారికి ఈ నెలంతా యోగప్రదంగా నుండును. ధనము బాగుగా కలసివచ్చును. కుటుంబంలో సుఖ సంతోషములు కలుగును. సువర్ణ వస్త్రాభరణాదుల సంపాదనం, గృహ వాహనాభివృద్ధియు లేదా భూసంపాదనము మొదలగునవి జరుగును. మొత్తం మీద నానావిధముల సుఖ శాంతులతో గడచును.

ఉత్తరాభాద్ర వారికి నెల మొదటి భాగమంతా గృహ సంబంధమైన చిక్కులతోను, వ్యయ ప్రయాసలతోను గడచును. రెండవ భాగమంతా మంచి ఉజ్వలముగా నుండును. అప్పటివరకు తెగని వ్యవహారములు విజయోన్ముఖములగును. తలపెట్టిన పనులన్నియు అనుకూలముగా నుండును. ఉత్తరోత్తరాభివృద్ధి కలుగును.

రేవతి వారికి మంచి ధనలాభం కలిగించు కాలము. నెల చివరలో కార్యసిద్ధి, ఊహించనంత ధనలాభము కలుగును. పట్టినదల్లా బంగారమగును. మాటకు మంచి విలువ కలుగును. నెల రెండవభాగము నుండి సర్వవిధముల కార్యసిద్ధి, ధనలాభము బంధుమిత్రాదుల సౌఖ్యం, అందరివలన ప్రశంసలు లభించును. చాలా ఉత్తమమైనకాలము.

సర్వేజనా స్సుఖినో భవంతు.

(ఆయా వయస్సులను అనుసరించి ఫలములను అన్వయించు కొనవలెను.)

సిద్ధాంతి: **నిష్ఠల వేంకట సత్య సుబ్రహ్మణ్యాం**

డా॥ ఇంగువ కార్తికేయశర్మ

ఆంధ్రమున కొన్ని అపురూప వైష్ణవ ప్రతిమలు

మహావిష్ణువును వేదకాలమునాటికి ముఖ్యదేవతగా నెరుగము. ఋగ్వేదమున భూనభోంతరాళములలో చెరించెడు ఉరుక్రమ, విక్రమ మున్నగు రూపముగ పేర్కొనబడెను. బ్రాహ్మణములలో విష్ణువును ఆదిత్య లేక అగ్నిస్వరూపముగ సూర్యభగవానుని అంశగా పేర్కొనిరి. మహాభారతాంర్గతమైన నారాయణీయమునుండి వాసుదేవుని పూజ పంచరాత్ర, భాగవత, సాత్వత క్రమములుగా వేరు వేరు యాచారములు ప్రబలినటుల తెలియుచున్నది.

వాసుదేవుడు అధిదేవతగా, వృష్ణివీరుడుగా యేకాంతమతానుయాయులు పూజించుచుండిరి. కృష్ణ-వాసుదేవపూజ మధురలోను, మధ్యదేశమున మిక్కిలి వాడుకలో నున్నటుల శాసనములేగాక దేవాలయములను బట్టి నిగ్రహింపవీలగుచున్నది. వైష్ణవము రెండు మార్గముల అభివృద్ధి చెందినది. మొదటిది వ్యూహ. రెండవది విభావము. వ్యూహమున పంచవీరులను అర్చించుట వీరు- వాసుదేవ, కృష్ణ, సంకర్షణ లేక బలరామ, ప్రద్యుమ్న, అనిరుద్ధ లేక సాంబ. విభావరూపముల విష్ణుభగవానుని పది యవతారముల పూజించుట యాచారమైనది. ఈ దేవతా రూపములగూర్చి శతపథ బ్రాహ్మణమున (I, 8, 1-6), ప్రస్తావనయున్నది. ప్రజాపతి మత్స్య-కూర్మ వరాహావతారముల నెత్తినట్లు తెలియుచున్నది. ఈ యవతార రీతులను విష్ణుమూర్తికి సక్రమింపజేసిరి మొదటగా వ్యూహ అనగా పంచవీరుల గూర్చి నాణెఘాటు (మహారాష్ట్ర) లోని శాసనమున గలదు. ఈ శాసనము క్రీ.పూ. 2వ శతాబ్ది సాతవాహన రాజ్ఞి నాగనిక యొసగెను. అదే కాలమునకు చెందిన 1 ఇండో-గ్రీకు చక్రవర్తుల నాణెములపై వాసుదేవ-కృష్ణ, సంకర్షణ-బలరామ మూర్తులున్నవి. ఈ నాణెములు 'ఐఖనుం' యను చోట త్రవ్వకములలో లభించెను. ఈ ప్రాచీన స్థలము[1] రష్యా-ఆఫాఘనిస్థానము తీరముల ఆక్సస్‌నది గట్టున గలదు.

ఉత్తర భారతమున మోరాయనుచోట (మధురకు చేరువగా) బావిలో లభ్యమైన శాసనముద్వారా క్రీస్తుపూర్వము ఒకటవ శతాబ్ది పంచవీరుల ప్రతిష్ఠించిన రాతి దేవాలయమున్నటుల తెలియుచున్నది. ఈ ఆలయమునకు గ్రీకువనిత తోషా భాగవతపూజా కైంకర్యములకు దానముల నొసగెను.

మధురలో లభ్యమైన మరియొక శాసనము రాజు శోడశ క్రీ. పూ 1వ శతాబ్దిని మహాస్థానమున వాసుదేవమూర్తిని ప్రతిష్ఠించి చుట్టును వేదిక తోరణాలంకృత ప్రాంగణమును గావించెను. చిత్తోరగఢ్‌లోని ఘోసుండి యనుచోట లభ్యమైన శిలాశాసనము నందుగూడ సంకర్షణ- వాసుదేవులకుగా నిర్మింపబడిన ఆలయము, పూజాశిలాప్రాకారములగూర్చి చర్చింపబడియున్నది. ఇది నారాయణ వాటికగాగూడ ఖ్యాతిబడసెను. చిత్తూరుజిల్లా గుడిమల్లములోని నైష్ఠిక స్థానమునుబోలి, నారాయణునికి ఇచ్చట శిలావేదికతో ప్రాకారవాటిక గావింపబడెనన్నమాట. ఉదయపూరుజిల్లా నగరియను చోటను సంకర్షణ-వాసుదేవులకు పూజాశిలా ప్రాకారమున్నటుల శాసనమున్నది. ఇక విదిశ (మధ్యప్రదేశ్), చేరువగానున్న బేసనగరములోని గరుడ ధ్వజశాసనమును వేరుగా చెప్పనవసరములేదు. ఈ ధ్వజమును ఆలయప్రాంగణమున ముఖస్తముగా సుప్రతిష్ఠించిన భాగవతోత్తముడు హెలియడోరసురాజు, దియానుని కుమారుడు. క్రీస్తుపూర్వము రెండవ శతాబ్ది.... పాలించెను. ఇచ్చట గావింపబడిన త్రవ్వకముల నీవాసుదేవుని ఆలయము- పెక్కు గరుడ ధ్వజములతో విలసిల్లినటుల విదితమైనది.[2]

ఇక ఆంధ్రమున వైష్ణవ సాంప్రదాయము యెప్పుడువచ్చెను? రూపలక్షణము లెట్టివి? యను ప్రశ్నలకు సమాధానముగా, నిటీవల పరిశోధకుల కృషి పేర్కొనవలసియున్నది. వైష్ణవమతమునకు సంబంధించిన కొన్ని యపురూప శిల్పకళా అవశేషములు అప్పుడప్పుడు బయలుపడినను, బౌద్ధ-శైవ ఆలయములున్నంత మెండుగా, ప్రాచీనమైన వైష్ణవ స్థలములు కానరాలేదని చెప్పవచ్చును. ఆంధ్రతీరమున బౌద్ధము బాగా నాటుకొని క్రీ. పూ. 3వ శతాబ్ది నుండి క్రీస్తబ్దము 4వ శతాబ్ది వరకును యెక్కడో అరుదుగాతప్ప, శైవ-వైష్ణవ' ఆలయములు- పూజ అంతగా కానరాలేదు, తెలంగాణ

మున అట్లుగాదు. వృష్ణివీరులపూజ (క్రీ. పూ. రెండవ శతాబ్ది శాతవాహన శాసనముల (నానెఘాటు) ద్వారా ప్రభావమున్నదని పైన పేర్కొంటిమి. ఈ కాలమునుండియే, అక్కడక్కడ వైష్ణవ పూజాచారములు తెలంగాణమున చోటుచేసుకొని ప్రబలి తీరాంధ్రము నకు ఇక్ష్వాకు- విష్ణుకుండిల కాలమునాటికి వ్యాప్తమయినటుల కొన్ని నిదర్శనములు లభించినవి.

కొండమోటు ఫలకము:[3]

గుంటూరుజిల్లా పిడుగురాళ్ళ గ్రామమునకు చేరువగా కొండమోటు యను ప్రదేశమున లభ్యమైన ఈ దాచేపల్లిరాయి ఫలకము నాగార్జునకొండలోని శిల్పఖండికలను బోలియున్నది. ఈ తెల్ల సున్నపురాయి (దాచేపల్లి) శిల్పము 1.5 × .61 మీటర్ల పరిమాణము గల్గి ముఖస్తముగ ఆరు దేవతా స్వరూపముల అర్థశిల్ప శైలియ చూపుచున్నది.

మధ్యగానున్న ముఖ్యదేవత రెండు చేతులున్న నరసింహుడు. చేతులు స్పష్టముగ మానవ హస్తములే! సింహపక్త్రము, కుదించు కొన్న లావైన పిరుదలు కాళ్ళు, కూర్చొనియున్న మృగరాజును బోలియున్నవి. దేహమంత పశురూపమే, శ్రీవత్స చిహ్నము వక్షస్థలముపైనున్నది. రెండు చేతుల గద, డిండిమములున్నవి. తక్కిన అయిదుగురు వీరులు కుడినుంచి యెడమ వరుసగానీ ప్రకారము నిల్చుకొనియున్నారు.

మొదటి దేవత, ఆభంగములో కుడిచేతిని ఇక్షుచాపము, యెడమ మకర ధ్వజముకల్గియున్న ప్రద్యుమ్నుడు, రెండవ దేవత సమపాద స్థానకుడై కుడిచేయి అభయముద్ర I వామహస్తమున శంఖమును కటిపై నిడుకొనియున్నాడు. శిరస్సుపై కిరీటము, ఇంద్రునిబోలిన కిరీటము, విష్ణువుగా నెరుగవలయును. మధ్య ముఖ్య దేవత నరసింహుడు, వామ భాగమున నాల్గవ స్వరూపము అతి భంగ మున నిల్చున్నది. వాసుదేవ-కృష్ణుడు. చేతుల విల్లు, వేణువు కల్గి యున్నాడు. అయిదవ స్వరూపము బలరాముడు- కుడిచేతిలో సురా పాత్ర, వామహస్తము కటిపై నుంచుకొనియున్నాడు. చివరనున్న దేవత ఖడ్గము, ఖేటకము గల్గియున్న అనిరుద్ధుడు. ఈ ఫలకము క్రీస్తబ్దము 4-5 శతాబ్దికి చెందిన దనుటలో యెట్టి సంశయములేదు.

ఏలేశ్వరపు విష్ణుమూర్తి:[4]

నాగార్జునకొండ కెదురుగా కృష్ణానది పశ్చిమ తీరమున పెద్ద కొండయే, యేలేశ్వరపుకొండ. నాగార్జునసాగరమువల్ల ఈ లోయ లన్నియు నీటిలో కలసిపోయినవి. ఈ చరిత్ర ప్రసిద్ధిగాంచిన రెండు పర్వతములు చాలా యెత్తైనవగుటచే ఈనాటికిని కానవచ్చు చున్నవి.

యేలేశ్వరము గ్రామముకొండ చుట్టునుక్రింద యుండెడిది. ఇది ఇక్ష్వాకుల తదనంతరము ప్రసిద్ధికి వచ్చి తరువాతి చాళుక్యులు, తెలుగు చోళులు, కాకతీయ సామ్రాజ్యముల క్రింద ప్రసిద్ధమైయుండిన చారిత్రక ప్రాంతము. ఈ చోటు 1960లో జరిగిన పురావస్తు పరి శోధనల ఫలితముగా నొక దాచేపల్లి రాయి కృతమైన విష్ణుమూర్తి శిల్పము నిందు వివరించుచున్నాను.

ఈ ప్రతిమలు తల, చేతులు, కాళ్ళు ఛిద్రములైనవి, అట్లు న్నను కుడిచేతిని దండము వామహస్తమున శంఖముండుటవలన నీమూర్తి విష్ణువుగా గ్రహింపగల్గుచున్నాము. ఇక్ష్వాకు శిల్పములైన కార్తికేయ విగ్రహములలోనున్న రీతిని పింజపోసి కట్టిన ధోవతి- చెవులకున్న ఆ కర్ణాంత కుండలములు-భుజస్కంధముపై వాలిపడి యున్నవి. ఇట్టి కుండలములు మకర, వ్యాఘ్ర, చక్ర, పతకముల, బోలినవి పలు విధముల నాగార్జునకొండ- అమరావతి శిల్పముల చూడనగును.[5] ఈ స్వామికి యజ్ఞోపవీతములేదు. సాలార్‌జంగ్ మ్యూజియము డైరక్టరుగానున్న శ్రీ యం ఎల్. నిగమ్[6] ఈ యేలేశ్వరపుమూర్తిని వైకుంఠ నారాయణుడుగా గ్రహించిరి. ఈ ప్రతిమకు మూడు శిరములున్నట్లు వూహించిరి, మధ్యన విష్ణు స్వరూపము- కుడిప్రక్కగా సింహవదనము, యెడమ- వరాహవద నముగా భావించిరి. వీరిట్లు పొరబడి కుండలములను శిరములుగా భావించి నీయేలేశ్వరపుమూర్తిని యావద్భారతావనియు మొదటి శిల్పముగాను, అత్యంత ప్రాచీనమైనదిగా పలుతావుల పేర్కొని యుండినాడు,ఈ శిల్పమున వైకుంఠనారాయణ ప్రతిమాలక్షణ-లాంఛ నములను కానరాము. భుజస్కంధములపై వాలియున్న కుండములను శిరములుగా నెరుంగుట పొరబాటు:

ఇటీవల నేను, మా సహచరులు శ్రీ శ్రీనివాసరావు,[7] ఖురేషి నాగపూరులోని ఉత్ఖననశాఖ తరపున రంగారెడ్డి జిల్లాలో కొన్ని చారి త్రక స్థలములను దర్శించితిమి. యేలాల - గోవిందరావుపేట గ్రామ ముల కొన్ని చక్కని వైష్ణవప్రతిమలు అదృష్టవశాత్తు మా దృష్టికి వచ్చినవి. ఈ వ్యాసమున సచిత్రముగా వీనినిగూర్చి పేర్కొందును.

గోవిందరావుపేట : వరాహస్వామి (చిత్రము-1)

గోవిందరావుపేట - యేలాల గ్రామములు తాండూరు రైల్వే స్టేషన్‌నుండి 21 కిలోమీటర్ల ఆగ్నేయముగా కాకవేణి యను చిన్న

నది ఒడ్డున ఉన్నవి. ఊరికి ఉత్తరముగ శిథిలమైన రాతిగోడల మధ్యగా నొక దేవాలయమున్నది. చతురస్రాకారముగానున్న గర్భాలయము ముందున అంతరాలము కానవచ్చుచున్నవి. పై కప్పు, గోడలు శిథిలమగుటచే వూరి ప్రజలు చుట్టునున్న రాళ్ళను అమర్చి కొంత మరుగు ప్రదేశముగా చేసిరి. ప్రాంగణమున సోపానము చంద్ర శిల మట్టిలోనున్నట్లు తెలియుచున్నది. ఈ దేవాలయమును వరాహ స్వామి ఆలయమని యిప్పటికిని ప్రజలు ఆరాధించుచున్నారు.

గర్భాలయమున సుప్రతిష్ఠితమై, మన అదృష్టవశాత్తు చెక్కు చెదరకయున్న మూర్తి శిల్పము భూ వరాహస్వామి ఆంధ్రదేశమునే కాక యింతటి ప్రాచీన విలక్షణ దేవతాశిల్పము మరెక్కడను కానరాము. ఈ శిల్పరాజము దాచేపల్లి సున్నపురాయి కృతము. అమరావతి-నాగార్జునకొండల శిల్పములన్నియు యిట్టి రాతితో మలచినవి. ఇటువంటి రాయి తాండూరు ప్రాంతములందు కూడ లభించుచున్నది. ఈ శిల్పమున స్వామి ముఖము వరాహాకృతి—

వరాహవదనః :

తక్కిన శరీరమంతయు మానవరూపము. కుడికాలు శేష నాగముయొక్క శరీరముపై నధిష్ఠించినాడు. నాల్గు చేతులున్నవి. కుడితట్టున్న పై భుజపై భూదేవిని కూచుండబెట్టి, క్రిందుగా రెండవ చేతిని ఆమెను పైకెత్తి పట్టుకొనియున్నాడు. ఈ చేయి వంగిన కాలిపై నాధారముగానున్నది. వామభాగపు పైచేతిని శంఖమున్నది. క్రింద హస్తము కటిపైని, వస్త్రపు మడతపై నుంచియున్నాడు. ధోవతి వస్త్రమేఖలముతో బంధింపబడియున్నది. ఉదరబంధము, ముక్తాయజ్ఞోపవీతములేగాక కంఠమున పట్టెడలు మూడు కానవచ్చుచున్నవి. అమ్మవారు చక్కని సౌందర్యవతి. ఇక్ష్వాకు శిల్పములలో సాధారణముగా కానవచ్చు స్త్రీ రూపముకల్గి, అంగసౌష్ఠవము కంఠమున హారములు, ఆకర్ణాంత కుండలములు, బాహువలయములు, మధ్యగా పాపిటతీసిన చక్కని ధమ్మిల్ల శిరోజాలంకారము యీ విలక్షణమైన భూదేవి ముఖము, చేతులు, క్రింద భాగములు కొంత విరిగియున్నను, క్రీస్తబ్దము నాల్గవ లేక అయిదవ శతాబ్దినాటి శిల్పకృతముగా స్పష్టము చేయుచున్నవి. క్రిందనున్న శేషనాగుడు పైనున్న భగవంతుని సూచించుచున్నాడు.

భూ వరాహస్వామిని స్వయంప్రధానదేవతగా సుప్రతిష్ఠితమైన ఆలయము - యింత ప్రాచీనమైనది నాకు తెలిసి యెక్కడను కానరాలేదు.


శతపథ బ్రాహ్మణమున పేర్కొన్నటుల మత్స్య, కూర్మ, వరాహాది భాగవతార్చమూర్తులు ఆలయముల ప్రతిష్ఠింపబడు ఆచారము క్రీస్తబ్దము నాల్గవ శతాబ్దినాటికే తెలంగాణమున ప్రస్థికి వచ్చిన దనుటకీ వరాహస్వామి ఆలయము దృష్టాంతరముగా నిల్చియున్నది.



(చిత్రము-1) గోవిందరావుపేట : భూవరాహ దేవాలయము క్రీస్తబ్దము (4-5వ శతాబ్ది)

సాతవాహన రాజులు ఆదినుంచి అనగా క్రీస్తుపూర్వము రెండవ శతాబ్దిని మొదలు ఈ ప్రాంతముల తమ ఆధీనములు నిడుకొనిరి. వీరు వృష్ణివీరుల పూజించిన నారాయణ భక్తులు. తరువాతి సాతవాహనుల ఇక్ష్వాకు ప్రభువుల కాలమునకు కోస్తా ఆంధ్రమున శ్రీ వైష్ణవము విస్తరింపబడినది.

మహారాష్ట్రములోని విదర్భప్రాంతమున రామ్‌టేక్, మధ్యప్రదేశములోని పరన్, ఉదయగిరి (గుహ) మున్నగుచోట్ల వరాహావతారమును విపులీకరించు పెద్ద శిల్పములున్నవి. ఇవన్నియు గుప్తరాజుల - విష్ణుకుండి - వాకాటక ప్రభువుల కాలమునాటివి. గోడలపై మలచిన శిల్పరూపమున వరాహస్వామి, పౌరాణిక గాథల మధ్యగా ఉదయగిరి గుహలలో కానవచ్చును. ఇటువంటి కోవకు చెందిన శిల్పములలో సముద్ర మథనము, విష్ణుమాయ ఘట్టములను అర్ధశిల్పమున చెక్కిరి. కాని గోవిందరావుపేట భూవరాహస్వామి మూలవిరాట్టుగా ప్రతిష్ఠింపబడిన అధిదేవత.



చిత్రము-2 గోవిందరావుపేట : నరసింహమూర్తి
క్రీస్తుశకము 4-5వ శతాబ్ది

నరసింహమూర్తి చిత్రము-2 :

ఈ ఆలయ ప్రాంగణమునకే చెందిన మరొక చక్కని నరసింహమూర్తి శిల్పము విలక్షణమైనది. నాభి క్రిందభాగము ముంజేతులు విరిగిపోయినను ఈ శిల్పము 15 సెం.మీ నిడివి, 11 సెం.మీ వెడల్పు 7½ సెం.మీ మందము గల్గిన దాచేపల్లి రాయి కృతము.

సింహముఖము, హ్రస్వదంష్ట్రములతోనున్న యీ నరసింహుడు, కంఠమాల, లలాటముపైని అష్టదళపద్మము, చక్కని వంకులజుట్టు పైన శిఖ (శిఖండినః) ఇక్ష్వాకుల కృతములైన బుద్ధమూర్తులలోవలె కానవచ్చుచున్నాడు. శిరాగ్రమునుండి కంఠము చుట్టుతూ హారముగా నీ శిరోజము తీరు చాల శోభనిచ్చుచున్నది. ఉదరబంధము, ముక్తాయజ్ఞోపవీతములు చక్కగా నున్నవి. ఈ స్వామిని ఉత్సవమూర్తిగనో లేక నిష్ఠదేవతగా కోష్ఠమునందునో ప్రతిష్ఠితము కాబోలు. యోగనరసింహకాదు. ఈ స్వామి కేవల నరసింహ స్వరూపముగా నెరుగవలయును.

పైన విశేషించిన మూర్తులేగాక కొన్ని ఫలకములు యిటీవల లభించిన ఈ చిన్న ఫలకములందు తక్కిన బ్రాహ్మణమత దేవతలతో బాటు నరసింహరూపమున విష్ణువును - చూపబడియుండుట గమనించ వలసియున్నది.

గుంటూరుజిల్లా, నరసరావుపేటలోని కునిదెన; నందిగామ తాలూకా ముక్త్యాల (కృష్ణాజిల్లా), కడపజిల్లా, సిద్ధవటము తాలూకా లోని పెద్దముడియము లందిట్టి ఫలకములు విరివిగా లభించినవి. ఇందున పద్మముపై త్రిముఖబ్రహ్మ, నందివాహనముపై లింగము, లేక శివపార్వతులు, పద్మముఖియైన లక్ష్మి, లేక పార్వతి, సింహవదనమున్న నరసింహ వరుసగా చూపబడెను. అనగా ఇవి త్రిదేవ ఫలకములు. క్రీస్తుశకము 4-5 వ శతాబ్దినాటివి.

కీసరగుట్ట (రంగారెడ్డి జిల్లా)[9], విష్ణుకుండినుల యిటుక దేవాలయ పునాదుల వాస్తుకర్మవిధానము తెలియచేయు అపూర్వ విశేషములు ఖనన పరిశోధనలందు వెలికివచ్చెను. ఒక దేవాలయ పునాదిని యెర్ర రాతిఫలకము లభించినది. ఈ ఫలకము 9సెం.మీ. గల్గిన చతురస్రాకారము గల్గియున్నది. (చిత్రము-3)


ఇందున ముఖ్యదేవతగా మధ్యన శక్తి సిరిదేవత 'మస్తకీ పద్మం' లేక పద్మముఖి. మోకాళ్ళపై కూర్చొన్నియున్నది. తెరుచుకొని కాళ్ళ నొకప్రక్కగాపెట్టి రెండుచేతుల చిత్రమైన భగవత్



చిత్రము-3 కీసరగుట్ట : శక్తిఫలకము (క్రీస్తుశకము 5వ శతాబ్ది)

సంకేతముల మోయుచున్నది. కీసరగుట్ట ఫలకమున అమ్మవారు గోచి పెట్టిన వస్త్రము పైకెత్తి కట్టుకొనియున్నది. ఈమె ఆదిశక్తి - మాతృదేవత. కుడిచేతిని లింగమును - వామహస్తమున సింహముఖమును యెత్తుకొనియుండుట విశేషము. లింగమును చూచున్నట్లుగా అంచున క్రిందుగా నంది - అదేవిధముగ సింహమును నమస్కరించు నరుడు- ఈ దేవతలను నరసింహ, శివమూర్తులుగా విదితము చేయుచున్నవి. మధ్యనున్న శ్రీశక్తి యిరువురికి కూడ సంబంధించినది. ఈమెయే భూదేవతగూడ.

ఇటువంటి త్రిదేవ ఫలకము, అదే కాలమునకు చెందినవి. కర్ణాటకములోని మజెటి[10] (బెల్గాము తాలూకా) యనుచోట లభించెను. చిత్రము-4



చిత్రము-4 **మజెటి : శక్తిఫలకము** (క్రీస్తబము 6వ శతాబ్ది)

ఇందున మధ్యనున్న పద్మముఖియైన శ్రీ వివస్త్రగానున్నది. మాతృదేవత; ఈ రూపమును లజ్జాగౌరిదేవతగా కొందరు గ్రహించిరి. కాని యిది సమంజసము కాదు. ఈ శక్తిస్వరూపుణి-శ్రీ మరియు శక్తి. పైన లింగమును-సింహమును యెత్తుకొనియున్నది. శివ-శక్తి-విష్ణు పూజ క్రీస్తబ్దమున 4-5 వ శతాబ్దిల తెలంగాణా — దానికి చేరువైన మధ్య కర్ణాటక ప్రాంతముల ప్రబలియుండెనని పైని లభ్యమైన ఫలకములు చూపుచున్నవి. ఇక యేలాల - గోవిందరావుపేట గ్రామముల లభించిన భూవరాహ విష్ణుదేవాలయము-నరసింహ శిల్పములు మిక్కిలి అరుదైన, ప్రాచీనమూర్తి సంపదగా నెరుగవలయును.

అధోజ్ఞాపికలు

1. ఏ. కె. నారాయణ, జర్నల్ అఫ్ ది న్యూమిస్మాటిక్ సొసైటీ అఫ్ ఇండియా, 36 (వారణాసి, 1974) పుటలు 190-191.
2. పురాతత్వ, సంపుటి 8 (న్యూఢిల్లీ, 1978) పుట. 178 లలితకళా, సంపుటి 14, పుటలు 47-49; యం. డి. ఖరే, లలితకళా సంపుటి 13-14 (న్యూఢిల్లీ, 1967-69) పుటలు. 21-27.
3. అబ్దుల్ వహీదఖాన్, అన్ యెర్లీ స్కల్ప్చర్ అఫ్ నరసింహ (హైదరాబాదు, 1964) పుటలు 1-5. మరియు ఖండవ్వాల్ లలితకళా, (ఢిల్లీ, 19. సంపుటి-21, పుట. 24)
4. అబ్దుల్ వహీద్ ఖాన్, యే మోనోగ్రాఫ్ అన్ యేలేశ్వరమ్ ఏక్సవేషన్స్, (హైదరాబాదు, 1963), పుటలు 14. ఛాయా చిత్రములు-27-28.
5. ఐ. కె. శర్మ, ది డెవలప్మెంట్ అఫ్ యెర్లీ శైవ ఆర్టు అండ్ ఆర్కిటెక్చరు, (న్యూఢిల్లీ, 1982), పుటలు 106-108, 114, 118, 143. ఛాయాచిత్రములు-68, 71-72 మరియు 84.
6. డైమన్షన్స్ ఇన్ ఇండియన్ ఆర్ట్, పూజా, (న్యూఢిల్లీ, 1986), పుటలు. 334 మరియు శ్రీనిధిః, (మద్రాసు, 1983) పుటలు-128, 130.
7. ఉదయం, ఏప్రిల్ 14, 1987 (హైదరాబాదు) చూడుడు. నాలుగోశతాబ్దినాటి విష్ణువిగ్రహాలు, పేజి-7.
8. కుసుమాంజలి, శ్రీ శివరామమూర్తి జ్ఞాపకార్థము వ్యాసావళి, (న్యూఢిల్లీ, 1987) పుటలు 217-223.
9. కుసుమాంజలి, పుటలు 236-237. ఛాయాచిత్రము - 10. చూడుడు నా వ్యాసము, భారతి, సంపుటి 62, నంబరు-5, (మే 1985), పుటలు 40-46.
10. మైఖెల్ మీస్టరు (సం), డిస్కోర్సెస్ అన్ శివ, (బొంబాయి, 1984), పుటలు 283-284, ఛాయాచిత్రము-24 .

కాలం దారుల్లో కదిలే నది

సాంధ్యశ్రీ

వెలిమంచు వసనాల చాటు మసకలలోన
తొలిపొద్దు అసదుగా తూలి అడుగేసింది
మంచు చినుకుల మినుకు తళుకులద్దే వేళ
నీటి తరగల కాంతి నెరిక తూలినయట్లు
తొలికాంతి మలయాడి తొడిమ సాగినపుంత
తెలివొంది పొందమ్మి తొగరుచల్లి నదంత
పారాణి చరణాలు నీరు కడగిన కరణి
తరగంచు విరివొంది పవడాలు గిరలాడ
పొద్దుసాగిన ముద్దులేయెండ చిరుకాక
హద్దుగాచిన మొక్క చివురుటాకులమీద
మంచుతడిపై వాలి మెరిసిపోయే వేళ
తెలుపు పసుపుల నేత చిక్కమల్లి నయట్లు
జాము గడిచిన పొద్దు జాజిపూవుల సౌరు
అరిటాకు కెరటాల సురటిపై వాలగా
అలలు విరిగినచోట పొడుపుకాంతులు ప్రచ్చి
క్రొమ్మించు ముత్యాలు కమ్ముకొన్నట్టుగా
పొద్దెక్కి తరణి తా పొగడపూవై పోవ
పాలుపొదవి కిరణాల పొన్నపూవుల చాయ
తరగంచు విరుపుల్ల తానమాడినచోట
గోరంట పూవులే గొడుగులెత్తినయట్లు
మంకెన్నపూచాయ మంపులోనా తరణి
నడిమింట నవ్వుతూ నిలచిచూచే వేళ
నీలంపుత నమంత నీటిచెంపలు తాక
సిగ్గు బంగరు తీవ రాగమొరసినయట్లు
సంజవేళకుముందు జాముపొద్దుల వేళ
మొగలిపూరేకుల మెత్తన్ని పూమెండ
ఆరవెట్టిన పసిడి కలనేత కోకలా
గాలితరగలి తాకు గమనాలుగా యట్లు
పడమటింటిని పడక తరణి కాల్వెట్టగా
కడపటీ కావిలో కళకుల్కు వేళలో
సంజె నారింజలో ముంజె మెత్తని సౌరు
క్రొంజివుకు గుత్తిపై పొదిగిజారినయట్లు
సంజె వాలినపొద్దు సగము చీకటివేళ
పిట్టలన్నీ గూడు తిరిగి చేరేవేళ
చుక్కలొక్క టొక్కలై తొంగిజూచేవేళ
నల్లతాచుల గుంపు నాట్యమాడిన యట్లు
జీబుకొను చీకట్లు గుబురులై కమ్ముకొన
జుట్టు విరగబోసుకొని పొలచింది చిట్టడవి
సుడి తిరుగుజాడ మేకను పట్టనీవేళ
సడితోనే తన ఉనికి చాటిచెప్పినయట్లు
వెన్నెలామాసంపు నెడద వెన్నెల జల్లు
చదలచుక్కల కొసను చేరళించిన వేళ
పొదలు తొడిగిన పూలు కదురు చుట్టైపోవ
వెండిదారపు నూలురాటు మొడికిన యట్లు
కాలంపు దారుల్ల
కదిలింది ఎదనది.....

సాహిత్యం - విమర్శ :

ఇటీవలి ఉద్యమాలు - ధోరణులు

శ్రీ వడలి మందేశ్వరరావు

ప్రాక్-పశ్చిమ దేశాలలో కావ్యానికీ, కవితకూ సంబంధించిన అవగాహనలో పొంతన ఉన్నంతవరకూ, మౌలికంగా దృక్పథాలలో కూడా సామ్యం ఉండాలి; వానికొక సౌమనస్యం సాధించడం సాధ్యమవాలి. భారతీయ ఆలంకారికులు కావ్యానందం సహృదయ నిష్ఠమంటారు; కవిత్వస్థితిని అనుభవించడం కాదు కవి కర్మ, దానిని ఇతరులలో అంకురింపచేయడమే అతని పని అంటాడు పాల్ వాలరీ.[1] కవి జీవితానికీ, అతడు ప్రకటించిన ఆశయాలకూ, అతని కావ్యంతో ముడివెట్టడం, చారిత్రక దృక్పథంతో కావ్యం విలువను అంచనా వేయడం, సాహిత్య అనుశీలనలోని అవగుణాలుగా పేర్కొన్నారు, ఇటీవలి సాహిత్య విమర్శకులు కొందరు.[2] మన ఆలంకారికులను ఈ ఆక్షేపణలు బాధించవు. కావ్య పరమార్థం ఆనందమా ? ఉపదేశమా ? అన్న అనుమానానికి, నిర్ద్వంద్వంగా కావ్యప్రయోజనం ఆనందమేనని మన ఆలంకారికులు తీర్మానించారు. కావ్యప్రయోజనమైన ఆనందాన్ని అనుసరించి కావ్యస్వరూపాన్ని, తత్త్వాన్ని నిరూపించచూపడం మరొక 'అఫెక్టివ్ ఫాలసీ'కి కారణం కావచ్చు.[3] అందుకే కావ్యాన్ని నిర్వచించేటప్పుడు శబ్దార్థోభయమైనది కావ్యమవుతుంది కాని, ఆనందాన్ని పంచేది కావ్యం అనలేదు. ఈ సందర్భంలోనే ధ్వని ప్రస్థానం ప్రాముఖ్యంలోకి వచ్చింది; శబ్దవృత్తుల చర్చ జరిగింది. అలంకార, రీతి, వక్రోక్తి ప్రస్థానాలన్నీ కావ్యరచనా సంవిధానం ప్రధానమని పరోక్షంగా నిరూపించాయి. ఇటీవలి అభినవ విమర్శకుల, ఆకృతి వాదుల[4] విమర్శనా ధోరణులలో మౌలికంగా ఇట్టి దృక్పథమే కనబడుతుంది.

కాల్పనికోద్యమం :

చారిత్రక కారణాలవల్ల పాశ్చాత్య సాహిత్యోద్యమాల, విమర్శనా ధోరణుల, ప్రభావం భారతీయ భాషలన్నిటా కనబడుతుంది.[5] తెలుగులో క్రితం శతాబ్దాంతానికి పుంజుకున్న పునరుజ్జీవనం[6] తర్వాత ఈ శతాబ్దంలోని మొదటి మూడు దశాబ్దాలలో కాల్పనికోద్యమం పెద్ద వెల్లువగా వచ్చింది. దీనికి చారిత్రకమైన కారణాలు లేకపోలేదు. పాశ్చాత్యులలో "బ్వాలో"లను పోలిన అప్పకవులు కావ్యనిర్మాతలను శాసించడం, అట్టివారందచేసిన సూత్రాల నాధారంగా చేసికొని, కావ్యాలను లఘుపరిశ్రమగా అల్లడం, క్రితం శతాబ్దంలోనే కొందరికి మనస్తాపాన్నీ, మరికొందరికి కంటగింపునూ కల్గించి ఉండాలి. ఈ శతాబ్దారంభంలో వర్ణనాత్మకంగా ఉండవలసిన వ్యాకరణానికి శాసించే హక్కు లేదని, గిడుగు రామమూర్తి వ్యవహారిక భాషను ప్రజాపరం చేసాడు. గ్రాంథికభాషనుండి విడివడ్డ వాడుకభాష ప్రజలభాష అయినట్టుగానే, సంప్రదాయ గణబద్ధ ఛందస్సునుండి విడివడితే, మాత్రాబద్ధ ఛందస్సు కూడా ప్రజానీకానికి సన్నిహితమవుతుందని గురజాడ గ్రహించాడు.[7] పాలకుల, జమీందార్ల ఆటకు హంగుగా వాడడాన్ని కవులు ఏవగించుకొన్నారు. ఎవ్వరినో మెప్పించాలన్న కండూతినుంచి కవిత్వాన్ని రక్షించాలనుకున్నా రానాటి అభినవకవులు.[8] రాయప్రోలు అమలిన శృంగారం తమకు ఆరాధ్యమైనదన్నాడు. తన దేశాన్ని, తన భాషను, తన మనుష్యులను, తన ప్రేయసిని, తన తనాన్ని కవి ఎక్కువగా ప్రేమించనారంభించాడు. వెనుకటి కవులు సంప్రదాయాన్ని పరిరక్షించే పండితులు. సంస్కారులు కోసం రచనలు చేయగా, భావకవులకు తమ ఆంతరంగిక మనస్థితే కవితా వస్తువయింది. కాని వారి మనస్థితి అన్నివేళలా ఆరోగ్యకరమైనట్టుగా, దృఢంగా, ఆశాజనకంగా కనబడకపోగా, చిక్కినట్టుగా, నాజూకుగా స్మృతులను నెమరువేసుకొన్నట్లుగా కనబడేది. యోగం ఇచ్చే తృప్తి కన్న, దీర్ఘమైన వియోగంవల్ల అలలు, అలలుగా పొంగివచ్చే భావోద్వేగం, దాని ననుసరించి మగతను పోలిన మానసిక జడస్థితీ, భావ కవిత కాకరమయాయి. సమాజావరణం నుండి వెలివేయబడ్డట్టుగా భావించుకుంటూ, ఈ కవులు స్వగతాన్ని ఆదరించి, సామాజిక బాధ్యతలను విస్మరించి, పలాయనవాదు లవుతున్నారన్న అపవాదుకు లోనయారు.

గణించి చూచుకుంటే భావకవిత్వం సాధించిన ప్రయోజనం అల్పమైనదేమీ కాదు. ఇన్నాళ్ల తర్వాత కవిత్వం స్వచ్ఛంగా, నిసర్గంగా కనబడింది. ప్రబంధ మరుభూముల్లో బొత్తిగా మృగతృష్ణలా కాకపోయినా, అక్కడక్కడ తారసపడే పచ్చ పట్టులా దర్శనమిచ్చేది కవిత్వం. కాని కృష్ణశాస్త్రిగారివంటి భావకవుల రచనలు కవితోద్యాన ఖండికలయాయి. పాటకు కావ్యత్వసిద్ధి కలిగింది. కవికి ప్రకృతి

ప్రేరణ అయింది. వ్యుత్పత్తిని గద్దెమీదనుంచి దింపగా, తత్స్థానం ప్రతిభకు లభించింది. నిఘంటువుల, వ్యాకరణాల సాయంతో కావ్యాలను సమీపించే పద్ధతి మరుగునపడి, సాహిత్యానుశీలనకు భావుకత ప్రాముఖ్యం గుర్తింపబడింది.

వెనుదిరిగి చూచుకుంటే, ఈ నూతన కవితోద్యమానికీ, ఇంగ్లాండులో 19వ శతాబ్దారంభంలో వచ్చిన రొమాంటిక్ కవితోద్యమానికీ సామ్యమేకాక, దీనిపై దాని ప్రభావం కూడా కనబడుతుంది. అక్కడా రొమాంటిక్ కవితోద్యమం నియోక్లాసికల్ కవితకు తిరుగుబాటుగా వచ్చింది. అనుకరణకు వారూ నిరసించారు. క్రొత్త కవితారూపాలను, ఛందస్సులను, లయలను వారు కవిత్వంలోకి ప్రవేశపెట్టారు. సామాన్య మానవుని వేదనలూ, ఆవేదనలూ, వాని భాషా, వారి నాకర్షించాయి. వెనుకటి కవులు లోకాన్ని అనుకరించగా, వీరిది అంతర్దృష్టి, తమ దర్శనానికి, భావోద్వేగానికి ఆవేశపూరితంగా, అప్రయత్నపూర్వకంగా కవిత్వాన్ని కల్గించడం వీరి ధ్యేయం.

ప్రతీక కవితోద్యమం :

రొమాంటిసిజమ్ తర్వాత ఫ్రాన్సులో పొడసూపి, సుమారు నూరేండ్ల వరకూ ఇతర సాహిత్యాలమీద ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రభావాన్ని చూపిన ఉద్యమం ప్రతీకవాదం (సింబాలిజం) సాహిత్యంలో ప్రతీకలను వాడడం సరికొత్త సంప్రదాయం కాదు. షెల్లీ, బ్లేక్ కవితల్లో ప్రతీకలు కనబడుతూనే ఉంటాయి. ప్రతీ శబ్దమూ ఒక భావానికో, వస్తువుకో ప్రతీకే. దీనినే కాస్త విస్తరించి చూచుకుంటే, ఒక శబ్దంకాని, శబ్ద సముదాయం కాని, ఏదో ఒక రూఢ్యర్థాన్ని బోధిస్తూ, మరో అర్థాన్ని ధ్వనింపచేస్తే, అది ప్రతీక అవుతుంది. చరాచర వస్తు సముదాయం, ప్రకృతిలో కానవచ్చే మార్పులు, సమస్త ప్రాణులు, ఏదో ఒక ఊహకో, సమాజంలో నెలకొని ఉన్న సంప్రదాయానికో, సన్నిహితమైన సంబంధాన్ని కల్గి ఉండి, ప్రతీకలుగా ఏర్పడుతాయి. వెలుతురు-చీకటి[10], వసంతం-హేమంతం, ఎరుపూ-నలుపూ వంటి రంగులు, పద్మాలవంటి పుష్పాలు-సామాన్య ప్రతీకలు. అవిగాక కవి స్వంత ప్రతీకలను కూర్చుకో వచ్చును. ప్రతీక రూపకం కాదు. రూపకం - ఉపమ సంకుచిత పరిధిలో ఒకానొక భావస్ఫుటీకరణకు తోడ్పడగా, ప్రతీక కావ్యాన్నంతకీ వివక్షితార్థాన్ని చేకూరుస్తుంది. అందుచేతనే ఒక్కొక్కప్పుడు కావ్యాంతానే ప్రతీక చదువరికి అర్థవంతంగా భాసిస్తుంది. ఉదాహరణకు కృష్ణశాస్త్రిగారి "నా విరులతోట పెంచికొన్నాడ నొక్క/పవడపు గులాబిమొక్క" పద్యంలో గులాబి కేవలం గులాబి కాదు. పద్యంలో గులాబి కేవలం దేనితోనూ ఉపమింపబడలేదు. ఆ గులాబి గులాబి కాదు, అందులోని క్రూరార్క కిరణం కేవలం సూర్యకిరణం కాదు. ఖండిక అంతా చదివేసరికి కవి లక్షించిన విషాదకథ రూఢమవుతుంది. ఫ్రెంచి కవి రింబో వ్రాసిన 'మత్తనౌక' కావ్యము ప్రతీకాత్మకంగా ఉండి, కవి జీవితాన్ని ధ్వనిస్తుంది."

ప్రతీక కవితోద్యమం ఫ్రాన్సులో పొడసూపింది. దీనికి ఆద్యుడు బోదలేర్[12]. తర్వాత రింబో, వెర్లేన్, మలార్మే, వాలరీ దీనిని పోషించారు.[13] ఈ ఉద్యమం రొమాంటిసిజమ్ నుంచి పుట్టినట్టు కనబడినా, దీని ఆవేశమే వేరు, ఆశయమే వేరు. రొమాంటిక్ ఉద్యమానికి కొన్ని రాజకీయ కారణాలున్నాయి, సమానత్వాది ఆశయాలతో ఆవిర్భవించింది.[14] సింబాలిజమ్ ప్రధానంగా సాహిత్యోద్యమంలా కనబడుతుంది. ఫ్రెంచి సింబాలిస్టు కవులలో కావ్యఆకృతికి రచనా సంవిధానానికి ప్రగాఢమైన బంధం ఏర్పడింది. మలార్మ వాక్య నిర్మాణమై ఖరి విడ్డూరంగా ఉన్నా, నీరంధ్రంగా ఉంటూ, వాక్యం వికేంద్రీకరింపబడి, పరిష్కరణకు గహనంగా ఉంటుంది. హఠాత్తుగా ఎక్కడనుంచో నామవాచకాలు మిన్ను తెగిపడ్డట్టుగా, దడదడ రాలుతాయి - అంటాడొక విమర్శకుడు.[15] అంటే సింబాలిస్టు కవి వస్తువుతో పాటు విలక్షణమైన కవితా సామగ్రిని, సంవిధాన శిల్పాన్ని సాధించుకోవాలన్నమాట. పైన చెప్పినది ఫ్రెంచి కవుల మాట కాగా, డబ్ల్యూ. బి. ఏట్సు కూడా సింబాలిస్టు కవులు విలక్షణమైన శైలిని అలవరచుకోవాలంటాడు. దూకుడుగా పరుగెత్తేవిగాక, సంకోచిస్తూ, ఆలోచనాత్మకమై, జీవలక్షణాన్ని పొందిగించుకుంటూ, కురువాన బోసిన భావనాశక్తి నిముడ్చుకున్న లయలను అన్వేషించాలి సింబాలిస్టు కవి. ఎడ నెడ దోషమ్ములుండుగాక, అర్థమ్ముగాకపోవుగాక, అది ఖండిక అయినా, మహాకావ్యమయినా, దానిలో నిండుతనం ఉండాలి; విశ్లేషణ కతీతమైన అర్థాలను కల్గిఉండాలంటాడు ఏట్సు.[16]

వస్తువుకు సంవిధానానికి ఇంత సన్నిహితమైన సంబంధాన్ని పునస్సృష్టి చేసుకోగలిగి ఉంటే, మనకూ ఒక సింబాలిస్టు ఉద్యమం వచ్చిఉండేది. అలా జరగలేదు కనుకనే మన సాహిత్యంలో శ్రీ గుంటూరు శేషేంద్రశర్మ వంటి రచనల్లో ప్రతీకలు కనబడినా, అది ఒక ఉద్యమంగా రాలేదు.[17]

ఇమేజిజమ్ :

సింబాలిజమ్ తర్వాత ఇంగ్లాండులో మూడు దశలలో రూపొందిన సాహిత్యోద్యమం ఇమేజిజమ్.[18] ఇమేజిస్టు సిద్ధాంతానికి పునాది వేసినవాడు టి. ఇ. హ్యూమ్ కాగా, దాన్ని పోషించి, సాహిత్యంలో దానికొక ప్రాపకాన్ని సాధించిపెట్టినవాడు ఎజ్రాపౌండ్; తర్వాత దీనిని అమెరికాలోకి గొనిపోయిన ఆమె ఆమీలవెల్. ఇమేజిజమన్నది రొమాంటిసిజమును తీవ్రంగా ప్రతిఘటించే సాహిత్యోద్యమం. మానవుడు వస్తుతః మేరుపంత ఎత్తు పెరుగ నవకాశమున్నదని

రొమాంటిసిస్టు విశ్వసిస్తాడు; క్లాసిసిస్టు మానవుని శక్తి సామర్థ్యాలు పరిమితములని భావిస్తాడు.[19] అంచేత రొమాంటిసిస్టు ఎప్పుడూ అనంతాన్ని గురించి, బ్రహ్మపదార్థాన్ని గురించి, కలలు గంటూ, తాననుకున్న ఎత్తుకు ఎగరలేకపోయినందుకు ఖిన్నుడై, దీనుడై, రోదిస్తాడు. క్లాసిసిస్టు తన పరిమితులను తాను గ్రహించి, క్రమ శిక్షణతో, గుండె నిబ్బరంతో, భూమి మీదనే నిలబడి సాధించగల్గిన దంతా సాధిస్తాడు. ఇమేజిస్టులను ఒకరు 'క్లాసికల్ మోడర్నిస్టు' అన్నారు. వీళ్ళు తమ పరిమితులను తాము తెలిసికొని, గాలిలోకి ఎగిరిపోవాలనుకోరు. కుయ్యో మని రోదన ధ్వని ఉంటేనేకాని, కవిత్వం కాదనుకోవడం పొరపాటంటారు వీళ్లు.[20] కవిత్వం మంచులో కాని. కన్నీళ్ళలో కాని తడవనక్కరలేదు; పొడిగా, పటిష్ఠంగా ఉండా లంటారు. అనంతకాలం కోసం తానేదో వ్రాస్తున్నానని వెనుకటి కవి ప్రసిద్ధమైన, ఉదాత్తమైన వస్తువును స్వీకరించాలని తహతహ పడే వాడు. ఈ ఆధునిక క్లాసిసిస్టుల సిద్ధాంతాన్ననుసరించి ఏదీ శాశ్వత మైనది కాదు; సాపేక్షమైన స్థితే వాస్తవమైనదని, మహాకావ్య సృష్టి కంటె, సాధారణ వస్తువును స్వీకరించి, మంచి 'ఇమేజి' ఉన్న నాల్గు పంక్తులు వ్రాసినా చాలునన్నారు. ఈ ప్రతిబింబాన్ని నిర్వచిస్తూ ఎజ్రాపౌండు, క్షణకాలంలో మేధోద్వేగాల సంశ్లిష్టతను వ్యక్తీక రించేది ప్రతిబింబం అన్నాడు.[21] ఉద్రేకాలను విచ్చలవిడిగా, సుదీర్ఘంగా ఛందోబద్ధం చేయడానికి అలవాటు పడ్డారు వెనుకటి కవులు. ఆ స్థితి మారాలంటాడు పౌండు. దానికోస మీతడు త్రిసూత్ర ప్రణాళిక నేర్పరచాడు: వస్తువు ఆత్మాశ్రయమైనా, వస్తుగతమైనా, దానిని సూటిగా ప్రదర్శించాలి; వస్తు ప్రదర్శనకు అనర్థక పదాలను పరిహరించి, పొదుపుగా శబ్దాలను వాడాలి; లయను సాధించడానికి శ్రావ్య శబ్ద సముదాయముల శ్రేణిని నిర్ణయించుకోవాలి.[22] ఇలా రచన కురచగా ఉండడం జపాను హుక్కుని జ్ఞప్తికి తెస్తుంది.[23]

ఇమేజిస్టు మతం అంతా ఈ విధంగా చూచుకొంటే పటిష్ఠతను ఆధారంగా చేసుకొని ఉంటుంది. తత్ఫలితంగా ఈ కవులు రాళ్ళు, రప్పలకు స్పందించినట్లు సున్నితమైన రాగాలకు, లలిత లలితమైన రంగులకు, అత్తరువులకు స్పందించరు. వారి భాష కూడా వాడుక భాషలోని మోటుదనాన్ని ప్రతిబింబించడానికి సంకోచించదు. శాస్త్రజ్ఞు నిలా విషయాన్ని నిర్మమతతో పరిశీలిస్తారు కాని నీష్కకారిపోరు. వస్తువుకోసం చెత్తకుండీని సమీపించడానికి సందేహించరు.[24] వారి లయల్లో స్విన్‌బర్న్ శ్రావ్యత కాదు ప్రధానమైనది; కావ్యవస్తువులాగే మొరటుగా ఉన్నా అభ్యంతరం లేదు. అందుకే వచనగీతం వీరిని ఆకర్షించింది.

ఈ ఉద్యమ ప్రభావం ఆధునిక కవులందరిమీదా అంతో ఇంతో పడింది. స్టీఫెన్ స్పెండర్ అందుకే ఈ ఉద్యమాన్ని ఆధునికాంగ్ల కవితను వింగడించగా గోచరించే మౌలికాంశ అన్నాడు. ఇది కవితను శిల్పంగా మలచింది; ప్రయోగశీలాన్ని పెంపొందించింది; పద్యం వచనానికి మరీ దూరమై వెనుకబడిపోతే, గిడసబారి నేటి "సామాజికపు-సెన్సిబిలిటీ"కి దూరమై, అప్రస్తుతమైపోతుందని హెచ్చరించింది.[25]

అయినా ఇంత పొట్టిగా, గట్టిగా, పెళుసుగా కవిత్వపు గుళిక లెన్నని ఆవిర్భవించగలవ్? అంచేత పట్టుమని పదేళ్లు కూడా మీర కుండా ఉద్యమకారుల్లో అభిప్రాయభేదాలు వచ్చి 1917 నాటికి ఈ ఉద్యమం స్తబ్దమైపోయింది. కాని ఈ ఉద్యమంవల్ల కల్గిన సంస్కారం మాత్రం నేటివరకు కవులలో మిగిలిపోయింది, ఈలోగా బయలుదేరిన మరో ఉద్యమం డాడాయిజం.

డాడాయిజం :

డాడా ఎప్పుడు పుట్టింది?[26] డాడా అంటే అర్థం ఏమిటి? డాడా ఆశయాలేమిటి?[27] అన్న ప్రశ్నలు అర్థం లేనివంటారు డాడాలు. డాడాను నమ్మవద్దు, వాస్తవమైన డాడాలందరూ డాడాకు వ్యతిరేకులంటాడు ట్రిస్టన్ జారా[28].

కళా ప్రపంచంలో విప్లవాలు రేగే కాలంలో పుట్టి, తొలి ప్రపంచ యుద్ధపు రోజులనాటికి మైనారిటీ తీరి, కళకు వ్యతిరేకులమని అనిపించుకోవడానికి జంకని కళాకారులు డాడాలు. బూజుపట్టిన నమ్మకాలతోనూ, విలువలతోనూ, బ్రతుకుతూన్న బూర్జువా వర్గాన్ని హడలకొట్టడం, వాళ్ళకు వెర్రులెత్తించడం వీళ్ళ ధ్యేయం. కళలో అభిరుచి, ఆకృతి అంటే వీళ్ళకు అసహ్యం. పల్వురొక్కసారే పద్యా లను చదివితే లొడలొడ శబ్దంకన్న ఏమీ వినపడకపోయినా, అట్టి యోగపద్యపు పద్యమే వాంఛనీయమంటారు. జీవితంలో విభిన్నమైన సంఘటనలు ఏకకాలికంగా జరుగుతున్నాయన్న భ్రాంతిని ఇట్టి యోగ పద్యపు అశుపద్య పతనం ధృవపరుస్తుందని వీళ్ళ అభిప్రాయం. ఒకానొక సభలో 'జారా' వార్తాపత్రిక చదువుతుండగా, పాల్ ఎల్వార్డ్[29] ఆతని మిత్రుడొకడూ చేతనైనంత గట్టిగా గంటలు మ్రోగిస్తూ, చదువు తున్నది వినబడనీయకుండా చేస్తూంటే – అదేమిటంటే – డామిట్. ఇదంతా డాడా ఈస్థటిక్స్ అంటారు. ఇది మానవుని ప్రాముఖ్యాన్ని పునరుద్ధించడమన్నారు. జారా అనేది: ఈ జనం దృష్టి అంతా తన వైపు, తన మోము కదలికలవైపు మళ్ళాలి కాని, తాను చెప్పేది ఏమయితేనేమి? అని.

అంటే మానవుని కళా, సామాజిక నైతిక విలువలన్నింటినీ అస్తవ్యస్తం చేసి, ధ్వంసం చేయడమే డాడా పని అన్నమాట. కాని సానుభూతితో చూస్తే డాడా కళాకారుని స్వాతంత్ర్యాన్ని, వ్యక్తిత్వాన్ని, మౌలిక దృక్పథాన్ని, (ఒరిజినాలిటీ)ని గౌరవించినట్లు కన బడుతుంది. ఫ్యూచరిస్టులలాగే వీళ్ళకూ వెనుకటి కళనూ, విలువల్నీ

నాశనం చేయడమే ధ్యేయమయినా, వీళ్ళ అరాచకంలో కూడా కొంత ప్రగతి దృక్పథం కనబడుతుంది.[30] ఫ్యూచరిస్టులకు వేగమూ, మానవుని మనుగడకు ప్రమాదంగా తయారయిన యుద్ధ పరికరాలూ ఆవేశ ప్రేరకాలు డాడా యుద్ధానికి వ్యతిరేకి; డాడాలకు యంత్రాల మోజు తక్కువ, ఫ్యూచరిస్టులా అవకాశము స్తేచాలు, డాడా యుద్ధంలోకి దూకాలనుకోడు. ఫ్యూచరిస్టు తన దేశంలోనే కూరుకొనిపోతాడు, డాడాయిస్టు అంతర్జాతీయ వాది. డాడా ఒక మంచిపని చేసింది; కళకు ఆధారంగా ఉన్న మౌలికమైన సిద్ధాంతాలనే ప్రశ్నిస్తూ, వాట్ల నియంతృత్వాన్ని ధిక్కరిస్తూ, ఆలంకారిక సిద్ధాంతాలను, సిద్ధాంతులను కుళ్లు కాలువల్లోకి ఈడ్చివేసింది.

ఇట్టి విధ్వంసన కార్యక్రమంతోనే హీనమైపోయి, నిర్వచనానికి లొంగని ఈ వికట ఉద్యమం - డాడాయిజం - 1922కల్లా ప్రారంభించిన ఆరేండ్లలోనే వాడిపోయింది. అంతకన్న బలమైన మరో ఉద్యమం బయలుదేరింది. అది సర్రియాలిజం.

అధివాస్తవికత :

డాడా వామకర్ణంనుంచి సర్రియాలిజం స్రోతస్సు రివ్వున వెలువడిందని కొందరి అభిప్రాయం. ఆంద్రె బ్రిటన్, ఎల్వార్, అరగన్ అధివాస్తవికోద్యమానికి నాయకులు. అంతకుముందు వీరందరూ డాడాలు. అయినా డాడాకు, అధివాస్తవికతకు పోలిక లేదు. అధివాస్తవికులలో ప్రధానంగా మూడు లక్షణాలు కనబడతాయి. (1) వీరు సింబాలిస్టుల వారసులు కాకపోయినా, ఆ కుదురుకు చెందినవాళ్లు. (2) అప్పుడే వెలువడిన ఫ్రాయిడ్ సిద్ధాంతాల కనుగుణంగా అజ్ఞాత మనస్సుకు స్వాతంత్ర్యాన్ని ప్రకటించి, యధేచ్ఛ రచనలను చేయడం (ఆటోమేటిక్ రైటింగ్), స్వప్నాలలోని సంఘటనలను, పూనకం (ట్రాన్స్) వంటి మనస్థితిలోని అవ్యక్త ప్రేలాపనను వ్రాతమూలకం చేయడం, మానవ జీవితంలో లైంగిక ప్రవృత్తి ప్రాముఖ్యాన్ని గుర్తించడం, వీరి ప్రత్యేకత. (3) గత తార్కిక భౌతిక సిద్ధాంతాన్ని ఆమోదించి ఫ్రెంచి కమ్యూనిస్టు పార్టీకి బాసటగా నిలవడం మరొక లక్ష్యం.[31]

చిత్రమేమంటే సింబాలిస్టులు రొమాంటిసిస్టుల కోవకు చెందిన వారు. వారిలాగే అధివాస్తవికులకు భావనాశక్తి ప్రధానమైనది. భాషను పునరుద్ధరించి, అజ్ఞాత మనస్సు శక్తులను శోధిస్తే, జీవితంలోని వైరుధ్యాలకు సమన్వయం కనబడవచ్చునని అధివాస్తవికుల నమ్మకం. మేధకు లొంగని లోచూపు భావనాశక్తికి ఉంటుంది. అయినా రొమాంటిసిస్టులకు, అధివాస్తవికులకు, ఒక ప్రధానమైన తేడా ఉంది. రొమాంటిసిస్టుల భావనాశక్తి సత్యం, శివం, సుందరం, అన్న వాని ద్వారాలను తెరుస్తుందనుకోగా, అటువంటి భావాలనుంచే మానవాళిని రక్షించడానికి భావనాశక్తి ఉపయోగపడుతుందని అధివాస్తవికులనుకుంటారు. రొమాంటిసిస్టు కావ్యానికి ఆకృతి(ఫారమ్) ప్రధానం. అధివాస్తవికతకు ఆకృతితో సంబంధంలేని మానసిక స్థితి ముఖ్యం.[32] రొమాంటిసిస్టులకు ప్రకృతి అతీంద్రియానుభూతులను కలిగిస్తే, అధివాస్తవికులకు అజ్ఞాత మనస్సే దీనికి మంచి సాధనంలా కనబడేది.

అధివాస్తవిక కవిత, కళ అర్థం కావన్న భావానికి[33] కారణం అధివాస్తవికతలో పైన పేర్కొన్న రెండో లక్షణం. అధివాస్తవికత సంప్రదాయ సాహిత్యాన్ని అసహ్యించుకొనేది. ప్రత్యేకమైన కవితా శిల్పాన్ని ప్రవేశపెట్టాలనే కోర్కె అధివాస్తవికులలో కనబడదు. అజ్ఞాత మనస్సు కవాటాలను తెరుస్తూ, జీవుడి (స్పిరిట్) ని బంధ విముక్తుణ్ణి చేయడమే వీళ్ళ లక్ష్యం. బూర్జువా సాహిత్యమంతా కవి సమయాలతో, సంప్రదాయాలతో, మేధతో పంకిలమైపోయింది. అంచేత వాళ్ళ శబ్దచిత్రాలు, చమత్కారాలు, వీరికి పనికిరాలేదు. తొలి రోజుల్లో స్వచ్ఛంద రచనల్లో మేధ ప్రమేయం అస్సలు పనికిరాదన్నారు. ఫ్రాయిడ్ సిద్ధాంతాలననుసరించి స్వప్నాలను యధాతథంగా వ్రాతమూలకం చేయాలనుకున్నారు. కాని క్రమంగా ఇది ఆదర్శంగానే ఉండిపోయింది కాని, సాధ్యంకాదని తేలిపోయింది. పై రచనల్లో ఎక్కడో అక్కడ మానవుని మేధ, తర్కం చోటు చేసుకుంటూనే ఉంటుంది; ఆకృతినిస్తూనే ఉంటుంది.[34] ఈ లోపాన్ని సవరించడానికే అన్నట్టు, తర్కవిరోధంగా ఉంటూ, జోస్యానికి అవకాశం లేని హఠాత్సంఘటన (ఛాన్స్) కు స్థానం ఇచ్చారు. పత్రికల్లోని శీర్షికలను కూర్చి పేర్చడం, చేతికి అందిన రకరకాల ఫోటోలను, బొమ్మలను చేర్చడం, కొన్ని భాషాసంబంధమైన ఆటలు[35] ఈ వర్గంలోకి వస్తాయి.

ఫ్రాయిడ్ ప్రతిపాదించిన లిబిడో ప్రాధాన్యాన్ని అధివాస్తవికులు అంగీకరించి, వలపుకు వాళ్ళ రచనల్లో పెద్ద పీటను వేసారు. స్త్రీ పురుష సంబంధంలోనే ఈ మానవ నిర్మితమైన సంప్రదాయాలూ, తర్కాలూ, అన్నీ క్షణకాలం పటాపంచ లయిపోతాయని విశ్వసించారు. ఇది అందరికీ అందుబాటులో ఉండే అనుభూతి; సుఖానుభూతికి పిరాకాష్ఠ. ఒక 'అహా'న్ని వేరొక దానితో సంయోగపరచే అసాధ్యమైన యోగాన్ని సాధ్యమొనరిస్తుందని అధివాస్తవికులు దీనినెంతగానో ఆదరిస్తారు.[36]

అయితే ఫ్రాయిడ్ సైకో అనాలిసిస్ మానసిక అనారోగ్యాన్ని చక్కదిద్ది, మానవుణ్ణి సామాజిక ప్రయోజనానికి అనుకూలమైన వ్యక్తిగా దిద్దితీర్చాలని అనకోగా, అధివాస్తవికుడు మానసిక చాంచల్యాన్నే ఆరోగ్యస్థితిగా భావించి, అదే మానవునకు దర్శనాన్ని కల్గించేదనీ, వైరుధ్యాలను సమయింపచేసేదనీ భావిస్తాడు.

3

ఇక అధివాస్తవికులకూ కమ్యూనిస్టులకూ ఉండే పొత్తుకూడా ఎంతోకాలం సాగలేదు.'వాట్ ఈజ్ సర్ రియాలిజమ్'? అన్న రచనలో ఆంద్రె బ్రిటన్: "మానవుని మానసికమైన స్వాతంత్ర్య సముపార్జన అధివాస్తవికత యొక్క ప్రధాన లక్ష్యం. దీనికి తొలి సోపానం మానవుడు బంధాలనుండి విముక్తిని పొందడం అంటే శ్రామిక వర్గపు విప్లవం ద్వారా మానవుని విముక్తిని సాధించాలి,"[37] అని అంటాడు. మానసికమైన స్వాతంత్ర్యానికి సామాజిక, రాజకీయ విప్లవం నాంది కావాలన్నమాట. ఇట్టి భావాలతో అధివాస్తవికులు కమ్యూనిస్టులతో చేతులు కలిపారు. కాని రాజకీయవాదులది కార్య క్షేత్రం; అధివాస్తవికుల స్వాప్నిక జగత్తు వాళ్ళకు అక్కరకుమాలిన దైంది. అధివాస్తవికులు సామ్యవాదుల 'ఆత్మ'ను కాపాడుతున్నామన్న భ్రాంతిలోపడి, రాజకీయ కార్యక్షేత్రంలో సుశిక్షితులైన కార్యకర్తలతో పని చేయవలసి ఉంటుందని తెలుసుకోగానే, విభ్రాంతికి లోనయారు. భావనా పథంలో ప్రయోగాలుసల్పే అధివాస్తవికులకు ఈ వాస్తవ జగత్తు వ్యర్థమనిపించింది. 1935 నాటికి అధివాస్తవికులు కమ్యూనిస్టులతో తెగత్రెంపులు చేసుకున్నారు [38]

రొమాంటిసిస్టులకు, ఫ్రాయిడ్ సిద్ధాంతాలకు,కమ్యూనిజానికి–అధివాస్తవికులకు పొంతన కుదరకపోయినా, వీరికి కొన్ని నైతిక, రాజకీయ, సిద్ధాంతాలు లేకపోలేదు. వీళ్ళ నీతిలో హిపోక్రసీకి స్థానం లేదు; సమాజంలో గతానుగతికంగా వచ్చే ఆచార ముద్రకాదు స్పందనకు కావలసింది, యదార్థమైన మానవతా స్పందన కావాలంటారు. రాజకీయంగా వీరు సామ్రాజ్యవాద తత్వాన్ని నిరసించారు. శాస్త్రానికి, సాంకేతిక విజ్ఞానానికి తన భవితవ్యాన్ని తాకట్టుపెడుతూ, రోజు రోజుకూ మనిషి మరీ ప్రాపంచిక లోభాలకు బానిస అయిపోతూన్నప్పుడు, అధివాస్తవికుల మానవతా నిబద్ధత (కమిట్ మెంట్) ఎంతోమందిని ఆకర్షించింది....అధివాస్తవికత కొక గమ్యం ఉంది, ఒక ఆలోచనాధార ఉంది.... కళ అంటే విస్పష్టమైన అభిప్రాయాలున్నాయి. మానవ చేతన విముక్తి పొందితే సమస్యలన్నీ తీరిపోతాయని వీరు విశ్వసించారు; కేవలం తర్కబద్ధమైన జ్ఞానంకన్న ఇంద్రియ జన్యమైన జ్ఞానం ఉత్తమమైందని అధివాస్తవికుల భావన.[39] పరస్పరం విరుద్ధంగా కనబడుతూన్న కలనూ, వాస్తవాన్ని సమీకరించి, పరిష్కరించడం (రిజాల్వు చేయడం) అధివాస్తవికను సృష్టించడం!

తెలుగులో అధివాస్తవిక ధోరణులు

1930–35 ప్రాంతానికి కాల్పనికోద్యమం తెలుగులో వేనుకంజ వేసింది. ఈ శతాబ్దపు పాశ్చాత్య సాహిత్యరీతుల్లో ఇమేజిజమ్ కాని, డాడాయిజమ్ కాని, ఎవరినీ అంతగా ఆకర్షించకపోయినా, అధివాస్తవికత మాత్రం నారాయణబాబును, శ్రీశ్రీని ఆకర్షించింది. నారాయణబాబు రచనల్లో ఫ్రాయిడ్ సిద్ధాంత ప్రభావం ఎక్కువగా కనబడుతుంది.

ఇక అధివాస్తవికులలో వెనుక పేర్కొన్న మూడు లక్షణాలు శ్రీశ్రీలో కనబడడం ఒక చిత్రమైన సన్నివేశం. 1930కి పూర్వం శ్రీశ్రీ సంప్రదాయంలో నుంచి రొమాంటిసిస్టుగా రూపొందాడు. ఆ మీద ఫ్రాయిడ్ సిద్ధాంతాల ప్రభావానికి లోనయాడు. తర్వాత అధివాస్తవికుల వలెనే ఈయన మార్క్సిస్టు దృక్పథాన్ని అభిమానించాడు కమ్యూనిస్టులతో పొత్తు కుదరక ఆంద్రేబ్రిటన్‌వారితో విడిపోగా, పీడిత వర్గాల పక్షాన పోరాడే కమ్యూనిజమ్ పక్షాన నిలవడానికి శ్రీశ్రీ నిశ్చయించాడు. అయినా చివరికంటా శ్రీశ్రీలో అధివాస్తవిక వాసనలు పోలేదు. మార్క్సిస్టులు వీనిని పసిగట్టినా, ఈయన అభ్యుదయ భావాలవల్ల, ఈయన్ను దూరం చేసుకోలేదు.

అభ్యుదయ కవిత్వం

ఈలోగా అభ్యుదయ కవితోద్యమం మంచి బలాన్ని పుంజుకుంది. అభ్యుదయ కవిత్వానికొక తాత్త్విక దృక్పథం ఉంది.[40] అది మార్క్సిజం. శ్రీశ్రీ మహాప్రస్థానంలోని రచనలు చాలవరకు మార్క్సిస్టు దృక్పథానికి అనువుగాఉన్నా, ఆ రచనాకాలంనాటికి శ్రీశ్రీ మార్క్సిజాన్ని గురించి శ్రద్ధగా అధ్యయనం చేయలేదు.[41] ఆయన కవిగా అవగాహన చేసికొన్న సామాజిక పరిస్థితులు ఈ రచనకు ప్రేరణలు. కాని వీనిని మించిన మార్క్సిస్టు దృక్పథంతో కవిత ఇంతవరకూ రాకపోవడం గమనింపదగ్గది.

అభ్యుదయ రచయితల కానాడు తెలంగాణా పోరాటమొకటీ, కొంతవరకు విశాలాంధ్రోద్యమం మరొకటీ ఎంతో ప్రేరణనిచ్చాయి. సమకాలీన సామాజిక స్థితిగతులనుండి కవులు ఉత్తేజితులవడమే గాక, శ్రీ రా. రామచంద్రారెడ్డిగారు చెప్పినట్లు కవిత్వం ప్రయోజనం కేవలం ఆనందాన్నివ్వడంగాక, చదువరులను త్తేజితులను చేయడమని ఋజువుచేశారు, శ్రీ సోమసుందర్, దాశరథి వంటి కవులు. తిలక్ హృదయమంతా కాల్పనికోద్యమం వైపు ఉండగా, మేధ అభ్యుదయ పంథాను కోరింది. ఈ రెండు ధృవాలనుంచే ఆయన కవిత్వం ఆవిర్భవించినా, వీని సమన్వయం పూర్తిగా సాధ్యంకాలేదు, ఆరుద్ర 'త్వమేవాహం' రచనా సందర్భంలో "టెక్నిక్ లేని కవిత్వాన్ని నేను ఊహించలేను. ప్రత్యేక సంవిధానరహిత వాక్య సందోహాన్ని, వాక్శుద్ధి-ధారా-భాషా వైరుష్యాలని పోనాడిన మాటల దొంతరని నేను కవిత్వంగా ఎంచలేను,"[42] అంటాడు శ్రీ ఆరుద్ర; తన ప్రతీకలన్నీ అర్థంకాకపోవడానికి గాక, అది పెద్ద లోపంగా కొందరు భావిస్తూ

న్నందుకు విస్తుపోయాడు.[43] అంటే పఠితుల్ని ఉత్తేజితుల్ని చేసే రచనలకు కావలసిన ముడిపదార్థం, రచనా సంవిధాన- రెండూ అందరికీ అందుబాటులో ఉండాలన్నదొక దృక్పథం కాగా, ఆ నిర్ణయానికి లొంగని మనస్తత్వం కవి దవుతోంది దీనిని క్రమశిక్షణా రాహిత్యమనీ, వైయక్తిక దృక్పథం అనీ, సామాజిక దృక్పథంపట్ల కమిట్‌మెంటు లేకపోవడం అనీ, దీని మీద ఆక్షేపణ. ఇట్టి కారణాల వల్ల అభ్యుదయ రచయితల ఉద్యమం వెనుకబడింది;[44] తర్వాత ఇది పునరుద్ధరింపబడినా వెనుకటి దీప్తి కనబడదు.

అభ్యుదయ కవితోద్యమం తర్వాత కొద్దికాలం దేశాన్ని కదలించిన దిగంబర కవితోద్యమం మీద నిజానికి పాశ్చాత్యప్రభావం తక్కువే. సామాజిక వ్యవస్థ కుష్ఠదని ఎలుగెత్తి చాటినంతగా, ఆ వ్యవస్థను పునర్నిర్మించడ మెలాగో వీరికి తెలిసినట్టులేదు.[45] ఒకే బాణీలో వచ్చిన ధిక్‌లకుకూడా దమ్ము సన్నగిల్లింది. ఈ ఉద్యమం మరో ఉద్యమాన్ని ప్రభవించింది. అదే విప్లవ రచయితల సంఘం (విరసం).[46] విరసం శ్రోతలను ఉత్తేజితులను చేయడంతో తృప్తి పడదు, కార్యోన్ముఖులను చేయాలంటుంది. శంఖాన్ని పూరించడం, భేరీని మ్రోగించడం కాదు కావలసింది, మర ఫిరంగి దగ్గరకు పరుగెడాలి, ఫిరంగిని పేల్చాలి! అందుచేతనే చదువరీ శ్రోతా రచనతో 'మమేకం' కావాలని అంటారు వీరు!

దీనిని బట్టి ఒక విషయం స్పష్టమవుతోంది. సాహిత్య ప్రయోజనం తక్షణావసరాలను తీర్చడమే. ఎక్కడో, ఎవ్వడో దీన్ని చదవకపోతాడా, సహృదయుడు దొరకకపోతాడా అని కాదు- ఇప్పుడు- ఈ క్షణంలో రచన చదివే ప్రతివాడూ తుపాకి పట్టాడా, లేదా? అన్నదే ముఖ్యం. అందుకే పద్యం కన్న, వచన పద్యం కన్న, గేయమే వీరి ప్రముఖ సాధనమఖుంది. వ్యవహారిక భాషలోకూడామాండలీకమే ఆదరింపబడుతోంది.

రొమాంటిక్ కవితవెనుక పట్టిందని అనుకొంటూండగా, శ్రీ శేషేంద్రశర్మగారు కవి సేనోద్యమాన్ని లేవదీసారు[47] దీని వేళ్లు ఒక వంక మన సంప్రదాయంలో, మరొకవంక రొమాంటిసిజమ్, సింబాలిజములలో ఉన్నట్టు కనబడుతుంది.[48] కవిసేన మొట్టమొదటి కమిట్‌మెంటు కవిత్వానికి- ఆమీద వస్తువుకు- అది సోషలిజమైనా కావచ్చు-మరేదయినా కావచ్చు.

సాహిత్య విమర్శ: మనస్తత్వశాస్త్రం

తెలుగులో సాహిత్యోద్యమాలు క్రొత్త మార్గాల కోసం అన్వేషిస్తూండగా, పాశ్చాత్యదేశాల్లో సాహిత్య విమర్శలోనే ఉద్యమాలు కొన్ని, ధోరణులుకొన్ని, బయలుదేరి సాహిత్యాధ్యయనాన్ని క్రొత్త మార్గాలకు పట్టించాయి.

ఫ్రాయిడ్ సైకో-అనాలిసిస్ ప్రభావం అధివాస్తవికుల మీద పడడాన్ని కొంత చూచాము. సాహిత్య విమర్శమీద ఈయన ప్రభావం అంతకన్న తక్కువదేమీ కాదు. ఫ్రాయిడ్ సాహిత్యాన్ని అభిమానిస్తాడు. అసలు సైకో-అనాలిసిస్‌ను కనుగొన్నవారు కవులూ, తత్త్వవేత్తలేననీ, దానికి శాస్త్రీయమైన రూపాన్ని మాత్రమే తానిచ్చాననీ ఫ్రాయిడ్ అంటాడు. ఇంక సాహిత్యం ఎట్టిది? అంటే పసిపిల్లలు తమకు తీరని కోర్కెలను తామెలా ఆటలలో తీర్చుకుంటారో, అలాగే పెరిగిన మానిసి తన తీరని కోర్కెలను పగటి కలల ద్వారా తీర్చుకుంటాడు.[49] ఇక మానవుని అవ్యక్త చేతనలో అణచిపెట్టబడి ఉన్న కోర్కెలనుంచి భద్రతను సాధించడానికి కళ మంచి పరికరం. అందుచేతనే కళాకారుడు సృష్టిలో నిమగ్నమైన స్థితిలో మానసిక చాంచల్యాన్ని పొందిన వానిని పోలి ఉంటాడు. కాగా కళ అన్నది ప్రత్యామ్నాయ తుష్టి (సబ్‌స్టిట్యూషన్ గ్రాటిఫికేషన్) అవుతుంది; కళాకారుడు వాస్తవాన్ని బదులుగా భ్రాంతి (ఇల్యూషన్)ని ఆరాధిస్తాడు.

ఇలా చూస్తే,ప్లాటోలాగే ఫ్రాయిడ్‌కు కూడా కళపట్ల ఒకవంక అభిమానం, అభిరుచి, మరొకవంక ఏహ్యభావము ఉనట్టు కనబడుతుంది. కాని, ప్లాటో కళ సత్యానికి దవ్వున ఉన్నదని ఒక విధంగా పొరబడితే, ఫ్రాయిడ్ ఇంకో విధంగా పొరబడ్డాడు. మానసిక చాంచల్యంగల వ్యక్తిమీద భ్రాంతి ఆధిపత్యం వహించగా, కళాకారుడు దాన్ని అదుపులో ఉంచుకుంటాడు. కళాకారుని భ్రాంతి, వాస్తవాన్ని మానవునికి సన్నిహితం చేయడానికి తోడ్పడుతుంది; అర్థంలేని అంశాలకు అర్థాన్ని ప్రతిపాదిస్తుంది.

సైకో-అనలిటికల్ పద్ధతి కళాఖండాల అంతరార్థాన్ని వెల్లడిస్తుందనీ, కళాకారుని మనస్తత్వాన్ని బహిర్గతం మొనరిస్తుందనీ ఫ్రాయిడ్ భావించాడు. ఇందులో కొంత సత్యమున్నా, ఇది పరిపూర్ణమైన సత్యం కానక్కరలేదని ట్రిల్లింగ్ వాదించాడు.[50] అయినా ఫ్రాయిడ్ సిద్ధాంతాలు కవిత్వాన్ని మానవుని నైజంగా నిరూపించాయి కవి కలలుకనేవాడే అయినా, అతని కావ్యం మనకు వాస్తవజగత్తు యొక్క దర్శనాన్నే కల్గిస్తుంది. విషాదాంత నాటకాలు మానవుని ఉద్రేకాలను క్షాళన మొనరిస్తాయని అరిస్టాటిల్ అంటాడు. ఫ్రాయిడ్ ట్రమాటిక్ న్యూరోసిస్‌కు సంబంధించిన పరిశోధనలవల్ల కళకొక ప్రయోజనం నిర్ధారింపబడుతుంది. హోమియోపతి వైద్యంలోలాగే ఇక్కడా ఆర్తిని శ్రోతల్లో కల్గించడం వల్ల అతని మానసిక స్థితికి దార్ఢ్యం కల్గి, జీవితాన్నెదుర్కొనే శక్తిని పొందగల్గుతాడు.

ఫ్రాయిడ్ వ్యక్తిగతమైన అజ్ఞాత మనస్సుకు ప్రాముఖ్యమీయగా, అతని శిష్యుడు యూంగ్ సామూహికమైన మనస్సు నొకదానిని ప్రతిపాదించాడు.[51] అనాది కాలం నుంచీ నేటివరకూ పరిణామం

చెందిన మానవునిలో వెనుకటి భౌతిక రూపశకిలాలు ఎలా కనబడతాయో, అలాగే ఆదిమానవునినుండి నేటివరకూ సంగ్రహింపబడ్డ సామూహిక వాసనలు కూడా అజ్ఞాత మనస్సులో ఉండిపోతాయని యూంగ్ సిద్ధాంతం: ఈ వాసనలే నేటి మానవునికీ ఆదిమ మానవునికీ గాఢమైన సంబంధాన్ని చేకూరుస్తాయి. ఈ వాసనలు కొన్ని కథలు గాథలుగాను, కొన్ని శబ్దచిత్రాలుగాను, యీ సామూహిక అజ్ఞాత చైతన్యంలో మిగిలిపోతాయి. వీనిని ఆర్క్-టైప్స్ అన్నాడు. అంటే తరతరాలుగా ఒకే రకమైన అనేకానేక మానసిక అనుభూతుల ఫలితంగా అజ్ఞాత సామూహిక మానసిక స్థితిలో మిగిలిపోయినవే ఆర్క్-టైప్స్. స్వర్గం, నరకం, దేవతలు, రక్కసులు- అనేకానేకమైన ప్రతీకలు- ఇందులో ఇమిడి ఉంటాయి. జె. జి. ఫ్రాజర్ తన గోల్డెన్‌బౌలో అంతకు పూర్వమే, వివిధ సంస్కృతులలో కనబడే పురాగాథల (మిత్స్) నమూనాలను శోధించాడు. దీనికి యూంగ్ పరిశోధనలు బలాన్ని చేకూర్చి, సాహిత్యంలో ఆర్కిటైపల్ పాటర్న్సుకు సంబంధించిన అన్వేషణకు అవకాశమిచ్చింది.[52] ఈ విశ్వజనీన, ప్రాక్తన, ప్రాథమిక నమూనాలు సామూహిక అజ్ఞాత చైతన్యానికి సంబంధించినవి కనుక రచయితను ఉత్తేజపరుస్తాయి. చదువరి అంతశ్చైతన్యంలో కూడా ఇవి ఉండడం వల్ల, వీనికి సానుభూతితో ప్రతిస్పందిస్తాడు. అంటే జాగ్రత్తగా పరిశీలిస్తే మన జానపద సాహిత్యంలోనూ,[53] పురాణాలలోనూ ఇట్టి నమూనాలు స్థిరపడి ఉండడం వల్లనే, అవి ప్రజా బాహుళ్యాన్ని ఆకర్షిస్తున్నాయని అనుకోవచ్చు.

[ఇంకా ఉంది]

గోదావరీ !

శ్రీ జొన్నలగడ్డ వెంకటప్పయ్యశాస్త్రి


ఏమమ్మా గోదావరి
నీ మహిత తరంగ సంఘ నిర్మగ్నములై
నీ మదికెక్కెనో లేదో
గ్రామములు సహస్రసంఖ్య గాసిలిపోయెన్

నిన్నా మొన్నటిదాక నెవ్వరము గానీ యీ యుగాంతైక ని
ష్పన్నాంభః ప్రళయం బిటుల్విరుగు మాపైనంచు స్వప్నమ్ము నం
దన్నా కానము తెల్గుగడ్డపయి నీకా కస్మికామర్ష మం
చిన్నాళ్లేననుకోను; కారణము వేఱేయున్న దౌనందువా?

నీ చిరవాంఛితంబో జననీ అది కాదను మీ జగత్తులో
నేఁచిన పాపచింతల భరించుట శక్యముకాక యేమొ భ
ద్రాచల రాము పాదముల దాపున నౌదల వంచి మ్రొక్కగాఁ
దోచి ధరించినావు భయదోజ్జ్వల మీ మహిమా స్వరూపమున్.

వరదవు వరదవె యైతివి
గురుతర జలవిస్తృతిన్, అకుంఠిత శక్తి
స్ఫురణను మరణము నాశము
విరచించితి వాంధ్రమహిన వేలావృద్ధిన్

తటభూమీధ్ర సమాత్త గైరిక ముఖద్రవ్యై కకిమ్మీరిత
స్ఫుటడిండీర కిరీటు భంగ శిశిర స్రోతోనవానీత ధూ
ర్జటి జూటాటవి విప్లవత్త్రిపథగా సౌందర్యరేఖా విశం
కట వృత్తుల్ సవరించి యాంధ్ర భువి కింకన్‌రాకు గోదావరీ!


AMRUTANJAN'S
SWAS
MINTS
అమృతాంజన్
వారి మరొక గొప్ప తయారి
శ్వాస
మింట్
బిళ్ళలు
అమృతాంజన్ లిమిటెడ్

కలగూరగంప

కొర్లపాటివారి "మైలమ భీమన" - ఒక పరామర్శ

డా॥ కొర్లపాటి శ్రీరామమూర్తి గారీమధ్య సాహిత్య పరిశ్రమలో మునిగి తేలుచు, నేటివరకు అపరిష్కృతము, వివాదస్పదములైన క్లిష్టసమస్యల నామూలచూడముగ తరచి, నూత్న సిద్ధాంతముల వెలయింప యత్నించు చున్నారు. ఇతఃపూర్వము పండితులు తమతమ మేధోవిలసనమున చేసిన నిర్ణయములను తిరుగతోడి, నూత్నాంశముల చొప్పించి క్రొత్తపంథాలో, క్రొత్తకోణాలలో సమస్యలను పరిశీలించి, పాత సిద్ధాంతములు పూర్వపక్ష మొనరించి నూతన సిద్ధాంతముల ప్రవచింప నుద్యోగించినారు. అందులో వారు మైలమ భీముని గురించి చేసినచర్చ, నిర్ణయము విమర్శనార్హమై పరామర్శింప దగినదిగా నున్నది. (భారతి సంపుటము 59, సంచిక 10)

ఏఱువ భీమ, మైలమభీమ, చిక్కభీమ, భండనభీమ, నల్లభీమ, పరిచ్ఛేది భీమనామ్ను లందరొకరేయని నేటివరకు ప్రచారమునందున్నది ఆవాదమును పరాస్తము గావించుచు తమకు లభ్యమైన ఉపపత్తుల జూపి, ఆ సమస్య కొక నిర్దిష్టరూపమును సంతరించి పెట్టిరి పూర్వపండిత ప్రకాండులు. వారి నిర్ణయము ప్రకారము ఏఱువ భీముడు వేరు. నల్లభీముడు వేరు. మైలమభీమ, భండనభీములొక్కరే. ప్రాయికముగ జిక్క భీముడు పరిచ్ఛేది భీములొక్కరే యనుయూహ చేయబడినది కాని శ్రీ కొర్లపాటి వారా విషయముల నెల్ల పునర్విమర్శకు దీసికొని నూతన నిర్ణయములు చేయనెంచినారు.

ఏఱువ భీముడు కాకతి గణపతి సామంతుడై పదునాల్గవ శతాబ్ది మధ్యభాగమున నివసించి యున్నట్లు స్పష్టపరచుట జరిగినది. చిక్క భీముడే పరిచ్ఛేది భీముడనియు నాతడు 11వ శతాబ్దిలోనివాడని నరసారావుపేట వేలూరు గ్రామ శాసనమునుబట్టి పదకొండవ శతాబ్ది పూర్వార్థము వాడని నిర్థరించుట గూడ జరిగిపోయినది.

నల్ల భీమునకు దీనమ్మయను భార్యగలదు. ఆమె ఆతనిభార్యలందరిలో ముఖ్యమైనది. ఈ దీనమ్మ క్రీ॥ శ॥ 1105లో రామేశ్వర దేవుని ధూపదీపములకై దానము చేయుచు నల్ల భీముని పత్నులలో తాను ముఖ్యపత్నినని చాటుకొనుచు "అమరాబాదు"లో నొక శాసనము వ్రాయించెను. (హెచ్.ఎ.ఎస్.19-పి42) కావున నల్లభీముడు మైలమ భీముడు ఒకరు కానేరరని చెప్పుట జరిగినది.

ఇక భండనభీమ, మైలమ భీముల గురించి విచారింపవలసియున్నది. వీరిని గురించి చెప్పబడిన పద్యములలో రెంటియందు చిత్ర కవిత్వ ఛాయలున్నవి.

ఉ॥ భండనభీమ నీయెదుట బాఱకనిల్చిన శాత్రవుల్ బృహ
న్మండల పుండరీక పురనాక నివాసులు, నోర్చినన్ బృహ
న్మండల పుండరీక పురనాక నివాసులు, వచ్చినన్ బృహ
న్మండల పుండరీక పురనాక నివాసులు చిత్రమిద్దరన్॥

ఈ పద్యమునకు దీటుగా మరొక చిత్ర కవిత్వభరితమైన ఈ క్రిందిపద్యము మైలమ భీమునిపై చెప్పబడినది.

ఉ॥ వీరగుణ ప్రతాపగుణ విశ్రుత మైలమభీమనీయ శం
బారభమాణ తారకరహార విలాసము నీ నికేతనం
బారభమాణ తారకరహార విలాసము నీ భుజార్గళం
బారభమాణ తారకరహార విలాసము చిత్రమిద్ధరన్ ॥

ఈ పద్యముల వలన చారిత్రకాంశము సుంతైన లభింపకున్నది. తక్కిన పద్యము లేవియో చూతము.

ఉ॥ ఆలములో నరాతులకు హమ్మని మార్కొనవచ్చునే మహా
కాళికి శూలిన్ బ్రళయ కాలపుగాలికి, రాఘవేంద్రు బా
ణాళికి బక్షినాయకునఖాళికి మత్తగజేంద్ర వైరి దం
ష్ట్రాళికి దావపావకశిఖాళికి మైలమభీమ పాలికిన్॥

చ॥ అహితుల దాకిపోరు నెడనంబుధి కలినరాము గో
గ్రహణమునాటి పార్థుగద(గౌరవునేసిననాటి భీము నా
గ్రహమెసగన్ బురత్రయము గాల్చిననాటి లలాటలోచనుం
మహినుపమింపగా దగునె? మైలమభీముని భీమ విక్రమున్॥

చ॥ విదితగుణ ప్రతాపగుణ విశ్రుత మైలమ భీమభూప! నీ
పదిలపు ఖడ్గధారదెగి పాఱిన వీరుడు గోపురంబుపై
విదిత సువర్ణ రత్నమయ వేదికమీదను నిల్చికాంచునో
పదిపదులగ్నిహోత్రులను పన్నిరు సూర్యుల నూరు చంద్రులన్॥

చ॥ ఆసమున గాశికానగరమం దసువుల్ త్యజియించినంతనే
యసదృశమైన కన్నుగల దచ్చటి మైలమభూప నీ
యసిదెగిపడ్డ వైరులకు నంబకముల్ పదిమారులయ్యె నీ
యసికిని వారణాశికిని నంతరమెంత తలంచి చూచినన్ ॥

కం॥ వసుమతిలో జిరకాలము
మశకంబై మనుటకంటె మదకరికుంభ
గ్రసనంబగు సింహంబై
మసలుట యొక గడియచాలు మైలమభీమా!

ఆపన్నియు మైలమభీముని ప్రతాపగుణ శౌర్యధైర్యోన్నతుల వలుపునట్టివియై యెట్టి చారిత్రిక విశేషముల దెలుపశక్తి మంతములు గాకున్నవి. రచనా విధానమును బట్టి ఈ చాటువు లన్నియు నొకే కవి కృతములని చెప్ప వీలు కలుగుచున్నది. మైలమభీముడు జీవించియుండి నెట్టి ప్రతాపోన్నతుల ప్రదర్శించి, అరివీరభయంకరుడైనాడో పైపద్యములు స్పష్టీకరించుచుండ నీ క్రింది పద్యము లాతని మరణానంతరమున ఘటిల్లు (ఘటిల్లిన) సన్నివేశ చిత్రణము మనకనుల యెదుట నుంచుచున్నవి. అందునా మైలమభీముని నైజగుణ విస్ఫురణ, వితరణ, గుణగానము, ఔదార్య గుణకీర్తనము, స్వభావ వైశిష్ట్య వర్ణనము కొట్టవచ్చినట్లు వర్ణింపబడుట గమనార్హము.

ఉ॥ యాచక బేచరుండు సుగుణాంబుధి మైలమభీముడేలినన్
జూచి వరించెరంభ యెడజొచ్చె తిలోత్తమ, వారినిద్దఱన్
ద్రోచె ఘృతాచి, ముగ్గుఱకు దొడ్డడి కయ్యము పుట్టెనంతలో
నాచుకుపోయె ముక్తి సతి నవ్విరియద్దెసజూచి నిర్జరుల్ ॥
(నోచినవారి సొమ్ము లిలినోమని వారికి వచ్చునేధరన్॥)

వీటినన్నింటినిబట్టి మైలమభీముడు మహాపరాక్రమవంతుడనియు యుద్ధమునందు మరణించెనుగాని (ఆత్మచ్ఛేదనమొనరించు కొనలేదని) మహాదాతయని స్పష్టమగుచున్నది.

మైలమభీముని గూర్చి చెప్పిన పైపద్యము లన్నియు వేములవాడ భీమకృతములని గతాను గతికముగ ప్రచారమందుచున్నను అందలి నిజానిజముల సంగతి యెటులున్నను ఈ క్రింది పద్యము మాత్రము వేములవాడ భీమకవిదేనని అమృతనాథకవి తన "కవిసర్పగారుడము" ననుదహరించి యున్నాడు. ఆవిధిని వేములవాడ భీమకవి సమకాలీనుడే మైలమ భీముడనుట నిశ్చయము.

చ॥ గరళపు ముద్దలోహ మవగాఢ మహాశనికోట్లు సెమ్మెటల్
హరునయనాగ్ని కొల్మి యురగాధిపుకోరట పట్టుకార్లు ది
క్కరుల యురంబు దాయలయకాలుడు కమ్మరి వైరివీర సం
హరణగుణాభిరాముడగు మైలమభీముని ఖడ్గసృష్టికిన్ ॥

మైలమభీము, వేములవాడ భీమకవుల సమకాలీనత్వ సిద్ధాంత మంగీకరింతమేని పూర్వపండితుల నిర్ణయము ప్రకారము 11, 12వ శతాబ్దియగును. కాని శ్రీకొర్లపాటి వారి వాదన ప్రకారము అది 14వ శతాబ్ది పూర్వార్థమగుచున్నది. (క్రీ॥శ॥ 1327-1400ఎడి)

ఇప్పటి వరకు లభ్యములైన చారిత్రకాంశములబట్టి జిక్కలేక నల్లభీముడు 11వ శతాబ్దివాడని, ఏఱువభీముడు 13వ శతాబ్ది మధ్యకాలము వాడని, మైలమ భీముడు 14వ శతాబ్ది ఉత్తరార్థమువాడని నిశ్చితార్థమగుచున్నది. అయితే శ్రీ కొర్లపాటి వారి మైలమభీముని వ్యక్తి నిరూపణము భీమకవి కాలనిర్ణయము విమర్శాపాత్రమై పరామర్శింపబడు నావశ్యకతను గోరుచున్నది.

ప్రసక్త వ్యాసమున వారు "మైలమ భీమన"యను శీర్షిక క్రింద నుల్లేఖించిన విషయములు రెండవ ఏఱువ భీముని (ఈతడే మైలమ భీముడని శ్రీ కొర్లపాటివారి అచంచల విశ్వాసము) సంబంధములై, యవి అన్నియు ద్రావిడ ప్రాణాయామముగ మైలమ భీముని వ్యక్తి నిరూపణమునకే దారితీసి రెండవ ఏఱువ భీముడే మైలమ భీముడని నిశ్చయింపజేసినవి. ఈ రెండవ ఏఱువ భీముడు చోళభక్తి రాజు సుతుడు, అనదేవచోడుని సవతి సోదరుడని శ్రీ కొర్లపాటివారి వ్యాసంగ పర్యవసానము.

శ్రీ కొర్లపాటివారు తమ వాదనకు పోల్బలకముగ "శివలీలా విలాసము" లోని

భరిత శ్రీనిధియమ్మ హీరమణుడొప్పం చోళభక్తి క్షితీ
శ్వర సూనుండగు భీమలింగమను జేశశ్రేష్ఠ సత్పుత్త్రి భా
స్వరకారుణ్య దశాజనావనవిధా సంధాత్రి వేమాంబికన్
వరియించెన్ బలిభక్తి గౌరవదృఢవ్యాపార నిత్యాంబికన్ ॥

అను పద్యము నుదహరించి చోళభక్తి రాజుకొడుకు భీమలింగము (భీమరాజు) కూతురు వేమాంబిక రాజమహేంద్రవర రాజ్యపాలకుండైన అల్లాడరెడ్డి నుద్వాహమాయెనని, అల్లాడరెడ్డి మామ భీమరాజే (రెండవ ఏఱువ భీమరాజు) మైలమ భీముడని నిరూపింప శ్రమపడిరి.

ఈ భీమరాజు అనదేవచోడుని సవతి సోదరుడని శ్రీ మల్లంపల్లి సోమశేఖర శర్మగారు తమ "హిస్టరీ ఆఫ్ ది రెడ్డికింగ్‌డమ్స్"లో వ్రాసియున్నారు. ఈ భీమరాజునకే అనవేమారెడ్డి తన కూతురునిచ్చి వివాహము చేసినాడు. ఈ వైవాహిక విధులవలన ఏఱువ చోళులకు కొండవీటి రెడ్లకు సంబంధ బాంధవ్యములు కల్గినవి.

ఈ ఏఱువచోళశాఖకు అన్నెమాంబ సుతుడు ఏఱువ భీముడు మూలపురుషుడు. చోళభక్తిరాజు పెద్దకుమారుడు భీమరాజు (రెండవ ఏఱువ భీముడు). ఈ భీమరాజు తల్లిపేరు తెలియదు. మైలమాంబ కావచ్చునని శ్రీ కొర్లపాటివారి విశ్వాసము దానిపై నాధారపడియే వారు రెండవ ఏఱువ భీముడు మైలమ భీముడగునని బల్లగుద్ది వాదించుచున్నారు. ఏ ఆధారమునుబట్టి వారీవిధముగ నభిప్రాయమేర్పరచుకొన్నారో తెలియదు తమ వాదనకనుకూలముగనుండ నీ యూహాసేసిరా? ఈ భీమరాజు తల్లి మైలాంబిక అయినగాని అతడు మైలమ భీముడు కాజాలడు. ఆధారములేని, ఊహాకల్పితమైన హంశమును బట్టి ముఖ్యమైన నిర్ణయములు చేయుట ప్రమాదకరము - ఈ సత్యమును తెలియకనే శ్రీ కొర్లపాటివారు ఒక ఊహచేసి, ఆయూహయాధారముగ సౌధనిర్మాణ మొనరింప సాహసింతురా? సాహసించి

రనియే వారి వ్యాసము సాక్ష్య మిచ్చుచున్నది. ప్రచారములోనున్న ఏఱువ భీముని విషయమువదలి, రెండవ ఏఱువ భీమునిగా నొకనికి నామకరణ మొనర్చి అతడే మైలమభీముడని నిరూపింప సాహసించి నందులకు నిజముగా శ్రీ కొర్లపాటివారు అభినందనీయులు! ఈ సంధర్భమున వారి వ్రాతలిట్లున్నవి.

"భక్తిరాజుకొడుకు భీమరాజు ఏఱువ భీముని వంశములోని వాడు. ఏఱువ భీమ పేరిటివాడు. ఏఱువ భీముని తర్వాత ఏఱువ భీముని వంశమునందు భీమనామధేయుడు భక్తిరాజుకొడుకు భీమరాజు మాత్రమే. కనుక భక్తిరాజు కొడుకు భీమరాజు మరల ఏఱువ భీమ రాజగును. ఉపరి-ఏఱువ వంశ మూలపురుషుడు అయిన ఏఱువ భీముడు పెద్దఏఱువ భీముడుకాగా నీతడు చిన్నఏఱువ భీముడగును. ఒక్క- శబ్దమునకు చిన్న అను అర్థము కలదు గాన భక్తిరాజుసుతుడు భీమరాజు ఒక్క- భీముడు గూడ నగుచున్నాడు.

పైన చెప్పిన దానినిబట్టి చోళభక్తి రాజునకు ఇర్వురు భార్య లుండినట్లు తేలుచున్నది. అందు అన్యమాంబ యొకతె. ఈమె అనదేవచోడుని తల్లి. రెండవభార్యపేరు తెలియదు. (శ్రీ కొర్లపాటివారామె పేరు మైలాంబికయై యుండవచ్చు నన్నారు.) ఆపేరు తెలియని ఆమె సుతుడు భీమరాజు. అందుచే అనదేవచోడుని సవతి సోదరుడు. మైలమ భీమనామధేయుడు. ఈ భీమరాజు ఏఱువవంశ్యులలో భీమ నామముద్ధరించిన రెండవవాడు గాన రెండవ ఏఱువ భీముడగు చున్నాడు. ఏఱువ వంశ మూలపురుషుడు ఏఱువభీమునికన్న చిన్న వాడు గాన జిక్క-భీముడగునని" శ్రీ కొర్లపాటివారు సిద్ధాంతరీకరించిరి.

ఈ ద్వైభార్యాత్వ సిద్ధాంతము శ్రీ వడ్డాది శ్రీరామమూర్తిగారీ ఏఱువ భీమ వృత్తాంత సందర్భమున నిత:పూర్వము ఒకపరి ప్రతిపాదించిరి. ఏఱువ తొండయరాజుల కిద్దరు భార్యలున్నారని అందు అన్నెమాంబ రెండవ భార్యయని, పెద్దభార్య మైలాంబికయని ఆమెసుతుడే మైలమభీముడని చెప్పిరి. శ్రీ వడ్డాది శ్రీరామమూర్తిగారి సిద్ధాంతము ప్రకారము మైలమభీముడు ఏఱువభీముడు నల్లభీముడు ఒకేవ్యక్తులని వక్కాణింప సాహసించినారు (ఆం.సా.స.ప. 29 పుట 77-84) ఈ యూహ సరికాదని రామచంద్రన్ నేలటూరి వేంకట రమణయ్య గారలు ఖండించి యున్నారు.

యదార్థమునకు భక్తిరాజు కొడుకు భీమరాజే మైలమభీము డయిన అతని కాలము క్రీ॥శ॥1384 - 1416 (అనదేవుని కాలము) అగును. వేములవాడ భీమకవి ఈ మైలమభీముని సమకాలీనుడైన అతని కాలముగూడ 1384-1416ఏడి అగును. ఈ నిర్ణయము శ్రీ కొర్లపాటివారు "జన్మాశయము - కర్తృకాలము" అను వ్యాసమున సూచించిన క్రీ॥శ॥ 1327-1400 లకు చేరువగానే యున్నది. కాని భక్తిరాజు రెండవభార్య మైలాంబిక అయిననాడే ఈనిర్ణయము నిలుచును. ఇంతకు భక్తిరాజు రెండవభార్య పేరేమియో చరిత్రజ్ఞు లింత వరకు తెలిసికొనలేదు. శ్రీ కొర్లపాటివారు మాత్రము మైలాంబిక అయి తీరవలెనని చెప్పుచున్నారు. "రవి కాననిచో కవిగాంచునే గదా!" అనుటిదియే కాబోలు!

శ్రీనాథుడు తన "కాశీఖండము"న అలాడరెడ్డిభార్య, భీమరాజు కూతురు వేమాంబిక అనవేమారెడ్డి దౌహిత్రి (కూతురు కూతురు) యని చెప్పినాడు. అనగా భీమరాజు అనవేమారెడ్డి అల్లుడు అగు చున్నాడు. భీమరాజు తల్లిపేరెట్లు తెలియరాకుండ పోయినదో అట్లనే భీమరాజుభార్య పేరుగూడ తెలియకుండపోయినది. ఏమి తెలియ రాకుండ పోయినను శ్రీ కొర్లపాటివారి అనుశాసనము ప్రకారము భక్తి రాజుభార్య మైలాంబికయై తీరవలెను!

పూసపాటి కవుల గ్రంథాధారమున మైలమభీముని తండ్రి దేవవర్మ. తల్లి మైలమాంబ. శ్రీ కొర్లపాటివారి సిద్ధాంతం ప్రకారం మైలమభీముని తండ్రి చోళభక్తిరాజు. తల్లిపేరు తెలియదు గాని శ్రీ కొర్లపాటివారామెకు నామకరణమహోత్సవము జరిపించి "మైలాంబిక" యనుచున్నారు. వీటి సమన్వయమెట్లో?

క్రీ॥శ॥ 1376వ సంవత్సరమున అనవేమారెడ్డి నిడదవోలు దుర్గమును తనయల్లుని తమ్ముడు అనదేవచోడునినుండి జయించి భీమ రాజు (మైలమభీమన) కిచ్చి యాతని నిడదవోలు దుర్గాధిపతిగ నొనర్చెను. అది క్రీ॥శ 1370-1400 మధ్యకాలమున అనగా పదునాల్గవ శతాబ్ది ఉత్తరార్థము.

14వ శతాబ్ది ఉత్తరార్థమునందు నిడదవోలు దుర్గాధిపతి అయిన భక్తిరాజు కొడుకు భీమరాజు రెండవ ఏఱువభీముడు 'కనుక ఒక్కభీముడు కాగలడు. అతడు ఖండనభీముడును కాగలడు. మైలమ భీముడును గావచ్చును. కనుక చాటుపద్యములలో ఏఱువభీముడు మొదటి ఏఱువభీముడు, మైలమభీముడు, ఖండనభీముడు ఒక్క-భీముడు-రెండవ ఏఱువభీముని నామాంతరములు, అతడు భక్తిరాజు కొడుకు భీమరాజు. మొదటి ఏఱువభీముని కాలము 13వ శతాబ్దిమధ్య కాలము. రెండవ ఏఱువ భీముని (మైలమభీముని) కాలము 14వ శతాబ్ది ఉత్తరార్థము. ఏఱువభీమ పదములు కల చాటు పద్యములు అజ్ఞాత కవికర్తృకములు. పదునాల్గవ శతాబ్ది ఉత్తరార్థములోని రెండవ ఏఱువ భీమనామాంతరమున బరగు మైలమభీమునకు సంబంధించిన చాటుపద్యములు వేములవాడ భీమకవి కృతములు - ఇది కొర్లపాటి వారి శాసనోక్తి. ఉక్తి బాగుగానే యున్నది. కాని యూహ సరి యైనదో? కాదో? సంశయము మైలాంబిక పాత్ర సృష్టి కొర్లపాటి వారి స్వకపోల కల్పితము. దీని యదార్థము నిరూపించువరకు వారి కథాకథనము పుక్కిటపురాణ గాథ! చోళభక్తిరాజు భార్య అనదేవ చోడుని తల్లి అన్నెమాంబ అని చెప్పుచు అనదేవచోడుని సవతి సోదరుడు భీమరాజుతల్లి మైలాంబ గావచ్చునని మండూకప్లుతముగావించి ఈ (మైలమ) భీముని ప్రస్తావనవచ్చినపుడెల్ల భక్తిరాజుకొడుకు భీమ రాజనియే గాని మైలమభీముడని చెప్పసాహసింపక, గాలిపేని, బోడి గుండుకు బొటనవ్రేలికి ముడివైచి అల్లిన కథ విమర్శలకు నిలువదని తెలిసియు గోడమీది పిల్లివాటముగ రచన సాగించిన శ్రీకొర్లపాటివారి సాహసము స్తవనీయమైనదే!

"చరిత్ర విద్యాధర"

తురగా కృష్ణమూర్తి

ఇద్దరు మహాకవులచే సృష్టించబడిన "ముగ్ధలు"

ముగ్ధలకు వయస్సుతో నిమిత్తం లేదు. లింగంతో నిమిత్తం లేదు. వీరు వొట్టి అమాయకులు. స్త్రీని ముద్దరాలు అంటారు. దీనిని బట్టి పురుషుని ముద్ద అని పిలువవలసి ఉన్నది. కాని తెలుగులో ఇట్టి ప్రయోగం కనబడదు. ఆదికవి నన్నయ తీర్చిన ఋష్యశృంగుడు ఈ కోవకు చెందినవాడు.

మునుపు కశ్యప పుత్రుడు విభాండకుడు బ్రహ్మచర్య వ్రతం బూని తపస్సుచేస్తూ ఉండినాడు. ఒకనాడు మడుగులో స్నానంచేయు సందర్భములో దేవవేశ్య ఊర్వశి అగపడింది. విభాండకుడు కామ పరవశుడైనాడు. అతనికి రేతస్స్ఖలనం అయింది. అతని వీర్యం కలిసిన నీటిని ఒక దుప్పి త్రాగింది. అది వెంటనే గర్భం దాల్చింది. దానికి ఋష్యశృంగుడు అను కొడుకు పుట్టినాడు. దుప్పికి కొమ్ములు ఉన్నందువలన, దానికి పుట్టిన కొడుకు కూడ కొమ్ములతోనే పుట్టినాడు. ఆ కారణంవలన ఇతనికి ఋష్యశృంగుడు అను పేరువచ్చింది గాబోలు.

ఋష్యశృంగుడు తన తండ్రి, అతని ఆశ్రమం తప్ప మతేమియు తెలియనివాడు. అతడు ఘోరతపస్సు చేస్తూ ఉండినాడు. అంగ దేశాధిపతి అయిన రోమపాదుడు బ్రాహ్మణులకు చేసిన అపరాధం వలన వారు అతనిని విడిచినారు. వారు విడిచినందువలన, దేవతలు కూడ అతనిని విడిచినారు. ఈ కారణంచేత అతని దేశంలో వానలు పడటం నిలిచిపోయినది. దీనికి ప్రాయశ్చిత్తం ఏమిటి అని అతడు బ్రాహ్మణులనే అడిగినాడు. శాంతుడు, వేదాంతవేది అయిన ఋష్యశృంగుని నీ దేశానికి రప్పింపుమని వారు అతనికి హితవు చెప్పినారు. రోమపాదుడు కొందరు విదగ్ధ వేశ్యాంగనలను పిలువనంపుకొని, మీ నేర్పు చూపి ఋష్యశృంగుని తోడ్కొనిరండని చెప్పి పంపినాడు.

వేశ్యాంగనలు అనేక రసావహమైన భక్ష్యాలను, కాంతివంతమైన అనుకపాలను, పూలమాలలను గైకొని ఋష్యశృంగుని ఆశ్రమానికి పోయినారు. అగ్నిహోత్రం వేల్చుభారం తన కొడుకుమీద పెట్టి విభాండకుడు వన్య ఫలాహరణార్థం అడవికి పోయి ఉండినాడు. ఈ తరుణంలో ఒక వృద్ధ వేశ్య అభినవ యౌవన విలాస విభాసిని అయిన తన కూతురును ఋష్యశృంగుని వద్దకు పంపింది. తన తండ్రిని, అతని ఆశ్రమాన్నితప్ప ఇతరం ఏమియూ ఎఱుగని ఋష్యశృంగుడు తొలిసారిగా ఒక స్త్రీని, ఒక అపూర్వ సుందరిని చూచి సంబరపడినాడు

ఋషి కుమారుడైన ఋష్యశృంగుడు ఆమెకు ఎట్టి మర్యాదలు చేసినాడో నన్నయ మాటలలోనే వినండి.

"ఎందుండి వచ్చితివి ఋషి కుమార? యే నెన్నడు నిట్టి
సుందరాకారు ముని సుతు నే దొల్లి చూచి యెఱుంగ,
నిందుండు మీర"ని కృష్ణ మృగచర్మ కృతకు కృశాసనము
సందుండగా బనిచె, ఋషియను బుద్ధి, నత్తన్వి ప్రీతి.

ఋష్యశృంగుని ముగ్ధత్వం ఎట్టిది అనగా, అతడు ఆమెను ముని కుమారుడనియే భావించినాడు. ఇక్కడ కూర్చుండుమని ఆ విలాసినికి కృష్ణమృగ చర్మంతో నిర్మించిన ఒక కృశాసనాన్ని పఱచినాడు. అర్ఘ్య పాద్యాది విధులచేత, స్వాదు ఫలాలచేత అతిథి చేయనుండగా ఆమె అప్పుడే బయలుదేరింది. ఋష్యశృంగుని వంటి ముగ్ధతో, అప్పటివరకు స్త్రీ ముఖమే ఎఱుగనివానితో తనకు ఏమి పని అన్నట్లు; తాన, వచ్చిన పని ఏదో అది మాత్రమే చూచుకొని పోవలెనని ఆమె పట్టుదల. ఈ నెపంతో ఇక్కడ కొంతకాలం గడపవలెనని ఆమె తలపునకే రాలేదు. "మా ఆశ్రమం ఇక్కడకు మూడు యోజనాల దూరంలో ఉన్నది. కాబట్టి పోతాను. నీవు అక్కడకు వచ్చి నాతో చెలిమి చేయు"మని చెప్పింది. దూరాభారం పయనం అని చెప్పిన యెడల ఋష్యశృంగుడు అడ్డు చెప్పబోడని ఆమె అభిప్రాయమేమో. ఇంత దూరం నడచి వచ్చిన ఆ విలాసినికి విశ్రాంతి అక్కఱలేదా? విమానాలలో తిరగటానికి ఈ వేశ్యాంగనలు దేవకాంతలుగారు. వీరు- అమరనారుల లీలన్" విభాండకుని ఆశ్రమానికి పయనమైనట్లు నన్నయ చెప్పినాడు. వీరు రావటానికి ఎంత ప్రయాస పడినారో, పోవటానికి అంతకుమించిన ప్రయాస పడవలెను. రావటానికి ఎంత కాలం పట్టిందో పోవటానికి అంతకు మించిన కాలం పట్టగలదు. పైపెచ్చు, ఇక్కడ వీరికి ఎట్టి ఆకర్షణముయు లేదు. అందువలననే విలాసిని తిరుగుముఖం పట్టింది. ఋష్యశృంగుని రోమపాదుని కడకు రప్పించిన ఎడల, తన పనీ నెరవేరినట్లే యని ఆమె ఉబలాటం. పోవటానికి మునిగాళ్ళమీద నిలిచినట్లే ఉన్నవి ఆ విలాసిని ఆడిన మాటలు. "ఋషి కుమార" అని ఋష్యశృంగుడు సంబోధించినందువలన, అతనికి ఆ భాషలోనే ఆమె సమాధానం చెప్పింది తాను కూడ ఒక ఆశ్రమంలో నివశిస్తున్నట్లు, "మా ఆశ్రమం ఇక్కడకు మూడు యోజనాల దూరంలో వున్నది" అని పలికింది — ఆ వేశ్యాంగన. ఋష్యశృంగుడు తాను అక్కడకు వస్తానని మాట ఇచ్చినగానీ అతని ఆతిధ్యం స్వీకరించబోనని బిగువు చూపింది.

ఋష్యశృంగుడు అట్లే చేస్తానని మాట ఇచ్చి, ఆమెకు అతిథి సత్కారాలు చేసినాడు. ఆ విలాసిని ఇచ్చిన దివ్యగంధ మాల్యాలను, సరసభక్ష్య పానాలను, విచిత్ర వస్త్రాలను స్వీకరించినాడు. అనంతరం

ఆమె అతని ఎదుట నిలిచి కందుక నర్తనం చేసి, మృదు గీతాలను ఆలాపించింది. అవసానంలో అతనిని కౌగలించుకొని, అతనికి సంతోషం కలిగించింది. ఇట్లు అతనిని ప్రబోధించి ఆ విలాసిని వెడలి పోయింది. ఋష్యశృంగుడు ఆమె పోయిన దిక్కు చూస్తూ అగ్ని హోత్రం వేల్వక మఱచి విపరీతబుద్ధి అయివుండినాడు. విభాండకుడు అడవినుండి ఫలాలు తీసికొని వచ్చినాడు తన కొడుకు అగ్నిహోత్రం వేల్వక చింతాక్రాంతుడై ఉండుటను గమనించినాడు. ఈ కాలాతి క్రమణానికి కారణం ఏమిటి అని అడుగగా ఋష్యశృంగుడు తండ్రితో జరిగినదంతయు చెప్పినాడు. నన్నయ ఈ వాక్యాలను అతని మాటల లోనే చెప్పించినాడు. తానే చెప్పిన యెడల పురుషుడు స్త్రీ అవతారం ఎత్తినట్లు అయి, కవి రసాభాస చేసినట్లు కాగలదు మరి. ముగ్ధత్వం ఉట్టిపడునట్టి వాక్యాలను ముగ్ధ నోటనే వినవలెను. కవి జోక్యం ఇక్కడ పనికిరాదు. జోక్యం కల్పించుకొనిన యెడల అందం చెడుతుంది.

సీ. "కంచన గ్గుండు గడురూప వంతుండు గమ్మని జడలతో ఘనము
లగుచు
ననయంబువ్రటువలగు రెండు పిండంబు లు రమున విలసిల్లుచుండ,
నఱుత
వెలుఁగుచు జపమాలప్రేలంగ, నన్నువ నడుమును వడకంగ
నడుచునపుడు,
కలహంస కూజిత కలనాదమెసగనాపొలికి నేడొక్క బ్రహ్మచారి

ఆ. వచ్చిపోయె, వాని వదనంబు వలన నెల్వడు సుగంధి మధుర
భాషితంబు
పొలుచు వినగ సమదపుంస్కోకిలాలాప, చారువగుచు హృదయ
సమ్మదముగ"

దేవతా స్త్రీని ఆపాదమస్తకం వర్ణింపవలెనని, మానవ స్త్రీని తద్విరుద్ధంగా వర్ణింపవలెనని శాస్త్రం చెప్పుతుంది. ఈ వేశ్యాంగన వర్ణనను కవి ఋష్యశృంగునిచేత ఈ ప్రకారమే చేయించినాడు. కడు రూపవంతునికి "వ్రటువలను రెండు పిండంబులురమున విలసిల్లి"న వని కవి చెప్పిన అది ఖోజ్జాను వర్ణించినట్లు ఉండిపోగలదు. ఈ మాటలనే ఋష్యశృంగుని ముగ్ధ నోట విన్నఎడల మనకు ఆహ్లాదము కలుగుతుంది. "ఆ కాంచన వర్ణుడు" నడుస్తూ ఉండగా, అతని నడుము ఇటునటు చలించినట్లు - ఋష్యశృంగుడు గ్రహించినాడు. ఆ "బ్రహ్మచారి" మాట్లాడుతూ ఉండగా, ఆ ధ్వని కలహంస కూజితకల నాదం"వలె ఉన్నది. "అతని" నోట వెలువడిన తియ్యని వాక్కులు సువాసనతో కలగల్సినవై ఆ ధ్వని "సమదపుంస్కోకిలాలాపం"వలె ఉన్నది. గండు కోయిల మాత్రమే మధురంగా కూస్తుందేమో. మగ నెమలి మాత్రమే నృత్యం చేస్తుంది. ఆడునెమలి చేయదు.

ఋష్యశృంగుడు ఎట్టి వస్త్రాలు ధరిస్తూ ఉండెనో మనకు తెలియదు. అతని ఆశ్రమానికి వచ్చిన "ఋషికుమారుడు" కట్టిన చీరెలు అతి మృదువుగా, విచిత్రంగా, మనోహరంగా ఉండినవట. "అతని" కటి భారమునందు ఒక "కనక పట్టము" వెలుగుతూ ఉండి నది. అది మొలంబిళ్ళ కావచ్చును. "అతని" శరీరంనుండి "రమ్యమై" సౌరభం విలసిల్లుతూ ఉండినదట. "కమ్మని" జడలు, "రమ్యమై"న సౌరభం! ఒకటి కంటికి ఇంపు, రెండవది ముక్కుకు ఇంపు. "కమ్మని" లతలు, "రమ్యమైన", "రమణీయమైన" కథ నన్నయ రచనలో చూడగలం, వినగలం.

ఆ "ఋషి కుమారుడు" ఒక ఎర్రనిపండు కుడిచేతిలో ధరించి నాడు. దానిని అక్కడక్కడే చఱచి, అది నేలబడి ఎగయబోగా, దాని ప్రక్కకు వ్రాలినాడు. ఈ దృశ్యం ఋష్యశృంగునికి "వాతా వధూతంబైన బాల వృక్షంబు"వలె అగపడింది. లేతచెట్టు గాలి దెబ్బకు వంగినను, మరలా నిలబడుతుంది. తీగకు ఇట్టి శక్తి లేదు. "తీగకు" మాఱు "బాలవృక్షంబు" అని నన్నయ వాడటంలోని ఆంతర్యం ఇదే నని తోస్తుంది. ఋష్యశృంగుడు "తీగ"కు, "వృక్షాని"కి భేదం తెలి యని వాడా? అతడు ముగ్ధ అని పాఠకులు వెనుకనే తెలిసికొన్నారు. అతని ముగ్ధత్వానికి మరొక ఉదాహరణను చిత్తగించండి.

"నన్నును గౌగిలించుకొని, నా వదనంబునకున్ నిజాస్యమా
సన్నము జేసి, యొక్క మృదు శబ్దము సేసె మనోహరంబుగా,
నెన్నడు నట్టి శబ్దము మునీశ్వర, మున్, వినియేనెఱుంగ, న
య్యన్నువ బ్రహ్మచారి ముఖ మంబురుహంబు సమంబు సూడగన్"

ఆ "ఋషి కుమారుడు" తనను కౌగిలించుకొని, తన మొగానికి, "అతని" మొగం ఆనించి, ఒక "మృదు శబ్దము" చేసినాడట. 'అతని' నోటివెంట వెలువడిన మాటలన్నియు సువాసన కలగల్పి ఉన్నవని వెనుకనే చెప్పినాడు. ఇప్పుడు వెలువడిన "ఆ" మృదుశబ్దము మరొక విధంగా ఉండునా? పైపెచ్చు అది మనోహరంగా ఉన్నదట. అట్టి శబ్దం తాను మున్నెన్నడును విని ఎఱుంగడట. నరపానం, "ముద్దు" అని వాడినట్లయిన, అతని ముగ్ధత్వానికి వెలితి ఏర్పడుతుంది. ఆ "బ్రహ్మచారి" ముఖం పద్మాన్ని పోలిఉన్నదట. అడవిలో సంచ రిస్తూ ఉన్నవాడు పద్మాలను చూచి ఉండటం అబ్బురం ఏమీ కాదు. ఋష్యశృంగుడు తన తండ్రిని "మునీశ్వర" అనియే సంబోధించి నాడు. విభాండకుడు తనకు "తండ్రి" అని అప్పటికిని తెలియసంతటి ముగ్ధ - ఈ ఋష్యశృంగుడు.

ఆ "ఋషి కుమారుడు" ఋష్యశృంగుడు ఇచ్చిన నవ్యస్వాదు ఫలాలను ఆదరించినాడే గాని ఆరగింపలేదు. "అతడే" ఋష్యశృంగు నికి అమృతోపమానమైన ఫలాలు, అతి మధురమైన పానీయాలు ఇచ్చి

నాడు. వాటిని ఋష్యశృంగుడు ఉపయోగించినాడు. ఆ రస విశేషాలు కని విని ఎఱుగనివి. ఆ "ఋషి కుమారుడు" తన చేతితో ఎత్తి పువ్వులు చల్లగా అవి చెదరి "అళిప్రకర నిషేవన మొప్ప" ఉన్నవి. అవి ఇ"వ్వనకుసుమములట్లు గావు వరగంధంబుల్" అని ఋష్య శృంగుడు వర్ణింపలేక వర్ణించినాడు. ఇదిఅంతయు ఒక అపూర్వ సంఘటన అని అతని అభిప్రాయం. ఆ "మునిపుత్రుని" ఆశ్రమానికి పోయి, అతనితో కలిసి తపస్సు చేయటం తనకు ఇష్టమైనట్లు విభాండకునికి చెప్పినాడు.

ఇదంతయు విని విభాండకుడు సస్మితుడైనాడు. ఇది రాక్షసుల చెయిదం కాబోలునని అతని అనుమానం. వారు ఇచ్చు పానీయాలు త్రాగకూడదు అని, అతి సువాసన గల కుసుమాలను మునులు వర్జింప వలెనని కొడుకుకు హితవుచెప్పి, ఎప్పటివలె వన్య ఫలా హరణార్థం పోయినాడు.

నన్నయ ఈ సంఘటనను ఇట్లు వ్యాఖ్యానించినాడు:

"చనుదెంచి తరుణి ముని నందనుచిత్తమునకు వైకృతము జేసె, విలాసినుల సహాలాప సహాసీన సహా యానములు బంధ సమములుగావే"

ఋష్యశృంగుడు తనకు తానే బంధం విధించుకొన్నాడని నన్నయ తేల్చి చెప్పినాడు. విలాసినులతో కలిసి సంభాషించటం, వారితో కలిసి కూర్చుండటం, వారితో కలిసి పయనించటం-బంధాన్ని కొనితెచ్చుకొన్నట్లేనని నన్నయ సూక్తి.

ఆ "ఋషి కుమారుడు" ఆశ్రమానికి రాక పూర్వం ఋష్య శృంగుడు ఒక ముని. ఇప్పుడు అతనిలో మార్పు వచ్చింది. అతడు ఆ విలాసిని మోహంలో పడినాడు. తండ్రికి చెప్పకనే ఆశ్రమం విడిచి నాడు మనుష్యయోగంలో తగిలి ఆ విలాసిని వెంట అంగదేశానికి పోయినాడు. రోమపాదుని ఆదేశంపై అతని ఆశ్రయంలో గడపినాడు. అతని నివాసం వలన అంగదేశంలో కుండపోతగ వానపడి, నదీనదా లన్నియు నిండినవి. సర్వజనులు సంతోష సాగరంలో తేలినారు. రోమపాదుడు ఋష్య శృంగునికి తన కూతురైన శాంతను ఇచ్చి వివాహం చేసినాడు. ఇక్కడ విభాండకుడు తన కొడుకును గానక అన్ని దేశాలు గాలిస్తూ, అంగదేశానికి వచ్చినాడు. గోపకుల వలన ఋష్య శృంగుని ఉనికిని తెలిసికొని, శాంతాసమేతంగా అతనిని తన ఆశ్రమానికి తోడ్కొని పోయినాడు.

ముగ్ధ సంగయ్య

సంగయ్య ముగ్ధ అయినందువలన అతనికి పాల్కురికి సోమ నాథుడు "ముగ్ధ సంగయ్య" అని పేరు పెట్టినాడు. అతడు బసవ పురాణ తృతీయాశ్వాసంలో ఇట్టి ముగ్ధ గణాల చరిత్రలనే ఎన్నిక చేసి వ్రాసినాడు. నన్నయ తీర్చిన ఋష్యశృంగుని చూచి పాల్కురికి సోమనాథుడు ముగ్ధ సంగయ్య చరిత్రను రచించిన జాడలు ఏవియు కానబడవు.

కళ్యాణ కటకాన్ని ఏలుతూ ఉండిన బిజ్జలుని కొలువులో బసవడు దండనాయకుడు. ఒకనాటి రాత్రి ఎప్పటివలె అతని ఇంటికి జంగములు అధిక సంఖ్యలో వచ్చినారు. బసవడు వారికి నిండారు భక్తితో ఆతిథ్యం ఇచ్చినాడు. వారు అతనివద్ద ఘనసార తాంబూల గంధ ప్రసూనాలు, ఆభరణ వస్త్రాలు గైకొని లంజెతికం చేయ టానికి బయలుదేరినారు. బసవడు ఏకపత్నీవ్రతుడు. పరకాంతను కన్నెత్తి చూచి ఎఱుగడు. కాని అతడు భక్తుల కోరికలకు అడ్డు చెప్పడు. అట్లు బయలుదేరిన మిండ జంగాలను చూచి, ముగ్ధ సంగయ్య కూడ వారిని అనుసరించినాడు. అతడు "లింగ సర్వేంద్రియ లీనుడు". మిండ జంగాలు "లింగార్చన" కోసరమే పోతున్నారని అతని అభిప్రాయం. అతడు "కలనైన లంజెతికంబనునట్టి పలుకు" ఎఱుగనివాడు. "ఏనును బోదునా యీ యయ్యగాండ్రతోనే లంజె తికంబు మానగా జేయ" అని బసవని అడిగినాడు. బసవడు చిఱు నవ్వు నవ్వి, దానికి అనుమతించినాడు. అతనికి సహజ శృంగారం చేసి, పరిచారకులను తోడుగా నిచ్చి "పటుభక్తి గల్గు తరుణి" ఇంటికి పంపినాడు.

సంగయ్య ఆ స్త్రీని చూచి, ఈమె ప్రమథ కన్యకయా? సాక్షా ద్రుద్రగణికయా? చిత్తరు రూపమా? చెలువయా? పుత్తడిబొమ్మయా? అనుకొన్నాడు. ఆ గణిక వచ్చి సంగయ్య పాదాలమీద పడి భక్తితో పడిగం పెట్టి పాదాలు గడిగి, ప్రీతితో పాదోదకం సేవించింది. సంగయ్యను తోడుకొని వచ్చినవారికి విభూతి విడియాలు తానే సమ ర్పించి పంపింది. వారు పోయిన తర్వాత మిండ జంగానికి చేయూత నిచ్చి లోనికి తోడ్కొనిపోయింది. ఆ గణిక గృహం స్ఫాటిక సోపాన పంక్తితో ఒప్పుచున్న వాటికా కుట్టిమహర్మ్య స్థలం అది. కస్తూరి కలయంపితో, ముక్తఫలాల రంగవల్లులతో, కంభకట్లతో, మేలు కట్లతో శోభాయమానంగా ఉన్నది ఆ హర్మ్యం. ఆమె శయ్యాగారంలో బహుమణి దీపాలతో వెలుగు పట్టెమంచం, పుష్పసంచితమైన హంస తూలికా తల్పం అగపడినవి. ఆ శయ్యాగారమంతయు, అనేక విధా లైన సువాసనలు విరజిమ్ముతున్నది. ఆది పరమేశ్వరుని సింహాస నమా? పుష్పక విమానమా? శృంగార గృహమా? మంటపమా? అన్నట్లు చక్కగా రమణీయంగా విరాజిల్లుతున్నది. ఇదంతయు ముగ్ధ సంగయ్యకు అత్యంత ఆశ్చర్యంను కలిగించింది. ఈ శయ్యాగృహాన్ని చూచి సంగయ్య - అది గణిక లింగార్చన చేయు సదనం కాబోలు అని భావించినాడు. ఉన్నత సింహాసనాన్ని పోలిన ఆమె చారు పర్యంకానికి దిగువనేలపై కంబలి ఆసనంగా చేసికొని, శివ సమా రాధన చేయటానికి కూర్చుండినాడు.

సంగయ్య అట్లు శివ సమారాధనకు ఉపక్రమించి, సర్వాంగా లకు విభూతి అలదికొనసాగినాడు. ఆ పని ఒకవైపున చేస్తూనే "నీవు కూడ విభూతి అలదికొనటం లేదేమి?" అని ఆ గణికను అడిగి నాడు. "పార్వతి అలదికొను పచ్చ విభూతిని ఒక అయ్య నాకు ఈ సాయంకాలమే ఇచ్చినాడు. దానిని సర్వాంగాలకు అలదికొన్నాను. ఇదిగో చూడుము" అని ఆమె తన ఒడలికి అలదికొన్న పసుపును చూపింది. సంగయ్య రుద్రాక్షలు ధరిస్తూ, "నీవు కూడ రుద్రాక్షలు ధరింపలేదేమి?" అని అడిగినాడు. "లవణ సాగరలో పుట్టిన రుద్రా క్షలు నాకు ఇష్టంలేదని గ్రహించి ఒకయ్య క్షీరసాగరంలో లభించు తెల్ల రుద్రాక్షలు తెచ్చి ఇచ్చినాడు. ఆమె ముక్కున ధరించిన


విశిష్ట సుగంధం
మైమరపించే తాజాదనం
కొత్త
ప్రేమ
మీకోసమే
NEW
PREM
ఇప్పుడు అనువైన ఆకారంలో, కొత్త పరిమళంతో వస్తోంది.

గ్రంథ విమర్శలు

తెలుగు కవుల సంస్కృతానుకరణలు

[సంకలనకర్త- డాక్టర్ ఆర్. శ్రీహరి; డెమ్మీసైజు 96 పుటలు. వెల రూ. 12 లు. ప్రకాశకులు: సురభారతీ సమితి, ఉస్మానియా యూనివర్శిటీ కాంపస్, హైదరాబాద్ - 600 007. ప్రతులకు పై సమితి కార్యదర్శికి వ్రాయవలెను.]

భారతదేశంలోని వాఙ్మయాలలో సంస్కృత వాఙ్మయమే అతి ప్రాచీనమైనది. ఇతర వాఙ్మయాలన్నీ దానిపైనే ఆధారపడి ఉన్నాయి. తెలుగు వాఙ్మయంలోని అతి ముఖ్యాలయిన భారత, భాగవత రామాయణాలు, ప్రబంధాలు మాత్రమే కాకుండా శాస్త్రగ్రంథాలు కూడా సంస్కృతాన్ని అనుసరించే ఉన్నాయి. కొన్ని అనువాదాలయితే కొన్ని అనుకరణలు. తెలుగు వాఙ్మయంలో సుప్రసిద్ధాలయి, సామాన్య జనులకు కూడా అందుబాటులో వుండి ప్రశంసా పత్రములైన చాలా పద్యాలు సంస్కృతానుకరణలుగానే కానవస్తున్నవి. జాతి రత్నాలవంటి సుమతిశతక, వేమన పద్యాలూ, ప్రబంధాలలోని రసవంతాలయిన పద్యాలూ ఆయా కవుల స్వంత భావాలను తెలిపేవే అని చాలామంది అభిప్రాయం. కాని అవి మూలానుకరణాలే అని యీ గ్రంథంలో నిరూపింపబడింది.

ముక్కు తిమ్మనగారి పారిజాతాప హరణ ప్రబంధంలో శ్రీకృష్ణుడు సత్యభామను కోపం విడువవలెనని వేడుకుంటున్న సందర్భంలో

"నను భవదీయదాసుని మ
  నంబున నెయ్యపు గిన్క పూని తా
చినయది నాకు మన్ననయ;
  చెల్వగు నీ పద పల్లవంబు మ
త్తను పులకాగ్రకంటకవి
  తానము సోకిన నొచ్చునంచు నే
ననియెద; నల్కమానవుగ
  దా యికనైన నరాళకుంతలా:"

అనే పద్యం ఉన్నది. అది ఆ కవి కవితాప్రతిభకు గీటురాయి అని ప్రశంసలను అందుకొన్నది. కాని, దానికి మూలం కానవస్తున్నది. అది—

"దాసే కృతాగసి భవత్యుచితః ప్రభూణాం
పాద ప్రహార ఇతి సుందరి! నాస్మి దూయే.
ఉద్యత్కఠోరపులకాంకుర కంటకాగ్రై
ర్య ద్భిద్యతే తవ పదంనను సావ్యథామే."

ఈ శ్లోకం సాహిత్యదర్పణ మనే అలంకార శాస్త్ర గ్రంథంలో ఉదాహరించబడి ఉన్నది.

ఈ విధంగానే నలకీర్తి కౌముదిలోని

"భృంగానవాప్తి ప్రతిపన్న ఖేదా
కృత్వా వనే గంధఫలీ తపోఽలమ్,
తన్నాసికాఽభూ దనుభూత గంధా
స్వపార్శ్వ నేత్రీకృత భృంగ సేవ్యా."

అనే శ్లోకం రామరాజభూషణుని వసుచరిత్రలో అత్యంత ప్రసిద్ధమై ప్రశంసించబడుతున్న

"నానా సూన వితా నవాసనల నా
  నందించు సారంగ మే
లా నన్నొల్లదటంచు గంధఫలి బల్
  కాకందపం బంది యో
షా నాసాకృతి దాల్చి సర్వసుమన
  స్సౌరభ్య సంవాసియై
పూనెన్ ప్రేక్షణ మాలికా మధుకరీ
  పుంజంబు లిర్వంకలన్"

ఆధారమని చెప్పవలసి యున్నది. ప్రబంధాల్లోని అనుకరణలకు ఉదాహరణలుగా ఈ రెండు పద్యాలూ చాలును. ఇక సుమతి, శతక పద్యాలను గురించి చెప్పనక్కరలేదు. ఒక్క ఉదాహరణ- మూలం—

"తత్ర మిత్ర! న వస్తవ్యం యత్ర నాస్తి చతుష్టయమ్,
ఋణదాతా చ వైద్యశ్చ శ్రోత్రియః సుజలానదీ"

(హితోపదేశం)

సుమతి శతక పద్యం—

"అప్పిచ్చువాడు వైద్యుడు
ఎప్పుడు నెడతెగక పారు ఏరును ద్విజుడున్
చొప్పడిన యూరనుండుము
చొప్పడకున్నట్టి యూరు చొరకుము సుమతీ!"

డాక్టర్ శ్రీహరిగారు ఎంతో ఓపికతో ఎన్నో సంస్కృతాంధ్ర గ్రంథాలను పరిశీలించి, సంస్కృత మూలాలనూ, వాటి అనుకరణాలయిన పద్యాలనూ సేకరించి, ఈ సంకలన గ్రంథం కూర్చారు. ఇది తెలుగువారికి మిక్కిలి ఉపయోగకరమైన గ్రంథం.

తెలుగునాట సంస్కృతభాషా ప్రచారానికి నిరంతర కృషి చేస్తున్న హైదరాబాద్‌లోని సురభారతీ సమితివారు దీనిని ప్రచురించడం ప్రశంసనీయం. ఈ సమితివారికీ, సంకలనకర్తకూ తగిన ప్రోత్సాహమిచ్చి ఇట్టి గ్రంథాలు వెలువడుటకు తోడ్పడుట తెలుగువారి కర్తవ్యం.

సంస్కృత సూక్తి ముక్తావళీ

[సంకలనకర్త డాక్టర్ ఆర్. శ్రీహరి, డెమ్మీ సైజు 152 పుటలు. వెల రూ. 12 లు. ప్రకాశకులు సురభారతీ సమితి, ఉస్మానియా యూనివర్సిటీ కాంపస్, హైదరాబాదు - 500 007. ప్రతులకు పై సురభారతీ సమితి కార్యదర్శికి వ్రాయవలెను.]

జన సామాన్యానికి ఉపయోగించే నీతులను తెలిపే సూక్తి గ్రంథాలు సంస్కృతంలో చాలా ఉన్నవి. కొన్ని భర్తృహరి సుభాషిత రత్నావళి మున్నగునవి ఏక కర్తృకములు. సుభాషిత రత్న భాండాగారము, మున్నగునవి సంకలన గ్రంథాలు. వివిధ విద్వత్కవులు కూర్చిన శ్లోకాలు ఒకచోట చేర్చ అవి బృహద్గ్రంథాలుగా తయారైనవి. ఆ గ్రంథాలు శ్లోకరూపంలో ఉన్నందున-సంగ్రహరూపంలో ఉన్న నీతులతోపాటు వానికి దృష్టాంతాలు కూడా ఇయ్యబడి ఉన్నవి.

దృష్టాంతాలు లేకుండా కేవలం సూక్తులనే తెలియజేసే గ్రంథాలలో ఇది ఒకటి. సూక్తిగ్రంథాలు సాధారణంగా దేవనాగరి లిపిలోనే ఉంటాయి. ఆ లిపి తెలియని తెలుగువారికి వాటివల్ల ఎక్కువ ప్రయోజనం ఉండదు. ఇది తెలుగు లిపిలోనే - తెలుగు తాత్పర్య సంగ్రహాలతో కూడా ముద్రితమయింది. డాక్టర్ శ్రీహరిగారు ఎంతో శ్రమపడి వివిధ గ్రంథాలనుండి సూక్తులను సంగ్రహించి, ఒక నిఘంటువు మాదిరిగా ఆకారాదిక్రమంలో సంకలనం చేయడం ప్రశంసనీయం. ఆక్రమంలో అయితే శ్రమలేకుండా కావలసినవాటిని గ్రహించవచ్చును. పుస్తకం చివర వీటి ఆకరగ్రంథాల యొక్కయు, వాటి సంకేతాలయొక్కయు పట్టిక ఇయ్యబడింది. దానిని చూస్తే శ్రీ శ్రీహరిగారు సూక్తి సంకలనం కోసం పడిన శ్రమ తెలుస్తుంది. ఇది తెలుగువారికి మిక్కిలి ఉపయోగించే గ్రంథం.

తెలుగునాట సంస్కృతభాషా ప్రచారానికి గొప్ప కృషి చేస్తున్న హైదరాబాద్ సురభారతీ సమితివారు ఎన్నో ఉపయుక్త గ్రంథాలను, తెలుగు తాత్పర్యాలతో కూడా తెలుగులిపిలో ప్రకటిస్తున్నారు. దీనికి ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రధాన న్యాయమూర్తి శ్రీ అల్లాడి-కుప్పుస్వామిగారూ, డాక్టర్ పుల్లెల శ్రీరామచంద్రుడుగారూ ఎంతో పాటుపడుతున్నారు. సంస్కృత విద్వాంసులకు ప్రోత్సాహం కలిగిస్తున్నారు. వారు ఈ గ్రంథాన్ని తమ సంస్థద్వారా ప్రకటించి సంస్కృత భాషాభిమానులకు మహోపకారం చేసినందుకు వారికి ధన్యవాదాలర్పించవలసి యున్నది. ఈ గ్రంథానికి మంచి ప్రచారం కలగగలదని విశ్వసిస్తున్నాను.

శ్రీబులుసు వేంకటరమణయ్య

చీనాలో బౌద్ధమత నిర్మాణాలు

"బుద్ధిస్ట్ మాన్యుమెంట్స్ ఆఫ్ చైనా ఎండ్ సౌత్ - ఈస్ట్ ఏషియా :" ఐ. కె. శర్మ : సందీప్ ప్రకాశన్, సి-2/9 కమ్యూనిటీ సెంటర్, అశోక్ విహార్, ఫేస్ II, ఢిల్లీ-110 052. వెల రు. 350.

సుప్రసిద్ధ ఆంధ్ర పురావస్తు శాస్త్రవేత్త డాక్టర్ ఇంగువ కార్తికేయ శర్మ చీనా వెళ్ళి అక్కడి వివిధ బౌద్ధ నిర్మాణాలని చూసివచ్చి రాసిన ఈ పుస్తకంలో చిత్రపటాలు, ఛాయాచిత్రాలు పుష్కలంగా ఉన్నాయి.

చీనా, భారతదేశాలు ప్రాచీన చరిత్ర కలవి. పొరుగుదేశాలు కూడా. భారతదేశంలో ఉద్భవించిన బౌద్ధమతం ఇక్కడ నామమాత్రంగానే మిగిలి ఉన్నది కాని చీనాలో విశేషంగా అనుసరించబడుతోంది. ఒకప్పుడు ఈ రెండు దేశాలమధ్యనా ఎన్నోరకాల సంబంధాలు ఉండేవి. క్రమంగా అవి తగ్గిపోయి ఒకరినొకరు మర్చిపోయే స్థితి ఇంచుమించు ఏర్పడింది.

ఒక పేరుపొందిన భారతీయ పురావస్తు శాస్త్రవేత్త ఇటీవలి కాలంలో ఈ దేశంలో చీనాగా వర్ణించబడే దేశానికి వెళ్ళి పర్యవేక్షణలు జరిపిరావటం, తమ పర్యవేక్షణలని వివరించే ఒక గ్రంథాన్ని వెలువ

రించటం ప్రశంసనీయం అనకతప్పదు. కారణాలు ఏమయితేనేమి సన్నిహితంగా ఉండవలిసిన ఈ రెండు దేశాలూ అంతర్జాతీయ రాజకీయ రంగంలో పరస్పర వ్యతిరేక భావాలని ప్రకటిస్తున్నాయి. అయినా సరే, డాక్టర్ కార్తికేయశర్మ 'శాంతి'ని విస్తరించిన బౌద్ధమతం నిర్మాణాలని పరిశీలించి రావటం శుభసూచకం అనుకోవాలి.

డాక్టర్ శర్మ తమ గ్రంథంలో సాంకేతిక పదవివరణ ఇచ్చారు. భారతదేశం, చీనాలమధ్య ఉన్న సంబంధాలు ఎంతపాతవో తెలుపుతూ తాము సందర్శించిన దేశాలలో లభించిన పురావస్తు నిర్మాణాలని వర్ణించారు. అక్కడ బౌద్ధుల కట్టడాలు వగయిరా మాత్రమే కాకుండా బ్రాహ్మణమతం అవశేషాలు సయితం లభించినట్లు డాక్టర్ కార్తికేయశర్మ తెలుపుకున్నారు. ఫూజియన్ రాష్ట్రంలోని "చువాన్ జౌ"లో శివలింగం, విష్ణు విగ్రహం, బ్రాహ్మణ దేవాలయాల ఇతర అవశేషాలు, తమిళ లిపిలో ఒకశాసనం ఇక్కడ దొరికాయిట. వీటిని వెలికి తీసినవారు చీనా ప్రభుత్వం ఉద్యోగిగా ఉంటున్న చీనా చారిత్రికుడు శ్రీ నారాయణ చంద్రసేన్ అనే భారతీయుడు కావటం హర్షదాయకం.

బౌద్ధమతం బాగా ప్రచారం అయ్యేకాలంలో చీనాకి భారతదేశంనుంచి వెళ్ళిన భిక్షువులు ఈ దేశం భాష (ల) ని బాగా తెలిసినవారుగా ఉండేవారు. ఇటీవలి కాలంలో కొందరు టాగూరు వంశంవారు, బాగ్చి పండితుడు, సేన్ పండితుడు, రఘువీర, లోకేష్ చంద్ర, రాహుల్ సాంకృత్యాయన మరికొందరు "జుంగ్‌గువోహువా" అని బెయిజింగ్ ప్రాంతంలో ఉచ్చరించబడే చీనాభాష బాగా నేర్చుకుని ప్రసిద్ధిపొందారు. [చీనా వారికి వారి రాజ్యమే ప్రపంచానికి మధ్యగా ఉన్నదని నమ్మకం. జుంగ్ గువో అంటే మధ్యరాజ్యం అని అనువాదం చెయ్యవచ్చు. "హువా" అంటే భాష అనవచ్చు. చీనా అంతటా 'లిపి' ఒక్కటే కాని అవే 'అక్షరాలని' వివిధప్రాంతాలవారు వేర్వేరు విధాలుగా ఉచ్చరిస్తారు. జుంగ్ గువో హువాలో స్వరాలు కూడా ముఖ్యం. ఒకే శబ్దాన్ని భిన్నమయిన స్వరాలతో పలికితే అర్థాలు మారుతాయి. ఈ గుణం ఒకప్పుడు ఆర్యభాషలకి కూడా ఉండేదని భాషా శాస్త్రవేత్తలు తెలుపుతారు.] ప్రస్తుతం భారతదేశంలో జుంగ్ గువో హువాకి ప్రాచుర్యం తక్కువగా ఉండటం ఖేదం కలిగించే ఒక వాస్తవం.

చీనా, భారతదేశం సంబంధాలు చాలా ప్రాచీన మయినప్పటికీ చారిత్రక ఆధారాలు అనతగినవి క్రీస్తుశకం ప్రారంభానికి కొంచెం ముందుగా ఉన్నవి మాత్రమే లభిస్తున్నాయట క్రీ.పూ. 2లో యువె-క్ష రాజులు కొందరు బౌద్ధగ్రంథాలని చీనా చక్రవర్తికి బహూకరించినట్లు తెలుస్తోందిట.

రచయిత కార్తికేయశర్మ చదువరుల సౌకర్యం కోసం అతి పురాతన కాలంనుంచి గుర్తించబడిన జుంగ్ గువో రాజవంశాల పట్టికని ఇచ్చారు - సుమారుగా క్రీ.పూ. 2100 నుంచి క్రీ.శ. 1911 దాకా!

అలాగే బౌద్ధమతానికి సంబంధించిన కాలక్రమ పట్టికని ఒకదానిని ఇచ్చారు. ఇందులో భారతదేశం - శ్రీలంకలలో శాక్యముని కాలంనుంచి సుమారుగా క్రీ. శ. 10 శతాబ్దం అంతందాకా ఆమతం చరిత్రకి సంబంధించిన విశేషాంశాలు కనబడుతాయి.

చీనా రాజధాని బెయిజింగ్ (ఉత్తర రాజధాని) ప్రాంతం: గాన్‌సు. షాన్‌శీ, హనాన్ రాష్ట్రాలు - వీటిలో తాము చూసిన నిర్మాణాలనీ, పురావస్తు ప్రదర్శన శాలలనీ, అవశేషాలనీ డా॥ కార్తికేయశర్మ వర్ణించారు.

అంతేకాకుండా బౌద్ధమతం స్వీకరించిన చీనా, ఆగ్నేయ భారతదేశం. శ్రీలంకలని గురించి ఒక అధ్యాయం ఈ గ్రంథంలో ఉన్నది. ఇందులో పుటలసంఖ్య తక్కువే కాని సమాచారం కావలసినంతగా లభిస్తుంది.

డాక్టరు ఇంగువ కార్తికేయశర్మ చాలావరకు పురావస్తు శాస్త్రవేత్త దృష్టితో ఈ రచనచేసి ఉండాలి! పండితులకే కాకుండా పామరులకి కూడా ఆసక్తి కలిగించే అంశాలని వివరించే గ్రంథం మరొకటి పామరులకి కూడా ఆసక్తి కలిగించగలిగిన, చీనా - భారతదేశాలమధ్య సంబంధాలని వివరించే గ్రంథం మరొకటి ఆయన వెలువరించగలరని ఆశించాలి.

భారతదేశం చరిత్రమీద మధ్య ఆసియా ప్రభావాన్ని తగినంతగా తెలిపే రచనలు ఎక్కువగా ప్రచురితం కాలేదనవచ్చు. ఈ ప్రభావం మొగల్‌లనుంచి వెనుకకి వెడితే పురాణ-ఇతిహాస కాలాలుగా పరిగణించబడే నాటిదాకా విస్తరిస్తుందని బాగ్చి, బుద్ధప్రకాష్, టార్న్, గ్రూస్సె మొదలయినవారి పుస్తకాలు చదివితే అనిపిస్తుంది. కొన్ని దశాబ్దాలుగా మధ్య ఆసియా ప్రాంతాలలో జరిగే చారిత్రక పరిశోధనల ఫలితాలు అధికంగా రష్యాభాషలోనే ప్రచురించబడటం చేతనేకావచ్చు వాటికి భారతదేశంలో అంత ప్రాచుర్యం లభించటంలేదు. అసలు ఫాహియాన్, హువాన్-ట్సాంగ్, ఈ ట్సింగ్ - ఈ ముగ్గురు చీనా యాత్రికుల పేర్లు తప్ప తక్కినవారివి ఇక్కడ అంతగా సుపరిచితమయినవి కావు. కొందరు చీనాదేశపు చరిత్రకారుల రచనలని పరిశీలిస్తే కొత్త విషయాలు చాలా బయటపడవచ్చు. డాక్టర్ ఇంగువ కార్తికేయశర్మ స్వయంగానూ, ఇతరులకి ప్రోత్సాహం ఇవ్వటంద్వారా ఈ రెండు పెద్ద దేశాలమధ్య సంబంధాలు మరింతగా బయటపడేందుకు వీళ్ళు కల్పించగలరని ఆశించాలి.

గంటి రామలింగం

Printed & Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radhakrishna at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada-3. Editor : S. Radhakrishna, Vijayawada. Phones : 75667 & 61247.